
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 8.00 సంపుటి: 15 సంచిక: 155

SUNDAY Special ఆదివారం 19-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

## హరహర మహాదేవ

రాష్ట్ర వ్యాప్తంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు పార్వతీపరమేశ్వరులకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


- వివరాలు 2లో



## జీఎస్టీ ఫైలింగ్ ఆలస్య రుసుము తగ్గింపు

ఫామ్ జీఎస్‌టీఆర్‌-9కు సంబంధించి రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉంటే ఆలస్య రుసుము రోజుకు రూ.50, రూ.5కోట్ల -20 కోట్ల టర్నోవర్ ఉంటే రోజుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.

- వివరాలు 6లో



## 12 చీతాలు వచ్చేశాయ్!

దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాలు భారత్‌కు చేరుకున్నాయి. వీటిని మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో వదిలిపెట్టారు.

వివరాలు 6లో ►



## మోదీకి బానిసలా మారిన ఈసీ

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాని నరేంద్ర మోదీకి బానిసగా మారిపోయిందని మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఆరోపించారు.

వివరాలు 6లో ►



## అమెరికాలో ఆరుగురి కాల్చివేత

అమెరికాలో ఒంటరితనంలో బాధపడుతున్న ఓ వ్యక్తి తన మాజీ భార్య, సవతి తండ్రితో పాటు మరో నలుగురిని కాల్చి చంపాడు.

వివరాలు 6లో ►



## సిసోడియాకు సీబీఐ పిలుపు

మద్యం స్కాం కేసుకు సంబంధించి ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ ఆదివారం విచారణకు పిలిచింది.


వివరాలు 6లో ►

# నిలువెల్లా.. నిస్తేజం

## ఎల్లో మీడియా, సోషల్ మీడియానే నమ్ముకున్న చంద్రబాబు

### బాదుడే బాదుడు ఫ్లాప్.. ఇదేం ఖర్మ అట్టర్ ఫ్లాప్

- లోకేశ్ పాదయాత్ర తేలిపోవడంతో నేతల్లో నైరాశ్యం
- 60కి పైగా నియోజకవర్గాల్లో పార్టీకి ఇన్‌చార్జ్‌లు కరువు
- పొత్తు లేకుండా ఎన్నికలు ఎదుర్కోవడం టీడీపీ చరిత్రలోనే లేదు.. 20 ఏళ్లు అధికారం చెలాయించిన పార్టీ దుస్థితి
- జనం రారని మైదానాల్లో సభలు నిర్వహించలేని దైన్యం
- ఇరుకు రోడ్లపై సభలతో తండ్రీ కొడుకుల ఉనికిపాట్లు
- ఉత్తరాంధ్ర టీడీపీలో ఎవరికి వారే యమునా తీరే.. అచ్చెన్నాయుడు, కళా మధ్య ఆధిపత్య పోరు



టీడీపీ పరిస్థితి దినదిన గండంగా మారింది. వరుస ఎన్నికల్లో దారుణ పరాజయాలతో నాయకత్వ సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచిన 23 మందిలో నలుగురు ఎప్పుడో పార్టీని వీడారు. మిగిలిన వారిలో నలుగురైదుగురు మినహా అంతా నిస్తేజంలో ఉన్నారు. అత్యధిక నియోజకవర్గాల్లో పార్టీని నడిపించే నాథుడే కరువయ్యాడు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే పార్టీ అధ్యక్షుడు ఏనాడూ సొంతంగా పోటీ చేసే ధైర్యం లేక ఇతర పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారు. సభలు, సమావేశాలకు జనం రారనే భయంతో ఇరుకు రోడ్లపై సభలతో ఉనికి చాటుకునే దీన స్థితికి దిగజారారు. ఒక్క మాటలో చెప్పాలంటే గల్లీ లీడర్ అవతారమెత్తారు.


సాక్షి, అమరావతి: నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన టీడీపీ మనుగడ కోసం పడరాని పాట్లు పడుతోంది. ఎల్లో మీడియా, సోషల్ మీడియాను నమ్ముకుని రాజకీయం చేస్తోంది. క్షేత్ర స్థాయిలో జనాదరణ కరువవ్వడంతో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు నిద్ర కరువైంది. ఓ వైపు తనకు వయో భారం.. మరో వైపు చేతికి అందివచ్చిన కొడుకు పార్టీ పగ్గాలు అందుకోలేకపోతున్నాడని దిగులు. మరెవరికైనా నాయకత్వ బాధ్యతలు

మిగతా 2వ పేజీలో ▶

# తారకరత్న కన్నుమూత

## బెంగళూరు నారాయణ హృదయాలయలో తుదిశ్వాస

- లోకేశ్ పాదయాత్ర ప్రారంభమైన రోజు గుండెపోటు
- 23 రోజులపాటు చావుబతుకుల మధ్య పోరాటం
- సీఎం వైఎస్ జగన్ సహా రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- పార్థివదేహం హైదరాబాద్‌కు తరలింపు



సాక్షి, బెంగళూరు/అమరావతి/శ్రీకాళహస్తి: నందమూరి తారకరత్న (40) శనివారం రాత్రి కన్ను మూశారు. వైద్యులు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. అభిమానుల ప్రార్థనలు ఫలించలేదు. 23 రోజులపాటు చావు బతుకుల మధ్య పోరాటం చేసిన తారకరత్న బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం రాత్రి హైదరాబాద్‌కు తరలించారు. తారకరత్న మృతిపై సీఎం వైఎస్ జగన్‌తోపాటు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. లోకేశ్ పాదయాత్ర ప్రారంభమైన గత నెల 27న

మిగతా 2వ పేజీలో ▶

## మాజీ ఎమ్మెల్యే సర్రాజు హఠాన్మరణం

- గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి
- నివాళులర్పించిన సీఎం వైఎస్ జగన్
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

3 లో



## చంద్రబాబుకు స్క్రిప్టు కోసమే!

### మనబడి నాడు–నేడుపై 'ఈనాడు' కబోది కథనం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లతో సకల వసతులు
- మొదటి దశ కింద రూ.3,669 కోట్లతో 15,713 స్కూళ్లలో అభివృద్ధి పనులు పూర్తి
- రెండో దశలో రూ.8 వేల కోట్లతో 22,344 స్కూళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు
- ఇందులో ఇప్పటికే రూ.3,750 కోట్లు విడుదల
- ఈ వాస్తవాన్ని ఎందుకు చెప్పలేదు రామోజీ?
- రూ.వెయ్యి కోట్ల బిల్లులు బకాయిలుంటే పనులన్నీ ఆగిపోయినట్లా?
- దశల వారీగా బిల్లులు విడుదలవుతాయని తెలియదా?
- తప్పుడు రాతలతో కాంట్రాక్టర్లలో భయం పెంచడమే మీ ఉద్దేశం
- వారు పనులు చేయకుండా ఆపేయాలన్నది మీ కుట్ర

4 లో



# అది ఉత్తుత్తి కథనం

### పంటల బీమాపై వాస్తవాలు కప్పిపుచ్చుతూ 'ఈనాడు' రోత రాతలు

ఒకే అబద్ధాన్ని పదే పదే చెబితే అదే నిజమని ప్రజలు నమ్మేస్తారనే భ్రమలో రామోజీ తప్పుడు కథనాలను వండి వార్చడమే పనిగా పెట్టుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతుంటే.. 'ఈనాడు' మాత్రం నిత్యం విషం కక్కుతూ చంద్రబాబుకు మేలు చేయడమే అజెండాగా పెట్టుకుంది. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాపై వాస్తవాలను కప్పిపుచ్చుతూ రోత రాతలు రాస్తోంది. చంద్రబాబు హయాంలో 2014–15లో 6.39 లక్షల హెక్టార్లకే బీమా చేయగా.. వైఎస్ జగన్ హయాంలో 2021–22లో 54.95 లక్షల హెక్టార్లకు పంటల బీమాను వర్తింపజేశారు.

- వివరాలు 4లో

# 'వరం' కాదని రామోజీ బాధ

### సీఎం వైఎస్ జగన్ హయాంలోనే అత్యధిక శాతం పోలవరం ప్రాజెక్టు పనులు

### తన కమీషన్ల కోసం ప్రాజెక్టును పణంగా పెట్టిన చంద్రబాబు

సీఎం వైఎస్ జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు చకచకా పూర్తవుతుంటే జీర్ణించుకోలేక 'ఆ ఐదేళ్లలోనే పనులు భేష్' అంటూ రామోజీ వంకర రాతలు రాశారు. అత్యధిక శాతం పనులు చంద్రబాబే చేశారని డప్పు కొట్టారు. ఈ డప్పులో ఆత్మీయుడైన బాబుకు రాజకీయ లబ్ధి చేకూర్చాలనే తాపత్రయం అడుగడుగునా కనిపించింది. వాస్తవానికి బాబు నిర్వాకంతో జరిగిన తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ జగన్ వడివడిగా అడుగులు ముందుకు వేయడం అందరూ గమనించారన్న వాస్తవాన్ని రాజగురువు గుర్తెరగాలి.

- వివరాలు 13లో

# మెదడుకూ కావాలి రెస్ట్

## మానసిక ఒత్తిళ్లతో పెరుగుతున్న నిద్రలేమి సమస్య

- ఇవి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీస్తాయంటున్న వైద్య నిపుణులు
- మెదడుకు తగిన విశ్రాంతి ఇస్తే పనితీరు, ఏకాగ్రత మెరుగుపడతాయని వెల్లడి
- ధ్యానం, పుస్తక పఠనం, సంగీతం వంటివి సైతం ఉపయోగకరమే
- సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు రోజూ కాసేపు దూరంగా ఉండాలని సూచన



సాక్షి, హైదరాబాద్: మెదడు.. మన శరీరంలోని అత్యంత సంక్లిష్టమైన నిర్మాణం. ఆలోచనలు, కళలు, జ్ఞాపకాలు, సృజనాత్మకత, తార్కిక బుద్ధి ఇలా అనేక విషయాల్లో మనిషిని ఇతర జీవజాతులకన్నా ఉన్నతంగా, విభిన్నంగా నిలుపుతున్న అవయవం. కోట్లాది న్యూరాన్ల కలబోతగా దైనందిన జీవితంలో చురుకైన పోషిస్తూ.. ఇన్ఫర్మేషన్–ప్రాసెసింగ్ పవర్‌హౌస్ పాత్ర పోషిస్తున్న ఓ మినీ సూపర్ కంప్యూటర్. అయితే నేటి ఆధునిక కాలంలో మనలో రోజురోజుకూ పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లకు మెదడు సైతం ప్రభావితం అవుతోంది. ఫలితంగా నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్న వారి సంఖ్య అధికమవుతోంది. ఈ నేపథ్యంలో మెదడుకు విశ్రాంతి ఇవ్వాల్సిన ఆవశ్యకత, ఇవ్వకుంటే కలిగే దుష్ప్రభావాలపై వైద్య నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. అవి ఏమిటంటే...

మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వకుండా బుర్ర బద్దలయ్యేలా పని చేసేందుకు ప్రయత్నిస్తే దాని వల్ల ఒనగూరే ప్రయోజనాలు అంతంత మాత్రమే.

మెదడు స్పాంజ్ లాంటిది. అది ఎంత వరకు సమాచారాన్ని భద్రపరచుకోగలదో అంతే చేయగలదు. అందువల్ల బ్రెయిన్‌కు నిత్యం రెస్ట్ అవసరమే.

పనిచేస్తున్న రోజుల్లో మధ్యలో విరామం తీసుకోవడం వల్ల మూడ్ బాగుకావడంతోపాటు పనితీరు, ఏకాగ్రత మెరుగుపడుతుంది.

మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వకపోతే అది అనారోగ్య సమస్యలతోపాటు దీర్ఘకాలిక ఒత్తిళ్లకు కారణమవుతుంది.

### మెదడుకు విశ్రాంతి కోసం...

కేవలం నిద్రలోనే మెదడుకు రెస్ట్ దొరుకుతుందనేది కూడా పూర్తిగా శాస్త్రీయం కాదని నిపుణులు అంటున్నారు. మెదడుకు ఎక్కువగా పని కల్పించకుండా ఉంచడం కోసం వివిధ రకాల ధ్యానాలు చేయడం కూడా సరైనదేనని నిపుణులు చెబుతున్నారు. వారి సూచనల ప్రకారం...

- ✔ ప్రకృతిలో కాసేపు మమేకం కావాలి.
- ✔ మెదడు రిలాక్స్ కావడానికి స్నానం కూడా దోహదపడుతుంది.
- ✔ రాత్రిపూట 8 గంటల చొప్పున నిద్రపోనివారు ఉదయం వేళల్లో కాసేపు కునుకు తీసినా మెదడు పనితీరు మళ్లీ చురుగ్గా మారుతుంది.
- ✔ ఏదైనా ఓ ఆట ఆడటం లేదా శారీరక శ్రమతోనూ మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.
- ✔ సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వాడకానికి రోజూ కాసేపు విరామం ఇవ్వడం ద్వారా కూడా మెదడు విశ్రాంతి పొందుతుంది.

### నిద్రలో బ్రెయిన్ వేవ్స్ నెమ్మదిస్తాయి...

సుఖనిద్ర సమయంలో బ్రెయిన్ వేవ్స్ (మెదడు కణాలు విద్యుత్ తరంగాల ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకొనే ప్రక్రియ) నెమ్మదిస్తాయి. ఏదైనా విషయాన్ని 2–3 గంటలపాటు చదివాక కనీసం 15–20 నిమిషాలు నిద్రపోవడమో లేదా కళ్లు మూసుకొని మౌనంగా ఉంటే అది బాగా గుర్తుండిపోతుందని కొత్త అధ్యయనాలు చెబుతున్నాయి. నిద్రలో ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఆర్‌ఈఎం), నాన్ ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఎన్ఆర్‌ఈఎం) అనే పద్ధతులుంటాయి. ఆర్‌ఈఎంలో కలలు, జ్ఞాపకశక్తి, భావోద్వేగ అంశాల వంటివి ప్రాసెస్ అవుతాయి. మనం మెలకువగా ఉన్నప్పుడు ఎలా ఉంటుందో ఆదే యాక్టివిటీ కొనసాగుతుంది. నాన్ ఆర్‌ఈఎంలో అవి సరిగ్గా ప్రాసెస్ కాక మనసు కలతచెందేలా భంగం కలిగిస్తుంటాయి. నాన్ ఆర్‌ఈఎంలో నిద్ర సరిగ్గా పట్టక జ్ఞాపకశక్తి తగ్గడం, భావోద్వేగాలను సరిగ్గా విశ్లేషించకపోవడం వల్ల కలత చెందడానికి కారణమవుతుంది.

– డాక్టర్ నిశాంత్ వేమన, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, సన్‌షైన్/చేతన హాస్పిటల్స్

# టెక్ ఉద్యోగులకు 'లే ఆఫ్స్'

## ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదిలో లక్ష మందికిపైగా టెకీలు ఇంటికి

## అధిక నైపుణ్యం ఉన్న వారికీ తప్పని తొలగింపు తిప్పలు

- ఎక్కువ మందిని తీసేసిన ఐటీ కంపెనీల జాబితాలో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్
- ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్య పరిస్థితులవల్లే..
- మరికొంతకాలం ఈ ట్రెండ్ కొనసాగుతుందంటున్న ఆర్థిక నిపుణులు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో చిన్న, పెద్ద కంపెనీలన్నీ పొదుపు మంత్రం పఠిస్తూ ఉద్యోగాల్లో భారీ కోతలు పెడుతున్నాయి. గతంలో అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్న సంస్థలు.. కోవిడ్ వ్యాప్తి అనంతరం చోటుచేసుకున్న ఆర్థిక పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం వేలాది మందిని తొలగించేస్తున్నాయి. ఉద్యోగాల్లో చేరి పట్టుమని 10 రోజులు పూర్తికాని వారు మొదలు ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్లను సైతం పక్కన పెట్టేస్తున్నాయి. ఈ ప్రభావం ఐటీ, ఇతర టెక్నాలజీ రంగాల ఉద్యోగులపైనే ఎక్కువగా పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ నెలలో ఇప్పటివరకు 17,400 మంది ఐటీ ఉద్యోగులు ఉద్వాసనకు గురవగా వారిలో భారతీయులే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు ఐటీ వర్గాలు చెబుతున్నాయి.. మొత్తంమీద ఇప్పటివరకు 340కిపైగా సంస్థలు, కార్పొరేషన్లు, బడా కంపెనీలు లక్ష మందికి పైగా ఉద్యోగులను తొలగించాయి. ఈ ట్రెండ్‌కు ఇప్పట్లో ఫుల్‌స్టాప్ పడే పరిస్థితులు కనిపించడం లేదని ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

### ముందు వరుసలో బడా కంపెనీలు...

ఉద్యోగుల తొలగింపు సంఖ్యను లెక్కిస్తున్న layoffs.fyi వెబ్‌సైట్ తాజా గణాంకాల ప్రకారం ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 345 టెక్ కంపెనీలు 1,03,767 మందికి లేఆఫ్ ప్రకటించాయి. ఇది 2022 వ్యాప్తంగా జరిగిన అన్ని టెక్ బిజినెస్ లేఆఫ్‌లలో 64 శాతం కావడం గమనార్హం. గతేడాది 1,045 ఐటీ, టెక్ కంపెనీలు 1,60,097 ఉద్యోగులను తొలగించాయి. ఉద్యోగుల తొలగింపులో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, సేల్స్‌ఫోర్స్ మరికొన్ని దిగ్గజ సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి. జనవరిలోనే ప్రపంచవ్యాప్తంగా 288 సంస్థలు, పరిశ్రమలు 3,300 ఐటీ నిపుణులకు ఉద్వాసన పలికాయి. ఈ నెలలో ఉద్వాసనల పర్వం మొదలుపెట్టిన టెక్ దిగ్గజాల్లో యాహూ, బైజూస్, గోడ్యాడీ, గిట్‌హబ్, ఈబే, ఆటోడెస్క్, ఓఎల్ఎక్స్ గ్రూప్ ఉన్నాయి. మొత్తంమీద చూస్తే యాపిల్ సంస్థ మినహా పెద్ద టెక్ సంస్థలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి

### ఎందుకీ పరిస్థితి?

→ ప్రముఖ ఆర్థిక, రాజకీయరంగ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ 'సాక్షి'కి తెలిపిన వివరాల ప్రకారం ఐటీ వ్యాపారాలు అత్యధికంగా ఎగుమతుల ప్రధానమైనవి. ముఖ్యంగా భారత్‌లోని ఐటీ కంపెనీలు ప్రపంచ మార్కెట్‌కు ఎక్కువగా దోహదపడేవిగా ఉన్నాయి. అందువల్ల ప్రపంచ ఆర్థిక రంగంలో వచ్చే మార్పులకు అవి కూడా లోనవుతున్నాయి. ముఖ్యంగా కరోనా వ్యాప్తి, ఆ తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా–చైనాల వాణిజ్య చిక్కులు పశ్చిమ దేశాల ఆర్థిక రంగంపై సవాళ్లు విసురుతున్నాయి. అందువల్ల ఈ పరిణామాల ప్రభావం భారత ఐటీ రంగంపైనా పడుతోంది. ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో కంపెనీల యాజమాన్యాలు నీల సిబ్బందిని తగ్గించుకుంటున్నాయి. కరోనా కాలంలో ఐటీ రంగం అసహజమైన వృద్ధిని సాధించింది. గతంలో కంపెనీలు సాధారణ రిక్రూట్‌మెంట్ కంటే ఎక్కువ చేశాయి. ఇప్పుడు సిబ్బందిని తగ్గించుకోవడం మొదలుపెట్టాయి. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికత మరింతగా అందుబాటులోకి రావడంతో అధిక నైపుణ్యం ఉన్న వారు కూడా ఉద్యోగాలు కోల్పోతున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ రంగంలోనే ఉద్యోగులు, కార్మికుల వేతనాలు తగ్గుతున్నాయి.

# పొలడుగు.. పుడమి దీక్ష!

- తొమ్మిదేళ్లుగా చెప్పులు వేసుకోని యువకుడు
- భూమాతతో అనుబంధం విడిపోకూడదనే సంకల్పం
- పర్యావరణ పరిరక్షణ కోసం కృషి.. గ్రామాలకు వెళ్తూ ప్రజలకు అవగాహన

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: చాలా మంది దేవుళ్ల పేరిట నియమ నిష్టలతో దీక్షలు చేస్తుండటం చూస్తూనే ఉంటాం.. కానీ 21 ఏళ్ల యువకుడు పొలడుగు జ్ఞానేశ్వర్ పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో 'పుడమి' దీక్ష తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షించేందుకు నడుం బిగించిన ఆయన.. భూమాతతో అనుబంధం విడిపోకూడదనే ఉద్దేశంతో తొమ్మిదేళ్లుగా చెప్పులు కూడా వేసుకోవడం లేదు. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్ గ్రామానికి చెందిన పొలడుగు జ్ఞానేశ్వర్ జువాలజీలో పీజీ చేశారు. జ్ఞానేశ్వర్ కుటుంబానికి మంజీరా తీరానికి సమీపంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. కొన్నేళ్లుగా నదిలో నీరు లేక పొలాలన్నీ బీడువారాయి. దీంతో చలించిపోయిన జ్ఞానేశ్వర్ పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం మొదలుపెట్టారు. ధరణి బాగుంటేనే మనం బాగుంటామని, మొక్కలు నాటడంతోనే సరిపోదని, ఉన్న చెట్లను నరకకుండా కాపాడుకుంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని చాటి చెబుతున్నారు.

**గ్రీన్ సోల్జర్లను ఏర్పాటు చేసుకుని..**

జ్ఞానేశ్వర్ తమ చుట్టుపక్కల ఉన్న సుమారు 35 గ్రామాల్లో హరిత సైన్యాన్ని (గ్రీన్ సోల్జర్స్)ను ఏర్పాటు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులను హరిత సైనికులుగా ఏర్పాటు చేసుకున్నాడు. పర్యావరణ పరిపరక్షణ, మొక్కలు నాటడంపై వారికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా చెట్లు నరికేందుకు ప్రయత్నిస్తే ఆపాలని, వెంటనే తనకు ఫోన్ చేయాలని వారికి చెప్పారు. అలా ఫోన్ చేస్తే ఆ గ్రామానికి వెళ్లి విద్యార్థులతో కలిసి చెట్లను కౌగిలించుకుంటారు.

### యాత్రలతో అవగాహన

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జ్ఞానేశ్వర్ తరచూ గ్రామాల్లో హరిత సైనికులతో కలిసి పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేస్తుంటారు. నాగల్‌గిద్ద, కంగ్టి, మనూర్, నారాయణఖేడ్, న్యాల్‌కల్ తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇలా యాత్రలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న జ్ఞానేశ్వర్‌కు ప్రతిష్టాత్మకమైన 'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డు కూడా దక్కింది.

## రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. 'సర్వ సృష్టికి సంకేతంగా, స్థావర జంగమ సంగమ స్వరూపంగా, లింగమయ్యగా, జంగమయ్యగా, శివునిగా, భవునిగా, సాంబశివునిగా అనునిత్యం కొలుచుకుంటున్న పరమశివుని పర్వదినం శ్రీకరం. శుభకరం. సకల మంగళకరం. పార్వతీ పరమేశ్వరుల శుభాశీస్సులు మనందరికీ అందాలని కోరుకుంటున్నాను' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

## జల్లికట్టు.. బహుమతి పట్టు



మహాశివరాత్రిని పురస్కరించుకుని చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని సీఆర్ కండ్రిగ గ్రామంలో జల్లికట్టు ఉత్సవం శనివారం ఉత్సాహంగా సాగింది. కోడె గిత్తలను అందంగా అలంకరించి, వాటి కొమ్ములకు బహుమతులు కట్టి బరిలోకి దించారు. వేగంగా దూసుకుపోతున్న గిత్తలను నిలువరించి బహుమతులు చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. – వెదురుకుప్పం(చిత్తూరు జిల్లా)

## రూ.680 కోట్లతో యకహోమా విస్తరణ

- విశాఖలో మరో యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- ఏటా 17 లక్షల ప్యాసింజర్ కార్ టైర్లను ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడి
- 2024 చివరి కల్లా ఉత్పత్తి ప్రారంభం
- ఇప్పటికే రూ.1,384 కోట్ల పెట్టుబడితో హాఫ్ హైవే టైర్ల యూనిట్ ఏర్పాటు
- ప్రత్యక్షంగా 2,000 మందికి ఉపాధి

సాక్షి, అమరావతి: జపాన్‌కు చెందిన ప్రముఖ టైర్ల తయారీ సంస్థ యకహోమా గ్రూప్ విశాఖపట్నం యూనిట్‌ను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. సుమారు రూ.680 కోట్ల పెట్టుబడితో ప్యాసింజర్ల కార్ టైర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ఏడాదికి దాదాపు 17 లక్షల టైర్ల తయారీ సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేయబోతోంది. 2024 చివరి త్రైమాసికానికి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ప్రస్తుతం 28 లక్షల టైర్లుగా ఉన్న ఏటీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 45 లక్షల టైర్లకు చేరుకోనుంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న యూనిట్‌లో 22 అంగుళాల వరకు ఉండే టైర్లను ఉత్పత్తి చేస్తారు. దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోందని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా భారత్ అవతరించిందని.. ఇదే రకమైన వృద్ధి భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని యకహోమా అంచనా వేస్తోంది. 2007లో 7 లక్షల టైర్ల ఉత్పత్తి సామర్థ్యంతో భారత్‌లోకి అడుగుపెట్టిన యకహోమా గ్రూప్ వేగంగా విస్తరిస్తోంది. ఈ గ్రూప్‌కు భారత్‌లో ఇప్పటికే రెండు యూనిట్లు(తిరునెల్వేలి, దోహేజ్) ఉండగా.. మూడో యూనిట్‌ను విశాఖ సమీపంలోని అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసింది.

**సీఎం చేతుల మీదుగా తొలి దశ ప్రారంభం..**

యకహోమా గ్రూప్ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసిన అలయన్స్ టైర్స్ కంపెనీ(ఏటీసీ)ని సీఎం వైఎస్ జగన్ ఆగస్టు 16న ప్రారంభించారు. తొలి దశలో రూ.1,384 కోట్లతో హాఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్‌ను ఈ సంస్థ ఏర్పాటు చేసింది. 3.7 కేజీల నుంచి 1.26 కేజీల బరువు ఉండే భారీ టైర్లను ఈ యూనిట్‌లో తయారు చేస్తోంది. ఇక్కడ తయారైన టైర్లను 120కు పైగా దేశాలకు ఎగుమతి చేయనుంది. విశాఖ యూనిట్ల ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది.

## టన్నుల్లో దొంగ బంగారం

- మూడేళ్లలో 8,424.78 కిలోల స్మగ్లింగ్ స్వర్ణం స్వాధీనం
- 9,408 కేసుల్లో 4,635 మంది అరెస్టు
- పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

సాక్షి, అమరావతి: భారత్‌లో పసిడికి ఉన్న డిమాండ్ అంతాఇంతా కాదు. ఇదే స్మగ్లర్లకు కొంగుబంగారంగా మారింది. కోవిడ్ సమయంలో విమానాల రాకపోకలపై ఆంక్షలతో 2020లో కొంత మేర బంగారం స్మగ్లింగ్ తక్కువగా ఉన్నప్పటికీ ఆ తరువాత 2021, 2022 సంవత్సరాల్లో స్మగ్లింగ్ బంగారం పరిమాణం పెరిగింది. దేశంలో 2020 నుంచి 2022 వరకు అలాగే ఈ ఏడాది జనవరి వరకు స్వాధీనం చేసుకున్న స్మగ్లింగ్ బంగారం పరిమాణాన్ని ఇటీవల పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. 2020 సంవత్సరంతో పోల్చి చూస్తే 2022లో స్వాధీనం చేసుకున్న స్మగ్లింగ్ బంగారం పరిమాణం 1,347.58 కేజీలు ఎక్కువగా ఉంది. 2020వ సంవత్సరం నుంచి ఈ ఏడాది జనవరి వరకు స్వాధీనం చేసుకున్న స్మగ్లింగ్ మొత్తం బంగారం ఏకంగా 8,424.78 కిలోలు. ఈ కాలంలో బంగారం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ 9,408 కేసుల్లో 4,635 మందిని అరెస్టు చేశారు. స్మగ్లర్లు ఉపయోగించే కొత్త కొత్త విధానాలు, పద్ధతులను ఎప్పటికప్పుడు కనిపెడుతూ అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు పంకజ్ తెలిపారు.

**మాదకద్రవ్యాలదీ అదే రూటు**

దేశంలో డ్రగ్స్ స్మగ్లింగ్ కూడా పెరుగుతోంది. 2020 ఏడాదిలో 55,622 డ్రగ్స్ స్మగ్లింగ్ కేసుల్లో 73,841 మందిని అరెస్టు చేశారు. 2021లో 68,144 కేసుల్లో 93,538 మందిని, 2022 జనవరి నుంచి నవంబర్ వరకు 66,758 స్మగ్లింగ్ కేసుల్లో 80,374 మందిని అరెస్టు చేశారు. మూడేళ్లలో అత్యధికంగా 19.49 లక్షల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో హెరాయిన్, కొకైన్ వంటివి కూడా ఉన్నాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు వివిధ సంస్థల మధ్య సమర్థవంతమైన సమన్వయం కోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నార్కో కో–ఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని పంకజ్ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రించేందుకు ప్రతీ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

# హరహర మహాదేవ

- రాష్ట్ర వ్యాప్తంగా శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- పార్వతీపరమేశ్వరులకు విశేష అభిషేకాలు, పూజలు, సేవల నిర్వహణ



కోటప్పకొండలో విద్యుత్ వెలుగుల్లో ప్రభలు

సాక్షి, అమరావతి/శ్రీశైలం టెంపుల్/సాక్షి, నరసరావుపేట/శ్రీకాళహస్తి రూరల్: హరహర మహాదేవ..శంభో శంకర అంటూ శైవ క్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని పోటెత్తిన భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. ప్రముఖ శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు నదులు, కాలువల్లో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్లలో బారులు తీరారు. పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, వివిధ వాహన సేవలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించుకుని భక్తులకు కనుల విందు చేశారు.

**శ్రీశైలం భక్తజనసంద్రం**

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తజనసంద్రంగా మారింది. నల్లమల కొండలు శివనామస్మరణతో పరవశించాయి. శనివారం మల్లన్న, భ్రమరాంబదేవిలకు దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఆలయ ఈవో ఎస్. లవన్న దంపతులు, ప్రధానార్చకులు వీరయ్యస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు శివపార్వతులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పరిమళపుష్పాలతో అలంకరించి ఆశీనులు గావించారు. వేదపండితులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ఆదిదంపతులు ఒకటయ్యారు.

**నీలకంఠుడికి పాగాలంకరణ**

మహాశివరాత్రి పర్వదినాన శ్రీమల్లికార్జునస్వామికి ఆలయంపై పాగాలంకరణ శివరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేకం. ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన చేనేత కార్మికుడు పృథ్వీ వెంకటేశ్వర్లు స్వామి వారి గర్భాలయ విమాన



శ్రీకాళహస్తిలో స్వామి, అమ్మవార్ల వాహన సేవలో భక్తులు

గోపురం, ముఖమండపంపై ఉన్న 14 నందులను కలుపుతూ పాగాలంకరణ చేశారు.

**కోటప్పకొండకు పోటెత్తిన భక్తులు**

పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో నిండిపోయింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని తెలుగురాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు శనివారం శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కోటప్పకొండ ప్రత్యేకతైన ప్రభల ఉత్సవం ఘనంగా జరిగింది. ఏకంగా 22 భారీ విద్యుత్ ప్రభలతో పాటు చిన్న చిన్న ప్రభలు ప్రభల నిధికి చేరాయి. రాత్రి స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



శ్రీశైల ఆలయంపైన ఉన్న నవనందులకు అర్ధరాత్రి పాగాను అలంకరించిన దృశ్యం

**శివనామస్మరణతో మార్మోగిన శ్రీకాళహస్తి**

దక్షిణ కైలాసంగా పేరొందిన శ్రీకాళహస్తి మహాశివరాత్రిని పురస్కరించుకుని శివనామస్మరణతో మార్మోగింది. స్వామి, అమ్మవారికి ఉదయం నుంచి రాత్రి వరకు శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లు ఇంద్ర విమానం–చప్పరంపై ఊరేగారు. రాత్రి స్వామి వారు నంది వాహనంపై, అమ్మవారు సింహ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నంది వాహన సేవ సమయంలో ఉత్సవమూర్తులు స్వర్ణాభరణాల అలంకరణతో మెరిసిపోయారు.

**పంచారామాల యాత్ర**

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పంచారామాలైన ద్రాక్షారామం



శ్రీశైలంలో భక్తులతో పోటెత్తిన పాతాళగంగ

శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానం, సామర్లకోట శ్రీకుమార భీమారామం, అమరావతి శ్రీఅమరేశ్వర స్వామి దేవస్థానం, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి దేవస్థానం, భీమవరం సోమేశ్వరస్వామి దేవస్థానం యాత్రికులతో కిటకిటలాడాయి. అలాగే మహానంది ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

**జాగరణకు ఏర్పాట్లు**

శివాలయాల్లో జాగరణ నిమిత్తం తరలివచ్చిన భక్తుల కోసం ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాటు చేశారు. భరత నాట్యం, బుర్రకథ, హరికథ కాలక్షేపాలతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు తెల్లవార్లు జరిగేలా సిద్ధం చేశారు.

# నిలువెల్లా.. నిస్తేజం

▶ మొదటి పేజీ తరువాయి

అప్పగించేందుకు మనసొప్పని నైజం. ఈ పరిస్థితిలో ఫొటోలు, వీడియోల కోసం మీడియా సమావేశాలు, చిన్నపాటి సభలు నిర్వహించడం మినహా ఎలాంటి కార్యకలాపాలు లేవు. చంద్రబాబు ఎన్ని పిలుపులు ఇచ్చినా పార్టీ యంత్రాంగం పట్టించుకునే పరిస్థితుల్లో లేదు. బాదుడే బాదుడు కార్యక్రమం జనం లేక ఫ్లాప్ అయింది. దీంతో పేరు మార్చి 'ఇదేం ఖర్మ' అంటూ కొత్త కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చినా స్పందన లేకపోవడంతో ఇరుకు రోడ్లు, కానుకల పంపిణీ వ్యూహాన్ని ఎంచుకున్నారు. ఇరుకు సందుల్లో సభలు పెట్టి వచ్చిన కొద్దిపాటి జనాన్ని ప్రభంజనంగా చూపించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి కందుకూరు సభలో 8 మంది, గుంటూరు చంద్రన్న కానుకల పంపిణీలో ముగ్గురు మహిళలు మృత్యువాత పడ్డారు. ఈ పరిస్థితుల్లో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆరంభం నుంచే వెలవెలబోతోంది. చిత్తూరు జిల్లా పాదయాత్రలో ఇటీవల ఓ రోజు జనం లేక లోకేశ్ చాలాసేపు బస్సులోనే గడిపారు. దీంతో చంద్రబాబు స్థానిక నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి జన సమీకరణ ఎందుకు చేయలేకపోయారని మండిపడ్డారు. యాత్ర ఆసాంతం పేలవంగా సాగుతుండడంతో టీడీపీ నేతలకు పాలు పోవడం లేదు. అనుకూల మీడియాలో హడావుడి మినహా పాదయాత్రలో విషయం లేదని స్పష్టమైంది.

### ఉత్తరాంధ్రలో అగమ్య గోచరం

- ఉత్తరాంధ్రలో టీడీపీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఒకవైపు జనం పట్టించుకోక పార్టీ బలహీనంగా మారినా ముఖ్య నాయకులు మాత్రం పార్టీలో ఆధిపత్యం కోసం కుమ్ములాడుకుంటున్నారు. ఒకరంటే ఒకరికి పడక తెర వెనుక వారికి వారే గోతులు తవ్వుకుంటున్నారు.
- శ్రీకాకుళం జిల్లాలో వర్గాలుగా విడిపోయి రాజకీయాలు నడుపుతున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మరో నేత కళా వెంకట్రావు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి ఉంది. జిల్లాలో తెలుగుదేశం పార్టీ అచ్చెన్న గ్రూపు, కళా గ్రూపుగా విడిపోయి ఉంది.
- అచ్చెన్నను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించి మరో బీసీకి అవకాశం ఇవ్వాలని కళా వెంకట్రావు పొలిట్‌బ్యూరో సమావేశంలో చంద్రబాబు సమక్షంలోనే విరుచుకుపడ్డారు. నారా లోకేశ్ అచ్చెన్నాయుడిని వ్యతిరేకిస్తూ కళా గ్రూపును ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు మద్దతుతో అచ్చెన్న జిల్లాలో తన వర్గంతో రాజకీయాలు చేస్తున్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల,



పాతపట్నం నియోజకవర్గాల్లో కళా, అచ్చెన్న గ్రూపులకు చెందిన నాయకులు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూనే ఉన్నారు.

### బాబాయ్, అబ్బాయ్ మధ్యా విభేదాలు

- అచ్చెన్నాయుడికి కళా వెంకట్రావుతోనే కాకుండా తన అన్న కుమారుడు, శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడితోనూ విభేదాలున్నాయి. లోకేశ్ అచ్చెన్నాయుడిని పక్కనపెట్టి రామ్మోహన్‌నాయుడికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో రామ్మోహన్‌ను ఎమ్మెల్యేగా పోటీ చేయించి అచ్చెన్నకు చెక్ పెట్టాలని లోకేశ్ భావిస్తున్నారు. రామ్మోహన్ కూడా అదే దిశగా బాబాయ్ స్థానంలో తాను కీలక నేతగా ఎదగడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గాల్లో తన వర్గాన్ని ప్రత్యేకంగా పెంచి పోషిస్తున్నారు.
- నర్సన్నపేట నియోజకవర్గంలో అచ్చెన్న, రామ్మోహన్ వర్గాలు ఎవరికి వారే యమునా తీరే చందంగా వ్యవహరిస్తున్నారు. అచ్చెన్నకు ఒకవైపు కళా వెంకట్రావు, మరోవైపు రామ్మోహన్‌లు మోహరించడంతో ఏంచేయాలో పాలుపోని పరిస్థితి. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలోని నేతల మధ్య అచ్చెన్న సయోధ్య కుదర్చలేకపోయారు.

**విశాఖలో తోడల్లుడికి లోకేశ్ ఎసరు**

- విశాఖపట్నంలో తోడల్లుడు భరత్‌కు.. లోకేశ్ ఎసరు పెడుతున్నట్లు టీడీపీ నేతలే వాపోతున్నారు. భరత్‌ను రాజకీయంగా ఎదగనివ్వకూడదని లోకేశ్.. ఆయనకు వ్యతిరేకంగా మొదటి నుంచీ పావులు కదుపుతున్నారు. గత ఎన్నికల్లో భరత్‌కు ఎంపీ సీటు ఇచ్చినా నేతలు, క్యాడర్ పని చేయకుండా అడ్డుపడ్డారని స్థానిక నేతలు చెబుతున్నారు.
- మళ్లీ ఎంపీగా పోటీ చేయాలని భరత్ పట్టు పడుతుంటే లోకేశ్ అడ్డు తగిలి కొద్దిరోజులు విశాఖ సౌత్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఇచ్చారు. ఇప్పుడు అది కూడా లేదు. అయితే ఎంపీ లేకపోతే భీమిలి సీటు ఇవ్వాలని భరత్ అడుగుతున్నా లోకేశ్ ఆయన్ను పూర్తిగా పక్కన పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో తోడల్లుళ్ల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి.

**ధ్యాసంతా పొత్తుల పైనే!**

ఏ ఎన్నికలోనూ పొత్తు లేకుండా ఎన్నికలు ఎదుర్కోవడం టీడీపీ చరిత్రలోనే లేదు. 20 ఏళ్ల అధికారం చెలాయించిన పార్టీ దుస్థితి ఇది. పొత్తు లేకపోతే ఇక అంతేననే భయంతో ఒక్క స్థానంలో కూడా గెలవని పార్టీతో పొత్తు కోసం తహతహలాడుతుండటం ఆ పార్టీ దయనీయ స్థితిని తెలియజేస్తోంది. జనం రారని మైదానాల్లో సభలు నిర్వహించలేని దైన్యం. ఇరుకు రోడ్లపై సభలతో తండ్రీ కొడుకులు ఉనికిపాట్లు పడుతున్నారు. 175 నియోజకవర్గాలకుగాను 60కి పైగా స్థానాల్లో ఇన్‌చార్జ్‌లే లేరు. నేతలు ముఖం చాటేయడంతో కొత్త వారిని ప్రోత్సహిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది. పిలిచి పార్టీ పదవులు ఇస్తామన్నా తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో కొంత మందికి నెలవారీ జీతాలిచ్చి అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమించుకున్నారు. వారే ఇప్పుడు మీడియా సమావేశాల్లో ఊదరగొడుతున్నారు. కొమ్మారెడ్డి పట్టాభి లాంటి నేతలు ఈ కోవకు చెందినవారే.

- లోకేశ్ అండతో శ్రీకాకుళం జిల్లా టీడీపీ రాజకీయాల్లో పైచేయి సాధించడానికి ప్రయత్నిస్తున్న కళా వెంకట్రావు సొంత నియోజకవర్గం ఎచ్చెర్లలో మాత్రం ఎదురీదుతున్నారు. కలిశెట్టి అప్పలనాయుడు, చౌదరి బాబ్జి వర్గాలు ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కళా వెంకటరావును ఓడించడమే లక్ష్యంగా వారు పని చేస్తున్నారు.

### అశోక్‌ను వ్యతిరేకిస్తున్న కీలక నేతలు

- విజయనగరం జిల్లాలో మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు ఆధిపత్యాన్ని పలువురు నేతలు సవాల్ చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున జిల్లాలో తన వర్గాన్ని పెంచుకుంటూ అశోక్‌ను వ్యతిరేకిస్తున్నారు. విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు కూడా అశోక్ గజపతికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు.
- విజయనగరంలో మీసాల గీత అశోక్‌తో సంబంధం లేకుండా ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని పని చేస్తున్నారు. ఈ పంచాయితీ చంద్రబాబు వద్దకు వెళ్లినా సర్దుబాటు కాలేదు. ఈసారి విజయనగరం ఎమ్మెల్యే సీటు అశోక్ కుటుంబానికి కాకుండా బీసీ వర్గానికి ఇవ్వాలని వీరంతా చంద్రబాబుపై ఒత్తిడి తెస్తున్నారు. అశోక్ కబంధ హస్తాల నుంచి టీడీపీని విడిపించాలని, ఆయనకు బానిసత్వం చేయలేమని ఈ గ్రూపు చెబుతోంది.
- నెల్లిమర్లలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడికి ఇతర నేతలతో సఖ్యత లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యత నుంచి నారాయణస్వామి నాయుడును తప్పించి బంగార్రాజును నియమించడంతో విభేదాలు మరింత ముదిరాయి. నారాయణస్వామి వర్గం బహిరంగంగానే తమ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. జనాదరణ లేకపోయినా నియోజకవర్గ టీడీపీ నేతలు నాలుగు వర్గాలుగా విడిపోయి రాజకీయాలు చేస్తున్నారు.
- చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునను అక్కడ పలువురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పలువురు నేతలు లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ టికెట్ స్థానికులైన తమలో ఎవరో ఒకరికి ఇవ్వాలని నాగార్జున నాన్ లోకల్ అని కుండబద్దలు కొట్టారు.

### అయ్యన్న వర్సెస్ గంటా

- విశాఖ జిల్లాలో చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు మధ్య ఆది నుంచి విభేదాలే. ఇటీవలే గంటాకు వ్యతిరేకంగా అయ్యన్న చేసిన వ్యాఖ్యలు పార్టీలో దుమారం రేపాయి. 'గంటా శ్రీనివాసరావు ఎవడు? లక్ష మందిలో ఆడొకడు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు బొక్కలో దాక్కుని.. ఇప్పుడు బయటకు వస్తున్నాడు. ఎవడి చంక నాకడానికి వస్తాడు' అంటూ తీవ్ర విమర్శలు చేశారు.
- ఇన్నాళ్లు పార్టీతో అంటీముట్టనట్లు ఉన్న గంటా ఇప్పుడు యాక్టివ్ అవుతుండడాన్ని జీర్ణించుకోలేని అయ్యన్న ఆయనపై కాలు దువ్వుతూ తనదైన అసభ్య భాషతో బహిరంగంగానే తిట్టడం చర్చనీయాంశమైంది. దీంతో గంటా.. అయ్యన్నకు వ్యతిరేకంగా ఆయన నియోజకవర్గం నర్సీపట్నంలో కుంపటి పెట్టేందుకు రెడీ అయ్యారు. నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే ముత్యాల పాప, ఎర్రా పాత్రుడు వంటి నేతలు అయ్యన్నకు వ్యతిరేకంగా స్వరం పెంచడం వెనుక గంటా ఉన్నట్లు స్పష్టమవుతోంది. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అయ్యన్నపాత్రుడి మధ్యా విభేదాలున్నాయి. గంటాపై అయ్యన్న చేసిన వ్యాఖ్యలను బండారు కొడుకు అప్పలనాయుడు ట్విటర్‌లో తప్పుపట్టారు. అలాగే బండారు సత్యనారాయణమూర్తికి, మరో నేత గండి బాబ్జికి పొసగడం లేదు. పెందుర్తి సీటు కోసం ఇద్దరు తగవులాడుకుంటున్నారు.

# తారకరత్న కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

గుండెపోటుకు గురైన తారకరత్నకు సుమారు 45 నిమిషాల పాటు మెదడుకు రక్త ప్రసరణ ఆగిపోయింది. ఆ సమయంలో రక్తం గడ్డకట్టడంతో మెదడులో ఒకవైపు వాపు వచ్చినట్టు తెలిసింది. అప్పటి నుంచి బ్రెయిన్‌కు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు చేస్తూ వచ్చారు. తొలుత బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రి నుంచి ప్రత్యేకంగా వైద్యులను పిలిపించి చికిత్స అందించగా, వారం నుంచి విదేశాల నుంచి ప్రత్యేకంగా న్యూరోసర్జన్లు, న్యూరాలజిస్టులను కూడా రప్పించి చికిత్స అందించారు. అయినప్పటికీ తారకరత్న ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మధ్యలో పరిస్థితి కొంచెం మెరుగైందని, చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటున్నారనే వార్తలు వచ్చినా, రెండు రోజులుగా పరిస్థితి మరీ క్షీణించడంతో విషమంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు నందమూరి కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్నారు. పూర్తి సమాచారాన్ని వైద్యులు వారికి వివరించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు వెంటిలేటర్ తొలగించారు.

**సీఎం వైఎస్ జగన్ సంతాపం**

సినీ నటుడు, ఎన్టీఆర్ మనవడు నందమూరి తారకరత్న మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తారకరత్న మరణ వార్త తనకు తీవ్ర దిగ్భ్రాంతి, బాధను కలిగించిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తారకరత్నను బతికించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, కుటుంబ సభ్యుల, అభిమానుల ప్రార్థనలు, అత్యంత నిపుణులైన డాక్టర్ల వైద్యం ఫలితాన్ని ఇవ్వలేదన్నారు. తారకరత్న ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు చంద్రబాబు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

**ఒకేసారి 9 సినిమాలతో రికార్డు**

ఎన్టీఆర్ ఐదో కుమారుడైన నందమూరి మోహనకృష్ణ, శాంతిమోహన దంపతులకు 1983 ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లో జన్మించారు తారకరత్న. ఛాయాగ్రాహకుడిగా మోహనకృష్ణకు మంచి పేరుంది. చెన్నైలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత హైదరాబాద్‌కు మకాం మార్చిన తారకరత్న జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్‌లో ఉన్నత పాఠశాల చదువు పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని విజ్ఞాన్ భవన్‌లో బీటెక్ చదువుకున్నారు. మొత్తం 23 సినిమాలు, ఒక వెబ్ సిరీస్‌లో తారకరత్న నటించారు. ఆయన చిత్రరంగ ప్రవేశమే ఒక రికార్డు. 20 ఏళ్ల వయసులో ఒక హీరోగా తారకరత్న ఒకేసారి 9 సినిమాలు ప్రారంభించడం అప్పట్లో రికార్డు. 2001లో ఒకటో నంబర్ కుర్రాడు సినిమా ద్వారా తెరంగేట్రం చేశారు. అమరావతి సినిమాతో ఆయనను నంది అవార్డు వరించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో కథానాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా నటించారు. 'మహాభక్త సిరియాల'లో శివ భక్తుడిగా నటించిన తారకరత్న మహాశివరాత్రి నాడు శివైక్యం పొందారు. 2012లో అలేఖ్యారెడ్డిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. నందీశ్వరుడు సినిమాకు అలేఖ్యారెడ్డి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**అభిమానుల ఆందోళన**

తారకరత్న మరణవార్త విన్న నందమూరి అభిమానులు నారాయణ హృదయాలయకు వందలాదిగా చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి వెనుక గేటు నుంచి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. తమకు చివరి చూపు కూడా దక్కకుండా అలా తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ కాసేపు ఆందోళన చేపట్టారు.

**పాదయాత్ర ప్రారంభం రోజునే..**

నందమూరి తారకరత్న గత నెల 27న కుప్పంలో లోకేశ్ పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంట ఉన్న నాయకులు ఆయన్ను అక్కడి నుంచి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయనకు పల్స్ అందడం లేదని వైద్యులు తెలిపారు. అక్కడే క్రిటికల్ కేర్ వైద్యం చేశారు. అయితే తారకరత్న గుండెపోటుతో అప్పుడే ప్రాణాలొదిలినా.. లోకేశ్ పాదయాత్రను దృష్టిలో ఉంచుకుని బెంగళూరు ఆస్పత్రికి తరలించారనే ప్రచారం జరిగింది. లోకేశ్‌కు చెడ్డ పేరు రాకూడదనే ఇన్నాళ్లూ మెరుగైన వైద్యం పేరుతో కథ నడిపించారని టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎట్టకేలకు పర్వదినమైన శివరాత్రి రోజున తారకరత్న శివైక్యం చెందినట్లు ప్రకటించడం గమనార్హం.





తారకరత్నను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో పాల్గొని కుప్పకూలిపోతున్న నందమూరి తారకరత్న





క్లుప్తంగా...

## పిల్లల ఆధార్ నమోదుకు కొత్త నిబంధన

సాక్షి, అమరావతి: పిల్లల ఆధార్ కార్డుల జారీకి వారి తల్లిదండ్రుల ఆధార్ నంబర్లు దరఖాస్తు ఫారంలో తప్పనిసరి చేస్తూ ఆధార్ కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రుల ఇద్దరి ఆధార్ నంబర్ల నమోదుతో పాటు ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు తమ ఆధార్ బయోమెట్రిక్‌తో కూడిన ఆమోదం తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ యూఐడీఏఐ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకరన్ ఆదేశాలు జారీ చేశారు.

**వయసును బట్టి దరఖాస్తు ఫారం**

- ఐదేళ్లలోపు పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డుల జారీ లేదా ఆధార్‌లో వారి వివరాల అప్‌డేట్ చేసేందుకు ఒక రకమైన దరఖాస్తు ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.
- ఐదు ఏళ్లకు పైబడి 18 ఏళ్ల మధ్య వయసు వారికి వేరే దరఖాస్తు ఫారం నమూనాను యూఐడీఏఐ సంస్థ విడుదల చేసింది.
- 18 ఏళ్ల పైబడిన వారికి మరో ఫార్మాట్‌లో దరఖాస్తు ఫారం ఉంటుందని పేర్కొంది.
- ఈ మేరకు మూడు రకాల దరఖాస్తు ఫారాల నమూనాలను యూఐడీఏఐ తాజాగా జారీ చేసిన ఆదేశాలతో పాటే విడుదల చేసింది.
- ఈ నెల 15వ తేదీ నుంచి ఈ మూడు రకాల దరఖాస్తు ఫారాల విధానం అమలులోకి రాగా.. దరఖాస్తు ఫారాలను అన్ని భాషల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపింది.

# స్మగ్లింగ్ దందా.. 51 లక్షల ఉద్యోగాలకు ఎసరు



**అక్రమ వ్యాపారంతో దేశ ఆర్థిక వ్యవస్థకు విఘాతం**

**టాప్-5 కేటగిరీల్లో ఏటా రూ. 2.60 లక్షల కోట్ల వ్యాపారం**

**రూ. 58 వేల కోట్ల పన్ను ఎగవేత**

**ఫిక్కీ అధ్యయన నివేదికలో వెల్లడి**

సాక్షి, అమరావతి: తక్కువకు వస్తాయనే ఉద్దేశంతో కొంతమంది స్మగుల్ గూడ్స్ కొంటూ ఉంటారు. ఈ అక్రమ వ్యాపారం ద్వారా ఏటా లక్షల కోట్లు చేతులు మారతాయంటే నమ్మగలమా? ఈ స్మగ్లింగ్ వల్ల ఏటా వేలాది కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థనే దెబ్బతీస్తోంది. దేశంలో పరిశ్రమల విస్తరణకు విఘాతంగా మారి ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తోంది. స్మగ్లింగ్ దందా దేశ ఆర్థిక వ్యవస్థను ఎంతగా దెబ్బతీస్తోందనే అంశంపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ప్రముఖ మార్కెట్ అధ్యయన సంస్థ 'థాట్ ఆర్బిట్రేజ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(టీఏఆర్ఐ) ద్వారా అధ్యయనం చేయించింది. దేశ మార్కెట్లోకి అక్రమంగా చొరబడుతున్న ఉత్పత్తుల్లో మొదటి ఐదు స్థానాల్లో ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, గృహ వినియోగ, మద్యం, పొగాకు ఉత్పత్తులు, మొబైల్ ఫోన్లు ఉన్నాయి. ఈ ఐదు కేటగిరీల్లో స్మగ్లింగ్ దందా ప్రభావాన్ని టీఏఆర్ఐ ద్వారా అధ్యయనం చేశారు. విదేశాల నుంచి దేశంలోకి స్మగ్లింగ్ చేస్తున్న టాప్-5 ఉత్పత్తుల విలువ ఏటా రూ. 2.60 లక్షల కోట్లుగా ఉంటోంది. దాంతో భారత ప్రభుత్వం పన్నుల ద్వారా రావాల్సిన రూ. 58 వేల కోట్ల ఆదాయాన్ని ఏటా కోల్పోతోంది. అంతే కాదు 51 లక్షల ఉపాధి అవకాశాలకు కూడా గండి పడుతోంది. ఆ ఐదు కేటగిరీల స్మగ్లింగ్ తీవ్రత ఎలా ఉందంటే..

### ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులు

దేశంలోకి ఏటా సగటున రూ. 1,42,284 కోట్ల విలువైన ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులు విదేశాల నుంచి స్మగ్లింగ్ చేస్తున్నారు. దేశంలో ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తుల మార్కెట్‌లో ఈ అక్రమ దిగుమతి ఉత్పత్తుల వాటా ఏకంగా 25.09 శాతం ఉంటోంది. తద్వారా దేశం రూ. 17,074 కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. అంతేకాదు అక్రమ ఉత్పత్తులతో దేశంలో ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తుల పరిశ్రమను దెబ్బతీస్తోంది. దాంతో దేశంలో 7.94 లక్షల మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు.

### గృహ వినియోగ ఉత్పత్తులు

గృహోపకరణాలు, గృహవినియోగ ఉత్పత్తులు, వ్యక్తిగత వినియోగ ఉత్పత్తులే దేశంలో అత్యధిక మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి. ఈ మార్కెట్‌ను కూడా స్మగ్లింగ్ ఉత్పత్తులు కొల్లగొడుతున్నాయి. దేశంలోకి ఏటా రూ. 55,530 కోట్ల విలువైన గృహవినియోగ ఉత్పత్తులు అక్రమగా దిగుమతి అవుతున్నాయి. మొత్తం మార్కెట్ వాటాలో ఈ ఉత్పత్తుల వాటా 34.25 శాతం ఉంది. దాంతో దేశం ఏటా రూ. 9,995 కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. ఇక పరిశ్రమలు దెబ్బతినడంతో దేశంలో ఏటా 2.89 లక్షల మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు.

### మద్యం ఉత్పత్తులు..

విదేశాల నుంచి వచ్చే అక్రమ మద్యం దేశ మార్కెట్‌ను కొల్లగొడుతోంది. ఏటా రూ. 23,466 కోట్ల విలువైన విదేశీ అక్రమ మద్యం దేశ మార్కెట్‌లోకి చొరబడుతోంది. దేశంలో మద్యం మార్కెట్లో ఈ అక్రమ మద్యం వాటా 19.87 శాతం. దాంతో దేశం ఏటా రూ. 15,262 కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. దేశంలో 97 వేల మంది ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయి.

### పొగాకు ఉత్పత్తులు

విదేశాల నుంచి దేశ మార్కెట్‌లోకి ఏటా రూ. 22,930 కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తులు అక్రమంగా ప్రవేశిస్తున్నాయి. దేశ పొగాకు మార్కెట్లో ఈ ఉత్పత్తుల వాటా 20.04 శాతం ఉంది. దాంతో దేశం ఏటా సగటున రూ. 13,331 కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. దేశంలో 3.7 లక్షల మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు.

### మొబైల్ ఫోన్ల మార్కెట్

దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న మొబైల్ ఫోన్ల మార్కెట్‌ను కూడా స్మగ్లింగ్ చీడ పీడిస్తోంది. విదేశాల నుంచి స్మగ్లింగ్ ద్వారా దేశంలోకి ఏటా రూ. 15,884 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు వచ్చి చేరుతున్నాయి. దేశ మొబైల్ ఫోన్ల మార్కెట్‌లో ఈ ఫోన్ల వాటా 7.56 శాతంగా ఉంది. దాంతో దేశం రూ. 2,859 కోట్ల ఆదాయాన్ని కోల్పోతుండటంతో పాటు దేశంలో 35 వేల మంది ఉపాధి అవకాశాలకు గండి పడుతోంది.

# ఆర్టీసీ కార్మిక నాయకుడు వైవీ రావు ఆకస్మిక మృతి

- పాడె మోసిన ఆర్టీసీ ఎండీ తిరుమలరావు
- సీఎం వైఎస్ జగన్ సంతాపం



సాక్షి, అమరావతి/బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర ప్రజా రవాణా సంస్థలో కార్మిక నాయకునిగా ఉన్న వైవీరావు(59) శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా చేరిన ఆయన ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌లో కార్మిక నాయకుడిగా అంచలంచెలుగా ఎదిగారు. డిపో కార్యదర్శిగా, డివిజనల్ కార్యదర్శిగా, జోనల్ కార్యదర్శిగా, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా, రీజనల్ సెక్రెటరీగా, రాష్ట్ర అధ్యక్షుడిగా, ఏపీ జేఏసీ అమరావతి జనరల్ సెక్రెటరీగా, ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా పలు బాధ్యతలను నిర్వర్తించారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఉండేవారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం సాయంత్రం జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వైవీ రావు పాడె మోశారు. ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్, జి.ఓబులేసు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చిన కార్మిక నేతలు వైవీ రావు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

**సీఎం సంతాపం**

ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మాజీ ఎమ్మెల్యే సర్రాజు హఠాన్మరణం



సర్రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు (72) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైన సర్రాజును భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్రాజు మరణం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. సీఎం వైఎస్ జగన్ హుటాహుటిన భీమవరంలోని ఆదర్శనగర్‌కు చేరుకుని సర్రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సర్రాజు సతీమణి అన్నపూర్ణ, కుమారులు శ్రీనివాసరాజు, యుగంధర్ నాగవర్మలనుపరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వెలిబుచ్చారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు దాడిశెట్టి రాజా, కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, భీమవరం, ఆచంట, ఉంగుటూరు, కైకలూరు, మచిలీపట్నం, ఉండి ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, పేర్ని నాని, మంతెన రామరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, డీఐజీ జి.పాలరాజు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్ తదితరులు సర్రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

శనివారం మధ్యాహ్నం 3 గంటల తరువాత సర్రాజు మృతదేహాన్ని భీమవరం నుంచి ఆయన స్వగ్రామమైన కాళ్ల మండలం జక్కరం గ్రామానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జక్కరంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గౌరవ వందనం చేసి మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. సర్రాజు చితికి పెద్ద కుమారుడు శ్రీనివాసరాజు నిప్పంటించారు. పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

**టీడీపీ కంచుకోటను బద్దలుకొట్టి..**

ఉండి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో సర్రాజుది ప్రత్యేక స్థానం. టీడీపీ ఆవిర్భావం నాటినుంచి 2004 ముందు వరకు దాదాపు 25 ఏళ్లపాటు ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి దిగిన సర్రాజు భారీ మెజార్టీతో ఉండి ఎమ్మెల్యేగా గెలుపొంది టీడీపీ కంచుకోటను బద్దలుకొట్టారు. ఐదేళ్ల పదవీ కాలంలో రూ.900 కోట్ల నిధులతో ఉండి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరి పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. 2021 జూలై 17న రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి అదే పదవిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

# వైభవంగా చెంచుల జాతర

ఘనంగా భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి కల్యాణం

సాక్షి, నాగర్‌కర్నూల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నల్లమలలోని భౌరాపూర్ పెంటలోని చెంచుల ఆరాధ్యదైవం భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి కల్యాణాన్ని చెంచు పూజారులు ఘనంగా నిర్వహించారు. భౌరమ్మను చెంచులు ఆడబిడ్డగా, మల్లికార్జునస్వామిని అల్లుడిగా భావించి వివాహం జరిపించారు. చెంచుల సంప్రదాయం ప్రకారం నృత్యాలు, తప్పట్లతో భ్రమరాంబిక, మల్లికార్జున స్వామివార్లకు ఎదుర్కోలు చేపట్టారు. పెళ్లి పెద్దలుగా అమ్మవారి తరఫున ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అమల దంపతులు, స్వామివారి తరఫున చెంచు దంపతులు శంకర్, రామేశ్వరి వ్యవహరించి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. చెంచు పెద్ద బాలగురువయ్య శివపార్వతులకు కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా తమకు ప్రత్యేకంగా గిరిజన భవన్ ఏర్పాటు చేయాలని, కృష్ణా తీరంలో చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించాలని, జాతరకు వచ్చే భక్తుల నుంచి టోల్ వసూలు చేయకుండా ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని చెంచులు విన్నవించారు.

## ఒళ్లు కమిలి.. మనసు కుమిలి

- ప్రిన్సిపాల్ కొట్టిన దెబ్బలకు విద్యార్థినుల రోదన
- భోజనం బాగా లేదన్నారని శిక్ష
- మధిర జ్యోతిబాపూలే గురుకులంలో ఘటన

మధిర: భోజనం బాగాలేదని విద్యార్థి సంఘం నేతలకు ఫిర్యాదు చేయడమే ఆ విద్యార్థినులకు శాపమైంది.. గురుకులం ప్రిన్సిపాల్ ఆగ్రహంతో వాతలు పెట్టడంతో శరీరం కమిలిపోయింది. ఖమ్మం జిల్లా మధిర మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల వసతి గృహంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై బాధిత విద్యార్థినులు అందించిన వివరాలివి. రెండు రోజుల క్రితం వసతి గృహాన్ని ఒక విద్యార్థి సంఘం నేత సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం సక్రమంగా ఉండటం లేదని, కూరలు మంచిగా చేయడం లేదని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ విద్యార్థినులందరినీ పిలిపించారు. హాస్టల్ విషయాలు బయటకు చెబితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఇంతలోనే శనివారం మరోమారు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ ఇరవై మంది విద్యార్థినులను తీవ్రంగా కొట్టారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ నజీమాను వివరణ కోరగా.. పదో తరగతిలో మార్కులు తక్కువగా రావడంతో మందలించే క్రమంలో ఒకటి, రెండు దెబ్బలు కొట్టిన మాట వాస్తవమేనని అంగీకరించారు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనమే అందిస్తున్నామని స్పష్టం చేశారు. కానీ విద్యార్థినులు మాత్రం.. హాస్టల్ పైన ప్రత్యేకంగా ఒక రూం ఉందని, అక్కడికి ఎవరైనా వెళ్తే ప్రిన్సిపాల్ కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. చదవకపోవడంతో కొట్టినట్లు ప్రిన్సిపాల్ చెబుతున్న విషయం అవాస్తవమని, ఆహారంలో నాణ్యత కూడా లేదని వాపోయారు. ప్రిన్సిపాల్ కొట్టిన దెబ్బలకు శరీరంపై వాతలు తేలాయని రోదిస్తున్నారు.

# థర్మల్ ప్లాంట్లే దిక్కు..!

- 2030 వరకు అన్ని ప్లాంట్‌లను కొనసాగించాలని కేంద్రం నిర్ణయం
- విద్యుత్ డిమాండ్ పెరుగుతుండటంతో 81 ప్లాంట్‌ల మూసివేతకు బ్రేక్

సాక్షి, అమరావతి: దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాలంటే థర్మల్ ప్లాంట్‌లు కొనసాగించాల్సిందేనని కేంద్రం ఒక అంచనాకు వచ్చింది. తాజాగా దేశంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలను 2030 వరకు కొనసాగించాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. దేశంలో 2030 నాటికి మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించాలని, 2070 నాటికి జీరో స్థాయికి తీసుకురావాలని, ఇందుకోసం బొగ్గు వినియోగాన్ని నిలిపివేయాలని రాష్ట్రాలకు కేంద్రం పదేపదే చెబుతూ వస్తోంది. దేశవ్యాప్తంగా 179 బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉండగా, వాటిలో 81 ప్లాంట్‌లలో రానున్న నాలుగేళ్లలో ఉత్పత్తి నిలిపివేయాలని గత ఏడాది ఆదేశించింది. కానీ, ప్రస్తుత పరిస్థితులను, భవిష్యత్ అవసరాలను అంచనా వేసిన తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుని థర్మల్ ప్లాంట్‌లను కొనసాగించడంతోపాటు చాలాకాలంగా మూసేసినవి కూడా తెరవాల్సిందిగా రాష్ట్రాలకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) సూచించింది.

**రికార్డు స్థాయిలో డిమాండ్...**

నాలుగేళ్లలో 81 థర్మల్ ప్లాంట్లను మూసివేయడం వల్ల దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 74 శాతంగా ఉన్న థర్మల్ విద్యుత్ వాటా... 2025 నాటికి 69 శాతానికి తగ్గుతుందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, ఇటీవల దేశంలో ఉష్ణోగ్రతలు, పరిశ్రమలు, ప్రైవేటు సంస్థలు వంటి ఉత్పాదక రంగాల్లో కార్యకలాపాలు పెరిగిన కారణంగా విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో రోజుకు 1,36,973 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గతేడాది డిసెంబర్‌లో ఇది 1,28, 536 మిలియన్ యూనిట్లుగా ఉండేది. దాదాపు 6.56 శాతం పెరుగుదల కనిపిస్తోంది. మరో 3 నుంచి 4 శాతం డిమాండ్ పెరిగితే విద్యుత్ సంక్షోభం వచ్చే ప్రమాదం ఉంది. దీంతో కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకుంది. థర్మల్ ప్లాంట్లను కొనసాగించాలని నిర్ణయించడంతోపాటు బొగ్గు ఉత్పత్తిని పెంచింది. కొత్తగా 141 బొగ్గు గనులకు ఆక్షన్ నిర్వహించింది.

**ఏపీలో ఇబ్బంది లేకుండా...**

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా బొగ్గు నిల్వలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం రోజువారీ విద్యుత్ డిమాండ్ 224 మిలియన్ యూనిట్లు ఉండగా, దానికి సరిపడా సరఫరా జరుగుతోంది. కృష్ణపట్నంలోని శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో ప్రస్తుతం 1,30,165 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 7 రోజుల విద్యుత్ ఉత్పత్తికి సరిపోతాయి. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో 55,191 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉంది. ఇది మూడు రోజుల వరకు వస్తుంది. విజయవాడలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో 91,940 మెట్రిక్ టన్నుల బొగ్గుతో నాలుగు రోజులకు ఢోకా లేదు. ఈ మూడు థర్మల్ కేంద్రాల నుంచి శనివారం 3,897.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. రానున్న రోజుల్లో మరిన్ని బొగ్గు నిల్వల కోసం రేక్‌లు పెంచాల్సిందిగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని, రైల్వేశాఖను రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు కోరాయి.

## యువగళం పాదయాత్రకు బ్రేక్

తారకరత్న మృతితో హైదరాబాద్‌కు లోకేశ్

సాక్షి, తిరుపతి: నారా లోకేశ్ పాదయాత్రకు బ్రేక్ పడింది. మహా శివరాత్రి సందర్భంగా శనివారం పాదయాత్రకు విరామం ప్రకటించారు. అయితే, సినీ నటుడు నందమూరి తారకరత్న కూడా ఇదేరోజు మృతిచెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు లోకేశ్ ఆదివారం ఉదయం శ్రీకాళహస్తి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు. ఈ మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి శనివారం రాత్రి మీడియాకు తెలిపారు. అయితే, తిరిగి పాదయాత్రను ఎప్పుడు కొనసాగిస్తారనే విషయం చెప్పలేదు.

# మరో 875 రోడ్ల పునరుద్ధరణ

**ఒక్కో నియోజకవర్గంలో 5 రోడ్లు**

- జూన్ నాటికి పునరుద్ధరించాలని నిర్ణయం
- ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో మరో వెయ్యి కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా 875 రోడ్లను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గంలో కీలకమైన ఐదురోడ్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు సిద్ధమైంది. ఈ 875 రోడ్లలో ఆర్ అండ్ బి శాఖ పరిధిలో 442, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 300, మున్సిపల్ శాఖ పరిధిలో 133 ఉన్నాయి. రోడ్లను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపాలని ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ రోడ్ల పనులను మార్చిలో ప్రారంభించి జూన్ నాటికి పూర్తిచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. టీడీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రోడ్ల పునరుద్ధరణ నిధులను కూడా 2019 ఎన్నికల ముందు పసుపు-కుంకుమ వంటి పథకాలకు మళ్లించింది. దీంతో రాష్ట్రంలో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ఏడాది భారీవర్షాలతో రోడ్ల పనులు చేపట్టడం సాధ్యం కాలేదు. అనంతరం రాష్ట్రంలో రోడ్ల పునరుద్ధరణ పనులను పెద్ద ఎత్తున చేపట్టింది. మొదటిదశ కింద రూ.2,205 కోట్లతో 6,150 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రోడ్ల పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఆ పనులు 95 శాతం పూర్తయ్యాయి. రెండోదశ కింద రూ.1,700 కోట్లతో 6,150 కిలోమీటర్ల మేర రహదారుల పునరుద్ధరణ ప్రణాళికను ఖరారు చేసింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో మొత్తం 953 రోడ్లను రెండోదశలో పునరుద్ధరించాలని నిర్ణయించింది. వాటిలో రాష్ట్ర ప్రధాన రహదారులు 292, జిల్లా ప్రధాన రహదారులు 661 ఉన్నాయి. ఈ పనులను ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతలో యుద్ధప్రాతిపదికన నియోజకవర్గానికి ఐదు రోడ్ల చొప్పున పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విధానంలో 875 రోడ్ల పునరుద్ధరణ పనులు మొదట పూర్తిచేయనున్నారు. అనంతరం రెండోదశ రోడ్ల పునరుద్ధరణ పనులను చేపట్టి డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందించారు.

**కృష్ణా, గోదావరి జిల్లాల్లో రోడ్ల కోతకు చెక్**

నదీపరివాహక ప్రాంతాల్లో దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్ల కోతకు రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలకనుంది. అందుకోసం ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీతో రోడ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో వెయ్యి కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. మెత్తటి నేలల్లో రోడ్లు నిర్మిస్తున్నా.. వర్షాలు పడినా, వరదలు వచ్చినా నదీతీర ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురవుతున్నాయి. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దశాబ్దాలుగా ఈ సమస్య వేధిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగా ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో రోడ్లు నిర్మించనుంది. ఆర్ అండ్ బి శాఖకు చెందిన 500 కిలోమీటర్ల రోడ్లు, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 500 కిలోమీటర్ల రోడ్లను ఈ సాంకేతికతతో నిర్మిస్తారు. పైలట్ ప్రాజెక్టుగా తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో గజ్జరం నుంచి హుకుంపేట వరకు 7.50 కిలోమీటర్ల మేర ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డును పరిశీలించిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ (సీఐఆర్) నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో మెత్తటి నేలలున్న ప్రాంతాల్లో అదే టెక్నాలజీతో రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు.

తెలంగాణ

## 'శివాజీ' ర్యాలీకి హైకోర్టు ఓకే

షరతులతో అనుమతి జారీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ ర్యాలీకి హైకోర్టు అనుమతించింది. అయితే నిర్వాహకులకు పలు షరతులు విధించింది. ర్యాలీలో 300 కంటే ఎక్కువ మంది పాల్గొన కూడదని, ఇతరులను రెచ్చగొట్టేలా ఎలాంటి నినాదాలు చేయరాదని ఆదేశించింది. షేక్‌పేట నుంచి యూసుఫ్‌గూడ వరకు నిర్వహించ తలపెట్టిన ఈ ర్యాలీకి తొలుత పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైదరాబాద్‌కు చెందిన ప్రశాంత్ హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు ర్యాలీకి అనుమతి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ శుక్రవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టగా, ట్రాఫిక్.. తదితర ఇబ్బందుల కారణంగా పిటిషనర్ కోరిన రూట్‌లో ర్యాలీకి అనుమతించలేమని పోలీసులు తెలిపారు. దీంతో విచారణ ఎటూ తెలకుండానే ముగిసింది. కాగా ఇదే అంశంపై పిటిషనర్ శనివారం మళ్లీ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. షరతులతో ర్యాలీకి అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## అన్నింటినీ కలిపి విచారణ చేయండి

బూదాటి కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ల విక్రయం పేరిట కోట్ల రూపాయలు వసూలు చేసి, మోసానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై కేసులు ఎదుర్కొంటున్న సాహితీ ఇన్ఫ్రాటెక్ వెంచర్స్ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణపై వచ్చిన ఫిర్యాదులను స్టేట్మెంట్లుగా రికార్డు చేయాలని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఒకే నేరంపై పలు చోట్ల కేసులు నమోదు చేయడాన్ని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు హైకోర్టులో సవాల్ చేశారు. తొలుత దీనిపై సింగిల్ జడ్జి విచారణ చేపట్టారు. లక్ష్మీనారాయణపై నమోదైన కేసులను సీసీఎస్‌కు బదిలీ చేయాలని చెప్పారు. ఒక కేసును లీడ్ కేసుగా తీసుకుని దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. అయితే సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ అప్పీల్ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. చట్టప్రకారం ఒకే నేరంపై అనేక కేసులు నమోదు చేయరాదని.. ఒకవేళ చేసినా అన్నింటినీ కలిపి ఒకే కేసుగా విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది.

# సనత్‌నగర్ ఠాణాలో లైబ్రరీ

**ఆరో తరగతి విద్యార్థి విజ్ఞప్తి మేరకు ఏర్పాటు**

**సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు రెండు రోజుల్లో సిద్ధం**

- శనివారం ఆ గ్రంథాలయాన్ని ప్రారంభించిన విద్యార్థిని ఆకర్షణ
- అందుబాటులో 750కి పైగా పుస్తకాలు
- రాష్ట్రంలోనే తొలిసారిగా పోలీస్ స్టేషన్‌లో లైబ్రరీ

సాక్షి, హైదరాబాద్/సనత్ నగర్: పుస్తకం హస్త భూషణం అంటారు.. ఒక్క పుస్తకం ఎందరో మిత్రులతో సమానమనీ చెప్తారు.. పుస్తకాలతో జ్ఞానాన్ని పెంచుకోవడమే కాదు ఎందరికో జ్ఞానాన్ని పంచేందుకూ ఓ ఆరో తరగతి విద్యార్థిని ముందుకొచ్చింది. తాను చదవటమేకాదు చుట్టూ ఉన్న వాళ్లు కూడా పుస్తకాలు చదవాలన్న ఉద్దేశంతో గ్రంథాలయాల ఏర్పాటుకోసం కృషి చేస్తోంది. అలా హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మినీ లైబ్రరీని ఏర్పాటు చేయించింది. సనత్‌నగర్‌కు చెందిన ఆ చిన్నారి పేరు ఆకర్షణ. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఆమె వయసు పదకొండేళ్లు. శనివారం స్వయంగా ఆమె చేతుల మీదుగా సనత్‌నగర్ ఠాణాలో లైబ్రరీ ప్రారంభం కావడం గమనార్హం.

**ఠాణాకు వెళ్లినప్పుడు గమనించి..**

ఆకర్షణ కొన్నిరోజుల క్రితం తండ్రి సతీశ్‌కుమార్‌తో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో కొందరు పోలీసు అధికారులను కలిసేందుకు చాలాసేపు వేచి ఉండటాన్ని గమనించింది. అలా కూర్చున్న సమయంలో ఏదైనా పుస్తకం చదివే అవకాశం ఉంటే బాగుంటుందని భావించింది. దీనివల్ల జ్ఞానం పెరగడంతోపాటు మానసిక ఒత్తిడి కాస్త తగ్గుతుందని అనుకుంది. ఠాణాలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరుతూ సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్రకు లేఖ రాసింది. దీనిపై స్పందించిన సీపీ.. ఠాణాలో గ్రంథాలయానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి, ఇతర ఏర్పాట్లు కూడా చేయించారు. ఆకర్షణ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల నుంచి సేకరించిన 750కి పైగా పుస్తకాలను ఠాణా లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలకు చెందిన పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ లైబ్రరీని శనివారం ప్రారంభించారు.

**గతంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో..**

ఆకర్షణ ఇలా మినీ లైబ్రరీని ఏర్పాటు చేయడం ఇది రెండోసారి. 2021 జూలైలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో పిల్లల కోసం లైబ్రరీ ఏర్పాటు చేసింది. లైబ్రరీల ఏర్పాటు కోసం ఆకర్షణ దాదాపు 18 నెలల పాటు శ్రమించి మొత్తం 1,700కు పైగా పుస్తకాలను సేకరించింది. అప్పటి సిటీ కమిషనర్ అంజనీకుమార్ చేతుల మీదుగా ఆకర్షణ మెమెంటో కూడా అందుకుంది. కరోనా సమయంలో తాను దాచుకున్న డబ్బులతో మాస్కులు, శానిటైజర్లు, ఫేస్ షీల్డ్స్ వంటివి కొని అప్పటి సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్‌కు అందించింది.



నీతిమంతుల తలంపులు న్యాయ యుక్తములు. భక్తిహీనులు చెప్పు ఆలోచనలు మోసకరములు.
– క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.3.56 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** శ్రవణం ప.2.32 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** సా.6.13 నుండి 7.44 వరకు **దుర్ముహూర్తం:** సా.4.24 నుండి 5.13 వరకు **అమృతఘడియలు:** రా.3.10 నుండి 4.41 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం : 5.58
**రాహుకాలం :** సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం :** ప.12.00 నుంచి 1.30 వరకు

జో బైడెన్ (80), అమెరికా ప్రెసిడెంట్

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అమెరికాకు ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ అధ్యక్ష ఎన్నికలు వాటికై అవి దగ్గర పడవు. అధ్యక్షులే తమకై తాము ఎన్నికలకు దగ్గర పడుతుంటారు!

రెండేళ్లే అయింది అధ్యక్షుడిగా నేనొచ్చి. ఇంకో రెండేళ్ల సమయం మిగిలే ఉంది. అప్పుడే మొదలు పెట్టేశారు.. "జో బైడెన్ రెండో టెర్మ్‌కి ఫిట్‌గా ఉంటారా?!" అని!!

కరోనాని డీల్ చేశాను. అఫ్గానిస్తాన్‌ని డీల్ చేశాను. రష్యాను డీల్ చేస్తున్నాను. డీల్ చేయవలసినవి ఇంకా ఉన్నాయి. వీటి గురించి ఎవరూ మాట్లాడ్డం లేదు! "నెక్స్ట్ ఎలక్షన్స్‌కి తనని తను డీల్ చేసుకోగలడా బైడెన్?"... సెనెట్‌లో ఇదే, హౌస్‌లో ఇదే, నా చాటున వైట్ హౌస్‌లోనూ ఇదే డిబేట్!

అమెరికాలో ఓట్ల కన్నా ఎక్కువగా దడిబేట్‌లే అధ్యక్షుడి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయి.

నా సొంత డెమోక్రాట్‌లు కూడా నా ఫిట్‌నెస్ మీద నమ్మకం ఉంచడం లేదు! "ఇప్పుడే 80 అంటే రెండో టెర్మ్‌కి 82 వచ్చేస్తాయి. 82 ఏళ్ల వయసులో బైడెన్ తన కాళ్లపై తను నడవగలడా?!" అని వారి సందేహం!



"మిస్టర్ ప్రెసిడెంట్.. మీరెంతో ఫిట్‌గా ఉన్నారు. మెంటల్‌గా, ఫిజికల్‌గా కూడా.." అంటున్నారెవరో! హిప్నాటిస్టుగానీ కాదు కదా!!

మెల్లిగా కళ్లు తెరిచి చూశాను.

"ఎవరు మీరు? నేనెక్కడ ఉన్నాను?" అని అడిగాను.

"మిస్టర్ ప్రెసిడెంట్.. నా పేరు కెవిన్ ఒకానర్. ప్రజాహితార్థం ఏడాదికొకసారి మీ ఆరోగ్య స్థితిని అమెరికా సంయుక్త రాష్ట్రాలకు నివేదించడం కోసం వాషింగ్టన్ శివార్లలో ఉన్న వాల్టర్ రీడ్ నేషనల్ మిలటరీ మెడికల్ సెంటర్‌లో ప్రత్యేక నియామకంపై విధి నిర్వహణలో ఉన్న మీ వ్యక్తిగత వైద్యుడిని. ప్రస్తుతం మీరు నా పర్యవేక్షణలోనే ఉన్నారు. అంతేకాకుండా..."

అతడింకా ఏదో చెప్పబోతున్నాడు.

ఆగమన్నట్లు సైగ చేశాను. ఆగాడు.

"మిస్టర్ కెవిన్. మీరొక వైద్యుడని మాత్రమే నేను అర్థం చేసుకోగలిగాను. అలాగే మీరు చెబుతున్నది నా ఫిట్‌నెస్ గురించేనని నేను అర్థం చేసుకోవచ్చా?" అన్నాను.

"ష్యూర్ మిస్టర్ ప్రెసిడెంట్. 6 అడుగుల ఎత్తూ, 80.7 కిలోల బరువూ కలిగి ఉండి; గత ఏడాదిగా నడకలో గానీ, మాటలో గానీ ఏ విధమైన మార్పునూ కనబరచని; మరియు.. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లేమీ లేని 80 ఏళ్ల జో బైడెన్ అనే ఒక రివట వంటి మనిషి ఫిట్‌నెస్ గురించే నేను మీతో మాట్లాడుతున్నాను.." అన్నారు డాక్టర్ కెవిన్ తన వైద్య పరిభాషలో! ఆయన చేతిలో ఉన్నవి నా మెడికల్ రిపోర్ట్సే కావచ్చు.

"ఇట్స్ ఓకే మిస్టర్ కెవిన్.." అని నవ్వాను.

నేను అలా నవ్వుతూ ఉన్నప్పుడు జొనాథన్ ఫైనర్ అక్కడికి వచ్చాడు! యు.ఎస్. డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అతడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ మిస్టర్ ప్రెసిడెంట్.. ఒక ఫోన్ కాల్‌ని మీకోసం చాలాసేపటిగా హోల్డ్ చేసి ఉంచాను. కలపమంటారా?" అని అడిగాడు జొనాథన్.

"ఎవరు?" అన్నాను.

కాస్త సంశయించి, "సర్.. ఆయన.. మీ బద్ధశత్రువైన మిస్టర్ డొనాల్డ్ ట్రంప్" అన్నాడు జొనాథన్. కనెక్ట్ చెయ్యమన్నాను.

మెడికల్ సెంటర్ నుంచి నేను బయటికి వస్తుండగా కాల్ కనెక్ట్ అయింది.

"హవ్వూ మిస్టర్ ట్రంప్?" అని అడిగాను.

"ఫైన్ అండ్ ఫిట్.. మిస్టర్ బైడెన్. థ్యాంక్యూ. మీరెలా ఉన్నారని అడిగేందుకే మీకోసం ట్రై చేస్తున్నాను.." అన్నారు ట్రంప్.

"నేను కూడా ఫైన్ అండ్ ఫిట్.. మిస్టర్ ట్రంప్. థ్యాంక్యూ.." అని నవ్వాను.

"మనమెప్పుడూ ఫిట్‌గానే ఉంటాం మిస్టర్ బైడెన్. కానీ మన చుట్టూ ఉన్నవాళ్లే.. మన ఫిట్‌నెస్‌పై నిరంతరం సందేహాలు వ్యక్తం చేస్తూ ఉంటారు.." అని పెద్దగా నవ్వారు ట్రంప్.

ఆ సమయంలో ట్రంప్ నాకు ఆప్త శత్రువులా, బద్ధ మిత్రుడిలా అనిపించారు!

# బాబుకు స్క్రిప్టు కోసమే!

**మనబడి నాడు-నేడుపై 'ఈనాడు' కబోది కథనం | వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లతో సకల వసతులు**

- మొదటి దశ కింద రూ.3,669 కోట్లతో 15,713 స్కూళ్లలో అభివృద్ధి పనులు పూర్తి
- రెండో దశలో రూ.8 వేల కోట్లతో 22,344 స్కూళ్లలో అభివృద్ధి కార్యక్రమాలు
- ఇందులో ఇప్పటికే రూ.3,750 కోట్లు విడుదల
- ఈ వాస్తవాన్ని ఎందుకు చెప్పలేదు రామోజీ?
- రూ.వెయ్యి కోట్ల బిల్లులు బకాయిలుంటే పనులన్నీ ఆగిపోయినట్లా?
- దశల వారీగా బిల్లులు విడుదలవుతాయని తెలియదా?
- తప్పుడు రాతలతో కాంట్రాక్టర్లలో భయం పెంచడమే మీ ఉద్దేశం
- వారు పనులు చేయకుండా ఆపేయాలన్నది మీ కుట్ర
- చంద్రబాబు పాలనలో కనీస వసతులు కరువైతే ఒక్క మాట రాయలేదేం?



నాడు-నేడు మొదటి దశలో సర్వాంగ సుందరంగా తయారైన తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలోని వేలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



నాడు-నేడు రెండో దశ పనులు జరుగుతున్న చిత్తూరు జిల్లా చిత్తూరు మండలంలోని బంగారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లు బాగు పడుతుంటే ఆనందించాల్సింది పోయి.. అదెక్కడ టీడీపీ కొంప ముంచుతుందోనని 'ఈనాడు' పనిగట్టుకుని తప్పుడు రాతలు రాస్తోంది. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సకల వసతులతో తీర్చిదిద్దుతుండటం కళ్లెదుటే కనిపిస్తున్నా, లేదు లేదంటూ ప్రజల్లో విష బీజాలు నింపడానికి విఫలయత్నం చేస్తోంది. నాడు-నేడు రెండో దశ కింద ఏకంగా 22,344 స్కూళ్లలో పనులు జరుగుతుంటే.. అక్కడెక్కడో పనులు ఆగిపోయాయని యాగీ చేస్తోంది. చంద్రబాబు హయాంలో కనీసం చాక్‌పీస్‌లకు కూడా గతిలేని వైనాన్ని మరచిపోయి.. ఇప్పుడు తగుదునమ్మా అంటూ కోడి గుడ్డుపై ఈకలు పీకుతోంది. వేల కోట్ల రూపాయలతో ఊరూరా ప్రభుత్వ స్కూళ్లలో పనులు జరుగుతుండటం ప్రత్యక్షంగా కనిపిస్తున్నా కూడా దిగజారుడు రాతలు రాస్తోంది. ప్రజలేమనుకుంటారోనన్న భయం లేకుండా తన చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలని ఉవ్విళ్లూరుతూ రోజుకో రీతిలో తప్పుడు కథనం ద్వారా ప్రభుత్వంపై బురద చల్లుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగం అనూహ్య రీతిలో అద్భుత ఫలితాలిస్తోందని వేనోళ్ల ప్రశంసలు వ్యక్తమవుతుండటాన్ని జీర్ణించుకోలేని రామోజీ రావు ఏదో ఒక రీతిలో ప్రభుత్వ ప్రతిష్టను మసకబారేలా చేయడమే పనిగా పెట్టుకుని ముందుకు వెళుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. 'నాడు-నేడుకు నిధుల్లేవ్' అంటూ తాజాగా తన అక్కసు వెళ్లగక్కింది. ఒక్క అధికారితో మాట్లాడకుండా, విద్యా శాఖ నుంచి వివరాలు తీసుకోకుండా తనకు తోచిన లెక్కలతో బాబుకు స్క్రిప్టు అందిస్తోంది.

### ఆరోపణ: నాడు-నేడుకు నిధులు లేవు

**వాస్తవం:** ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా తీర్చిదిద్దేలా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. పేదల బతుకులు మార్చే ఏకైక సాధనం విద్య మాత్రమే అని బలంగా విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు సమూలంగా మార్చే నాడు-నేడు కార్యక్రమంతో పాటు, మరెన్నో సంస్కరణలు, గొప్ప గొప్ప మార్పులు తీసుకువచ్చారు. ఆంధ్రప్రదేశ్ అవతరించాక ప్రభుత్వ విద్యా రంగంపై ఇంతటి వ్యయం కాని, దృష్టి కాని ఎన్నడూ.. ఎవ్వరూ పెట్టలేదు. మన బడి నాడు – నేడు మొదటి దశలో రూ.3,669 కోట్లతో 15,713 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టి, 2021–22లో పూర్తి చేశారు. 2021–22లో 22,344 విద్యా సంస్థల్లో రూ.8,000 కోట్లతో రెండవ దశ పనులు చేపట్టారు.

### ఆరోపణ: రంగులు వెలుస్తున్నాయి

**వాస్తవం:** పనులే జరగలేదని చెబుతున్న ఈనాడు రంగులు వెలిసిపోతున్నాయని చెప్పడం విడ్డూరం. ప్రభుత్వ పాఠశాలల్లో రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్లు, తాగునీటి సరఫరా, చిన్న, పెద్ద మరమ్మతులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుదీకరణ, ప్రహరీ, ఫర్నీచర్, క్యాంపస్ మొత్తానికి పెయింటింగ్, గ్రీన్ బోర్డు, ఇంగ్లిష్ ల్యాబ్ (స్మార్ట్ టీవీలు), కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, డిజిటల్ తరగతులు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు) ఇలా 12 రకాల సదుపాయాలను కల్పిస్తోంది. వేలాది స్కూళ్లలో ఇంతగా మేలు చేస్తుండటం రామోజీరావుకు కనిపించడం లేదు కాబోలు. రంగులు ఎక్కడ వెలిసిపోయాయో చెప్పకుండా, చూపకుండా ఆవు కథ రాశారు.

### ఆరోపణ : రూ.1,000 కోట్ల చెల్లింపులు ఆగిపోయాయి


**వాస్తవం:** మన బడి నాడు – నేడు రెండవ దశ కింద రూ.8,000 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.3,750 కోట్లు విడుదల చేశారు. దశల వారీగా నిధులు విడుదలవుతాయనే కనీస పరిజ్ఞానం లేని వారెవరూ ఉండరు. ఈనాడు చెబుతున్న రూ. వెయ్యి కోట్ల చెల్లింపులు గత నెలవి అయ్యుంటాయి. అవి ఈ నెలలోనో.. వచ్చే నెలలోనో విడుదలవుతాయి. రూ.8 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నప్పుడు రూ.వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉంటే.. మొత్తం నాడు-నేడు కార్యక్రమమే ఆగిపోయినట్లు తప్పుడు రాతలు రాయడం చంద్రబాబు కోసమే కదా! ఆ తప్పుల తడక చిట్టా పట్టుకుని చంద్రబాబు ఊదరగొట్టాలనేగా! ఈ లెక్కన బిల్లులు రావని కాంట్రాక్టర్లలో భయం పెంచి, ఎలాగైనా సరే ఆ పనులు ఆపేయించాలన్నది రామోజీ పన్నాగం అని స్పష్టమవుతోంది. ఇది నిజం కాకపోతే రూ.3,750 కోట్లు చెల్లించారనే వాస్తవాన్ని ఎందుకు రాయలేదు రామోజీ?

### ఆరోపణ : విద్యార్థుల అవస్థలు

**వాస్తవం:** పెద్ద ఎత్తున్న పనులు జరుగుతున్నప్పుడు అక్కడక్కడ చిన్న పాటి అసౌకర్యాలు సహజం. దాన్ని కూడా భూతద్దంలో చూపడం దారుణం. ఈనాడు చెబుతున్నట్లు రాష్ట్రంలోని పాఠశాలలన్నింటిలోనూ పిల్లలు ఇబ్బంది పడటం లేదు. చంద్రబాబునాయుడి ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలలను గాలికి వదిలేసినా, తూతూమంత్రంగా నిధులు విదిలించినా ఒక్క మాటా రాయని ఈనాడు నేడు వేల కోట్లతో అన్ని విద్యా సంస్థలనూ సర్వాంగ సుందరంగా మారుస్తున్న ప్రభుత్వంపై దుష్ప్రచారం సాగిస్తోంది.

### విద్యా రంగం నాడు-నేడు ఇదీ పరిస్థితి

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–2019 మధ్య ఐదేళ్లపాటు పాఠశాలల్లో అభివృద్ధి కోసం రూ.1,709.64 కోట్లు మాత్రమే కేటాయించారు. అవీ పూర్తిగా ఖర్చు చేయలేదు. ఉదాహరణకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2014–2019 వరకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఐదేళ్ల కాలంలో నాటి ప్రభుత్వం రూ.76.85 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా ఫేజ్–1, ఫేజ్–2లో చిత్తూరు జిల్లాకు ఏకంగా రూ.1,133.09 కోట్లు కేటాయించింది. ఫేజ్ –1 కింద ఇప్పటికే పనులు పూర్తయ్యాయి.
- రూ.668 కోట్లతో ట్యాబులను, రూ.778 కోట్ల విలువగల బైజూస్ కంటెంట్‌తో ఎనిమిదో తరగతి చదివే 4,59,564 మంది విద్యార్థులకు, 59,176 మంది ఉపాధ్యాయులకు ఈ విద్యా సంవత్సరం పంపిణీ చేశారు.
- 5,800 పాఠశాలలకు 6వ తరగతిపైన ఉన్న 30,302 తరగతి గదులకు డిజిటల్ బోర్డు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) 2023 జూన్ నాటికే అందించేలా సన్నాహాలు చేపట్టారు. దిగువ తరగతులు ఉన్న స్కూళ్లకు అంటే, ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ పాఠశాలలలో 10 వేల స్మార్ట్ టీవీలను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
- పిల్లల చదువుకు తల్లిదండ్రుల పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం 'జగనన్న అమ్మఒడి' అనే వినూత్న పథకాన్ని అమలు చేస్తోంది. ఈపథకం కింద అర్హులైన తల్లులు, సంరక్షకులకు ఏటా రూ.15 వేల చొప్పున అందిస్తోంది. 2019–20లో 42,33,098 మంది, 2020–21లో 44,48,865, 2021–22లో 43,96,402 మంది తల్లులకు సాయం అందించారు.
- రాష్ట్రంలోని లోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యా బోధనను ప్రవేశ పెట్టారు. 1 నుంచి 6 తరగతుల వరకు పాఠ్య పుస్తకాలను ఆంగ్లం, తెలుగు మాధ్యమంలో, ద్విభాషా విధానంలో రూపొందించారు. 1 నుంచి 5 తరగతుల వరకు పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్ బుక్ లను ప్రవేశపెట్టారు.
- ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచడం కోసం ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు చిత్రాలతో కూడిన డిక్షనరీ ఇస్తున్నారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇస్తున్నారు. విద్యార్థులకు మిర్రర్ ఇమేజ్‌లో ద్విభాషా పాఠ్య పుస్తకాలను అందిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఇంతకుముందు 3, 4, 5 తరగతులకు ఇంటర్మీడియట్, డీఎడ్ మాత్రమే విద్యార్హతలుగా ఉన్న ఉపాధ్యాయులు బోధించేవారు. ఇప్పుడు, ఈ తరగతులకు బీఎస్సీ, బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నారు. ప్రభుత్వం 10,114 మంది సబ్జెక్ట్ టీచర్లను ఏర్పాటు చేసింది.
- జగనన్న విద్యా కానుక కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రు.2323.99 కోట్లు ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి స్కూలు ప్రారంభం రోజు 3 జతల బట్టలు, షూస్, బెల్ట్, స్కూల్ బ్యాగ్, డిక్షనరీ, టెక్స్ బుక్స్, తదితరాలను ఇస్తోంది. 2016–17లో ప్రభుత్వ బడులలో 37,57,474 విద్యార్థులు ఉండగా, ఈ కార్యక్రమాలన్నింటి వల్ల విద్యార్థుల సంఖ్య బాగా పెరుగుతోంది.




# అది ఉత్తుత్తి కథనం

**పంటల బీమాపై వాస్తవాలు కప్పిపుచ్చుతూ 'ఈనాడు' రోత రాతలు**

**ఊళ్లు తిరుగుతున్న తండ్రీకొడుకులకు మాటల సరుకు**

- రైతులను గందరగోళ పరిచి లబ్ధి పొందాలనే వ్యూహం
- 2014–15లో 6.39 లక్షల హెక్టార్లకే బీమా
- 2021–22లో 54.95 లక్షల హెక్టార్లలో పంటలకు బీమా
- 2016 నుంచి మిరప పంటకు వాతావరణం ఆధారంగానే బీమా వర్తింపు
- ఇప్పుడే కొత్తగా వర్తింప చేస్తున్నట్టుగా రామోజీ గగ్గోలు
- కల్తీవిత్తనాలు, గులాబీ తెగులుతో నష్టపోయిన పత్తి రైతులకు పైసా విదల్చని బాబు
- అప్పట్లో సింగిల్ కాలమ్ వార్త కూడా రాయని ఈనాడు
- టీడీపీ ఐదేళ్లలో 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల పరిహారం
- ఈ మూడున్నరేళ్లలోనే 44.28 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల పరిహారం
- 9 రెట్లు పెరిగిన బీమా కవరేజ్.. 22 రెట్లు పరిహారం




**సాక్షి, అమరావతి:** ఒకే అబద్ధాన్ని పదే పదే చెబితే అదే నిజమని ప్రజలు నమ్మేస్తారనే భ్రమలో రాజగురువు రామోజీ తప్పుడు కథనాలను వండి వార్చడమే పనిగా పెట్టుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతుంటే నిత్యం విషం కక్కుతూ చంద్రబాబుకు మేలు చేయడమే అజెండాగా పెట్టుకుంది ఈనాడు. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రైతులపై పైసా భారం పడకుండా ప్రభుత్వం అమలు చేస్తోంటే.. రైతుల్లో అపోహలు సృష్టించేందుకు 'ఉచిత బీమా ఉత్తిదే' అంటూ శనివారం ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. తండ్రీకొడుకులు ఊరూరా తిరుగుతున్న నేపథ్యంలో వారు మాట్లాడటానికి సరుకు అందిస్తూ ఇలా దిగజారుడు కథనాలను అచ్చేస్తోంది.

### ఆరోపణ : పంట అంతటికీ బీమా లేదు

**వాస్తవం:** నోటిఫై చేసిన పంటలకు గాను సాగు చేసిన ప్రతీ ఎకరాకు ఈ–క్రాప్, ఈ–కేవైసీ ప్రామాణికంగా 2020 ఖరీఫ్ నుంచి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. ఆ సీజన్ మళ్లీ ప్రారంభం కాకముందే నష్టపోయిన ప్రతి ఎకరాకు, ప్రతి రైతుకు పరిహారం అందిస్తోంది. పంటల బీమా అమలులో ఎలాంటి కోతల్లేకుండా యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తోన్న మొట్టమొదటి రాష్ట్రంగా ఏపీ నిలిచిందని వివిధ వేదికలపై కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఏపీని మోడల్‌గా తీసుకోవాలని పదేపదే చెబుతున్నారు. ఇప్పటికే ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీని మోడల్‌గా తీసుకొని తమ రాష్ట్రాల్లోని రైతులందరికీ పూర్తి స్థాయిలో బీమా రక్షణ కల్పించే దిశగా అడుగులేస్తున్నాయి.

### ఆరోపణ : అంచనా అంతుపట్టట్లేదు

**వాస్తవం:** పంటల బీమా నమోదు గతంలో చాలా సంక్లిష్టంగా, ప్రీమియం చెల్లింపు భారంగా ఉండేది. కనీస అవగాహన, ఆర్థిక స్తోమత లేక నిర్ధారించిన గడువులోగా ప్రీమియం చెల్లించలేక లక్షలాది మంది రైతులు పంటల బీమాకు దూరంగా ఉండే వారు. చేయించుకున్న వారు పరిహారం కోసం అధికారులు, బీమా కంపెనీల చుట్టూ ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఈ పరిస్థితిలో మార్పు తేవాలన్న దృఢ సంకల్పంతో తీసుకొచ్చిందే డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం. గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ లబ్ధిదారుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. అభ్యంతరాలు స్వీకరించి అర్హత ఉన్న ప్రతి రైతుకు పరిహారం అందేలా ఏర్పాట్లు చేశారు. 2014–15లో కేవలం 6.39 లక్షల హెక్టార్లలో సాగైన పంటలకు మాత్రమే బీమా కవరేజ్ కల్పిస్తే, 2021–22లో ఏకంగా 54.95 లక్షల హెక్టార్లలో సాగైన పంటలకు పూర్తి స్థాయిలో బీమా వర్తింప చేశారు. పరిహారం చెల్లింపు విషయాన్ని పరిశీలిస్తే 2014–15లో కేవలం 1.03 లక్షల మందికి రూ.132.24 కోట్లు చెల్లిస్తే, 2021–22లో ఏకంగా 15.61 లక్షల మందికి రూ.2,977.82 కోట్ల పరిహారం చెల్లించారు. ఇందులో గత ప్రభుత్వం 6.19 లక్షల మందికి ఎగ్గొట్టిన రూ.715.48 కోట్లు కూడా ఉంది. 2014–19 మధ్య 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్లు చెల్లిస్తే, 2019–22 మధ్య 44.28 లక్షల మందికి రూ.6,684.84 కోట్ల బీమా పరిహారం రైతులకు అందజేశారు. ఈ లెక్కన 2014–15తో పోల్చుకుంటే బీమా కవరేజ్ తొమ్మిది రెట్లు పెరగ్గా, పరిహారం చెల్లింపు ఏకంగా 22 రెట్లు పెరిగింది.

### ఆరోపణ : ఈ ప్రభుత్వం నిబంధనలు మార్చింది

**వాస్తవం:** పంటల బీమా అమలు కోసం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగానే టెక్నికల్ కమిటీ సూచనల మేరకు మార్గదర్శకాలను రూపొందిస్తారు. వాటికనుగుణంగా జిల్లాల వారీగా ఎంపిక చేసిన పంటలకు దిగుబడి, వాతావరణ ఆధారంగా నోటిఫై చేస్తారు. దిగుబడి ఆధారంగా నోటిఫై చేసిన పంటలకు పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చే వాస్తవ దిగుబడులు ఆధారంగా నష్టాన్ని అంచనా వేసి ఆ మేరకు పరిహారం చెల్లిస్తుంటారు. ఇక వాతావరణం ఆధారంగా నోటిఫై చేసిన పంటలకు నిర్దీత గడువులోగా వాతావరణ అంశాల హెచ్చు తగ్గుదల ఆధారంగా నష్టాన్ని అంచనా వేసి ఆ మేరకు బీమా పరిహారం చెల్లిస్తుంటారు. 15 ఏళ్లుగా ఇదే విధానం కొనసాగుతోంది. మిరప పంట విషయానికి వస్తే 2016 నుంచి వాతావరణ బీమా వర్తింప చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా ఇదే రీతిలో బీమా కవరేజ్ కల్పిస్తున్నారే తప్ప ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేకంగా ఎలాంటి మార్పులు తీసుకురాలేదు. ఆ మేరకు గడిచిన సీజన్‌లో వైపరీత్యాలతో పాటు నల్లతామర పురుగు ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించారు.


**బీమా కవరేజ్ పొందిన విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో)**

| సంవత్సరం | పంట విస్తీర్ణం |
|---|---|
| టీడీపీ ప్రభుత్వ హయాంలో.. | |
| 2014-15 | 6.39 |
| 2015-16 | 22.47 |
| 2016-17 | 20.85 |
| 2017-18 | 24.28 |
| 2018-19 | 25.86 |
| వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో.. | |
| 2019-20 | 40.25 |
| 2020-21 | 42.89 |
| 2021-22 | 54.95 |
| 2022-23 | 55.90 (ప్రతిపాదనలు) |

**పరిహారం చెల్లింపులిలా**

| సంవత్సరం | రైతులు (లక్షల్లో) | పరిహారం (రూ.కోట్లల్లో) |
|---|---|---|
| టీడీపీ ప్రభుత్వ హయాంలో... | | |
| 2014-15 | 1.03 | 132.24 |
| 2015-16 | 4.35 | 339.70 |
| 2016-17 | 8.70 | 954.75 |
| 2017-18 | 6.77 | 720.60 |
| 2018-19 (ఖరీఫ్-2018) | 10 | 1,263.91 |
| మొత్తం | 30.85 | 3,411.20 |
| వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో.. | | |
| 2012-13 | 0.25 | 119.44 (పాత బకాయిలు) |
| 2018-19(రబీ) | 5.94 | 596.40 (పాత బకాయిలు) |
| 2019-20 | 9.48 | 1,252.18 |
| 2020-21 | 13 | 1,739 |
| 2021-22 | 15.61 | 2,977.82 |
| మొత్తం | 44.28 | 6,684.84 |

### నాటి సంగతేమిటి రామోజీ?



టీడీపీ హయాంలో కల్తీ విత్తనాలు, గులాబీ తెగులు ప్రభావంతో ఏటా లక్షలాది మంది పత్తి రైతులు నష్ట పోయినా ఏనాడు ప్రభుత్వ పరంగా పైసా పరిహారం విదిల్చిన దాఖలాలు లేవు. నాడు రైతుల వెతలపై ఈనాడు సింగిల్ కాలమ్ రాసిన పాపానపోలేదు. ఇప్పుడేదో రైతులకు అన్యాయం జరిగి పోయిందంటూ గగ్గోలు పెట్టడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో అనుసంధానం చేసి.. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ 2023–24 సీజన్ నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్గదర్శకాల రూపకల్పన కోసం జిల్లాల వారీగా 2023–24 సీజన్‌కు ఎంపిక చేసిన పంటలకు బీమా కవరేజ్ కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ మార్గదర్శకాలను అనుసరించి అత్యధిక విస్తీర్ణానికి బీమా రక్షణ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందు కెళ్తోంది. ఇలా నష్టపోయిన ప్రతి ఎకరాకు, ప్రతి రైతును ఆదుకోవడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే రైతులను గందరగోళ పర్చేలా విషపురాతలు రాయడం చంద్రబాబు మేలు కోసమేనని ఎవరికి తెలియదు?

## క్లుప్తంగా...

### నేడు రాజమహేంద్రవరంలో నేషనల్ థియేటర్ ఫెస్టివల్

విజయవాడ కల్చరల్: నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఆదివారం నేషనల్ థియేటర్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక శాఖ సీఈవో ఆర్.మల్లికార్జునరావు, డ్రామా ఫెస్టివల్ బాధ్యుడు ఆకుల మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనం కళా కేంద్రంలో నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్‌లో మొదటి రోజు ప్రారంభోత్సవ సభ, 20న అస్తిత్వ థియేటర్ గ్రూప్ మంగళూరు వారు కండోనియన్స్ నాటకం, 21న అస్పోరివ్ గ్రూప్ పాల్ ఘాట్ వారి లెట్ ఇట్ బీ, 22న బ్యాక్ ఆన్ స్టేజ్ బెంగళూరు వారి శ్మశాన కురుక్షేత్రం, 23న మనలంగుడి థియేటర్ గ్రూప్ ఇడకిని కథా యారంభం నాటికలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

### ఏపీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా జోగి నాయుడు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా సినీ నటుడు ఎల్.జోగి నాయుడుని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్‌లోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన జోగి నాయుడు చలనచిత్ర నటుడిగా 150కి పైగా చిత్రాలలో నటించారు. చిత్ర, టెలివిజన్ రంగాలలోని పలు విభాగాలలో దాదాపు 25 ఏళ్ల అనుభవం ఉంది. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. జోగి నాయుడు నియామకానికి సంబంధించి ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ విజయవాడ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

### అవినీతికి పాల్పడ్డ కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు

సాక్షి, అమరావతి: ఆయుష్ సిబ్బంది నుంచి వసూళ్లకు పాల్పడ్డ నలుగురు కాంట్రాక్టు ఉద్యోగులపై ఆయుష్ కమిషనర్ చర్యలు తీసుకున్నారు. కాంపౌండర్లకు వేతనాలు పెంపుదలను అమలు చేయిస్తామని చెప్పి వారి నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడ్డారు. ఈ అంశం అధికారుల దృష్టికి రావడంతో కమిషనర్ జె.నివాస్ విచారణకు ఆదేశించారు. దర్యాప్తులో వసూళ్లకు పాల్పడినట్లు రుజువైంది. దాంతో ఆ నలుగురిని విధుల నుంచి తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయుష్ సిబ్బంది అవినీతికి, అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని నివాస్ హెచ్చరించారు.

### శివరాత్రి ఉత్సవాలకొచ్చి మృత్యుఒడికి..

- గోదావరిలో స్నానానికి దిగి ముగ్గురు యువకుల మృతి
- ఏలూరు జిల్లా పట్టిసంలో ఘటన


ఓలేటి అరవింద్


షేక్ లుక్మాన్


పెద్దిరెడ్డి రాంప్రసాద్

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చిన యువకులు గోదావరిలో మునిగి మృత్యుఒడికి చేరిన ఘటన ఏలూరు జిల్లా పట్టిసంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన ఓలేటి అరవింద్ (20), పెద్దిరెడ్డి రాంప్రసాద్ (18), ఎస్కే లుక్సేన్ (19) మరో నలుగురు స్నేహితులతో కలిసి శివరాత్రి ఉత్సవాలకు ఏలూరు జిల్లా పట్టిసం వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సరదాగా గడిపారు. మధ్యాహ్నం ఒంటిగంట దాటిన తర్వాత గోదావరి నదిలో స్నానానికి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో ఓలేటి అరవింద్, పెద్దిరెడ్డి రాంప్రసాద్, ఎస్కే లుక్సేన్ గల్లంతు అయ్యారు. మిగిలిన నలుగురు స్నేహితులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. సమాచారం అందుకున్న పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ ఫైర్ సిబ్బందితో కలిసి స్పీడ్ బోట్లతో ఆ ప్రాంతానికి వెళ్లి గాలింపు చేపట్టారు. కొంత దూరంలో మూడు మృతదేహాలనూ వెలికితీశారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలను పోలవరం వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన స్నానఘాట్లలో కాకుండా, ఎటువంటి హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు లేని ప్రదేశంలో యువకులు స్నానానికి దిగడం, లోతు తెలియకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

### మరో ఘటనలో బాలుడి మృతి

కె.గంగవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని అద్దంపల్లికి చెందిన పంపన సత్య వీరేంద్ర (14) స్నేహితులతో కలిసి శనివారం కోట గ్రామం వద్ద గౌతమీ గోదావరి నదిలో స్నానానికి దిగి మృతి చెందాడు.

# సాగర తీరంలో కయాకింగ్ క్వీన్


తెడ్డుతో పడవ నడుపుతున్న గాయత్రి

## జల క్రీడల్లో రాణిస్తున్న గాయత్రి

- 'కయాకింగ్ అండ్ కనోయింగ్' క్రీడలో సత్తా చాటుతున్న యువతి
- ఒలింపిక్ పతకమే లక్ష్యంగా సాధన
- తండ్రికి తోడుగా చేపల వేట

ఆ యువతి పడవ నడపగలదు.. ఒడుపుగా లంగరు సైతం వేయగలదు. తండ్రినే గురువుగా భావించి.. సాగర సంగమ తీరాన్నే శిక్షణ కేంద్రంగా ఎంచుకుని అరుదైన 'కయాకింగ్ అండ్ కనోయింగ్' క్రీడలో రాణిస్తోంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఆ యువతి ప్రపంచ ఒలింపిక్స్‌లో రాణించి భారత్ తరఫున పతకం అందుకోవాలని తహతహలాడుతోంది.


గోవాలో కయాకింగ్ అండ్ కనోయింగ్‌లో పోటీ పడుతున్న గాయత్రి


తండ్రి నాగబాబుతో గాయత్రి

నాగాయలంక (అవనిగడ్డ): కృష్ణా జిల్లా నాగాయలంక సాగర సంగమ తీరానికి చెందిన నాగిడి గాయత్రి గ్రామీణులకు పెద్దగా పరిచయం లేని అరుదైన 'కయాకింగ్ అండ్ కనోయింగ్' జలక్రీడలో రాణిస్తోంది. ఏడేళ్ల వయసులోనే తండ్రి వెంట నది బాటపట్టిన గాయత్రి చేపల వేట నేర్చుకుంది. జల క్రీడల్లో రాణించాలనే ఆ చిన్నారి తపనను గమనించి తండ్రి నాగబాబు కృష్ణా నదిలో ఈత నేర్పించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన గాయత్రి కరాటేలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. విజయనగరం జిల్లా గరివిడి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చేసింది. నాటు పడవతోనే నదిలో సాధన చేసి గత ఏడాది గుజరాత్‌లో జరిగిన 36వ జాతీయస్థాయి కయాకింగ్ అండ్ కెనోయింగ్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచింది.

**జాతీయ స్థాయిలో రజత పతకం**

18 సంవత్సరాల నాగిడి గాయత్రి కరాటే, రోయింగ్, కయాకింగ్ అండ్ కనోయింగ్ పోటీల్లో పలు పతకాలు సాధించింది. 2017లో ఢిల్లీలో జరిగిన 33వ నేషనల్ తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం పొందింది. 2021లో రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీల్లో బంగారు పతకం కైవశం చేసుకుంది. గత ఏడాది అక్టోబర్‌లో గుజరాత్‌లో జరిగిన జాతీయస్థాయి వాటర్ స్పోర్ట్స్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలవగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 11న భోపాల్‌లో జరిగిన 5వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కయాకింగ్ అండ్ కెనోయింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో రజత పతకం కైవశం చేసుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో గోవాలో జరిగే 37వ జాతీయస్థాయి వాటర్ స్పోర్ట్స్ పోటీలకు గాయత్రి అర్హత సాధించింది. దాతల సహాయం, మెరుగైన శిక్షణ అందిస్తే ప్రపంచ ఒలింపిక్ పోటీల్లో పతకం సాధిస్తానని గాయత్రి ధీమా వ్యక్తం చేస్తోంది.

**చేపల వేటలో సాయపడుతూ..**

తండ్రి నాగిడి నాగబాబుకు చేపల వేటలో గాయత్రి సహాయపడుతోంది. తండ్రితో పాటు రాత్రివేళలో బోటుపై సాగర సంగమ ప్రాంతానికి వెళ్లి వల, గాలం ద్వారా చేపల వేట సాగిస్తోంది. పురుషులకు దీటుగా పడవ నడుపుతూ.. లంగరు కూడా వేస్తోంది. చేపల వేటలో తలపండిన మత్స్యకారులు చేయలేని పనులను సైతం గాయత్రి సునాయాసంగా చేస్తుంది. గాలానికి రొయ్య గుచ్చడంలో గాయత్రి దిట్ట. ఒడుపుగా గుచ్చకపోతే రొయ్య ముళ్లు చేతిలో దిగి తీవ్రంగా బాధిస్తుంది. నాగాయలంకలో 40 చేపల వేట బోట్లు ఉండగా.. వీటిపై ముగ్గురు మాత్రమే గాలానికి ఒడుపుగా రొయ్య గుచ్చేవారు ఉంటే.. అందులో గాయత్రి ఒకరు కావడం విశేషం. నాగిడి నాగబాబు పెద్ద కుమార్తె గౌతమి స్విమ్మింగ్‌లో, కుమారుడు రాజేష్ తైక్వాండోలో, నాగబాబు సోదరి లక్ష్మీకుమారి కుమారులు కన్నా కుమార్, ఈశ్వర్ తైక్వాండో, కయాకింగ్‌లో, నాగబాబు సోదరుడు సాంబశివరావు కుమార్తె భార్గవి రోయింగ్‌లో, కుమారుడు శ్యాం కయాకింగ్‌లో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పలు పతకాలు అందుకోవడం విశేషం.

**ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధిస్తా**

మా కుటుంబానికి చేపల వేటే జీవనాధారం. మా నాన్న ఎంతో కష్టపడి శిక్షణ ఇప్పిస్తున్నారు. వాటర్ స్పోర్ట్స్ అకాడమీ సెక్రటరీ శివారెడ్డి ప్రోత్సాహం మరువలేనిది. కోచ్‌లు శ్రీనివాస్, నాగబాబు, చిన్నబాబు శిక్షణ నన్ను ఈ స్థాయికి తెచ్చాయి. ప్రపంచ ఒలింపిక్స్ వాటర్ స్పోర్ట్స్ క్రీడల్లో పాల్గొని బంగారు పతకం సాధించాలని ఉంది. దాతల ప్రోత్సాహం, మరింత మెరుగైన శిక్షణ అందిస్తే ఇంకా రాణిస్తాను.
– నాగిడి గాయత్రి, కయాకింగ్ క్రీడాకారిణి

### విశాఖ వేదికగా పాలన చేపట్టాలి

- అసెంబ్లీలో తీర్మానం చేయాలని బహుజన పరిరక్షణ సమితి డిమాండ్

తాడికొండ: ప్రజల ఆశయాలకు అనుగుణంగా విశాఖ కేంద్రంగా పాలన చేపట్టాలని, ఈ మేరకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని బహుజన పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం 874వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాలను సమానంగా కలుపుకుని పోతుంటే చంద్రబాబు మాత్రం కులవాదంతో తన వారికి దోచిపెట్టేందుకు, బినామీ ఆస్తుల విలువ పెంచుకునేందుకు ఒకే ప్రాంతంలో అభివృద్ధి చేయాలని కోరుకోవడం దుర్మార్గమన్నారు. ఎవరెన్ని కుటిల పన్నాగాలు పన్నినా ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బహుజనులను బలోపేతం చేసిన సీఎం జగన్‌కు 85 శాతం ఓటు బ్యాంక్ ఉన్న బహుజనులంతా మద్దతుగా ఉండి రాబోయే ఎన్నికల్లో బాబును చిత్తుగా ఓడించటం ఖాయమన్నారు.

## 'వందే భారత్'పై ప్రయాణికుల్లో క్రేజ్

- సెమీ హై స్పీడ్ రైలుపై ఆసక్తి చూపిస్తోన్న ప్రయాణికులు
- విజయవాడ కేంద్రంగా పెరిగిన రాకపోకలు
- విశాఖ–సికింద్రాబాద్ మధ్య పూర్తి సామర్థ్యంతో నడుస్తున్న రైలు

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మక సెమీ హైస్పీడ్ రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా విజయవాడ పరిసర ప్రజలు ఇందులో ప్రయాణించేందుకు అత్యధికంగా ఆసక్తి చూపిస్తున్నారని రైల్వే అధికారులు చెప్పారు. జనవరి 15న సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ప్రవేశపెట్టిన ఈ రైలు.. వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో మాత్రమే ఆగుతుంది. దీని వేళలు విజయవాడ పరిసర ప్రజలకు అనుకూలంగా మారాయి. దీంతో విజయవాడ కేంద్రంగా ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. నెల రోజుల్లో విజయవాడ నుంచి ఖమ్మం, వరంగల్, సికింద్రాబాద్‌కు 8,613 మంది.. రాజమండ్రి, విశాఖకు మరో 9,883 మంది ప్రయాణించారు. విశాఖ వైపు నుంచి 9,742 మంది, సికింద్రాబాద్ వైపు నుంచి 10,970 మంది విజయవాడకు వచ్చారు. మొత్తంగా విజయవాడ స్టేషన్‌కు సంబంధించి రోజుకు సగటున 1,352 మంది రాకపోకలు సాగిస్తున్నారు.

**ఆకట్టుకుంటున్న సౌకర్యాలు..**

వందే భారత్‌లోని ఆధునిక సౌకర్యాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. వేగం, ఏసీతో పాటు ప్రతి కోచ్‌లో రిక్లైనర్ సీట్లు, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో 180 డిగ్రీల కోణంలో తిరిగే సీట్లు, ఎమర్జెన్సీ అలారం బటన్లు, ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్‌లున్నాయి. సురక్షిత ప్రయాణం కోసం అన్ని కోచ్‌ల లోపలా, బయట సీసీటీవీ కెమెరాలు, మెరుగైన అగ్నిమాపక భద్రతను ఏర్పాటు చేశారు. ఆధునిక బయో వాక్యూమ్ టాయిలెట్లు కూడా ఉన్నాయి. ప్రయాణికులకు సమాచారం ఇచ్చేందుకు ప్రతి కోచ్‌లో పెద్ద డిస్‌ప్లే యూనిట్లను ఏర్పాటు చేశారు. రెండు రైళ్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు పరస్పరం ఢీకొనకుండా 'కవచ్' పరిజ్ఞానాన్ని కల్పించారు.

# యంత్ర కర్షకులొస్తున్నారు!

## మనుషులు, మట్టి అవసరం లేకుండానే వ్యవసాయం

- నీరు, యంత్ర పరికరాలతో పంటలు పండించేలా చర్యలు
- హైడ్రోపోనిక్స్ వ్యవసాయం మరింత సులభతరం
- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులే లక్ష్యం
- బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రయోగాలు

మట్టితో పనిలేదు. మనుషులూ అవసరం లేదు. ఇకపై యంత్రాలే తంత్రాలను రచించి వ్యవసాయ పనుల్ని చక్కబెట్టేస్తాయి. బంగారు పంటల్ని పండించేస్తాయి. మట్టిని వాడకుండా కేవలం నీటితోనే పంటల్ని పండించే (హైడ్రోపోనిక్స్) వ్యవసాయ విధానం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో యంత్ర పరికరాల సాయంతో ఈ విధానాన్ని మరింత సులభతరం చేసేలా బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రయోగాలు కొనసాగుతున్నాయి. తెగుళ్ల నివారణ.. అధిక దిగుబడులే లక్ష్యంగా తక్కువ ఖర్చుతో హైడ్రోపోనిక్స్ వ్యవసాయ విధానాలను రైతులకు అందుబాటులోకి వస్తున్నాయి.


ఏ-ఫ్రేమ్ విధానంలో సాగు చేస్తున్న ఆకు కూరలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసేందుకు బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల కృషి చేస్తోంది. ఇందుకోసం నిత్యం పరిశోధనలు కొనసాగిస్తోంది. మట్టితో పని లేకుండా ఆకు కూరలు, కూరగాయల పంటలు పండించేందుకు ఇప్పటికే ఇక్కడి ప్రొఫెసర్లు సరికొత్త పద్ధతులు సృష్టించారు. ఈ విధానంలో మనుషుల అవసరం కూడా లేకుండా పంటల సాగును మరింత సులభతరం చేస్తున్నారు. హైడ్రోపోనిక్స్ విధానంలో మొక్కలకు నీరు, ఎరువులు, ఇతర పోషకాలు అందించేందుకు సరికొత్త యంత్ర పరికరాలు రూపొందించారు. ఇందుకోసం హైడ్రోపోనిక్ యంత్రాన్ని సిద్ధం చేశారు. ఆకు కూరలు, కూరగాయల మొక్కలకు ఏ సమయంలో.. ఎంత మోతాదులో నీరు, పోషకాలను ఇవ్వాలో గుర్తించి యంత్రం సాయంతోనే సరఫరా చేసేలా 'హైడ్రోపోనిక్ ఆటోమేషన్ సిస్టమ్'ను రూపొందించారు.

**ఖర్చుల్ని తగ్గించేలా..**

మట్టిలో వ్యవసాయం చేయడం ఖర్చుతో కూడుకున్న పని. దీంతోపాటు తెగుళ్ల ఉధృతి కూడా అధికంగా ఉంటుంది. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఇది ఆర్థికంగా నష్టాలను తెచ్చిపెడుతోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పండించే ఆకు కూరలు, కూరగాయలు పట్టణ, నగర ప్రాంతాలకు తగినంత మోతాదులో సరిపోయే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో రైతులు పడుతున్న కష్టాలను దృష్టిలో పెట్టుకుని మట్టితో పనిలేకుండా కేవలం నీరు, వర్మీ కంపోస్ట్, కొబ్బరి పీచుతో ఆకు కూరలు, కూరగాయలు పండించే అవకాశం అందుబాటులోకి వచ్చింది. దీనికి కొనసాగింపుగా ఎలాంటి మట్టి అవసరం లేకుండా కేవలం నీటిలోనే పంటలు పండించే హైడ్రోపోనిక్ విధానం కూడా వచ్చింది.

**నయా సాగు ఇలా..**

హైడ్రోపోనిక్ వ్యవసాయాన్ని మరింత సులభతరం చేస్తూ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు సరికొత్త పరికరాలను రూపొందించారు. ఇందుకోసం ప్రధానంగా 'ఏ' ఫ్రేమ్‌ను రూపొందించారు. ఇది స్టాండ్, ఛానల్స్, పైపులతో కూడి ఉంటుంది. ఇవి మార్కెట్‌లో రెడీమేడ్‌గా కూడా లభిస్తున్నాయి. వాటర్ ట్యాంక్‌లో నీటిని పోసి చిన్న మోటార్ ద్వారా ఫ్రేమ్‌లోకి నీటిని రొటేషన్ పద్ధతిలో సరఫరా చేయాల్సి ఉంటుంది. పైపులకు ఉన్న రంధ్రాల వద్ద చిన్నపాటి ట్రేలో మొక్కను అమరుస్తారు. ఆ ట్రేలో 1,200 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద హీట్ చేసిన బంకమట్టి గుళికలు (బాల్స్), ఫర్లైట్, వర్మి క్లైట్ మెటీరియల్స్‌ను వేయాలి. ఇవి మొక్క వేర్లు నిలదొక్కుకునేందుకు సహకరిస్తాయి. వీటికి మేక్రో న్యూట్రియంట్స్, మైక్రో న్యూట్రియంట్స్ అందిస్తారు. పొటాష్, కాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం, జింక్ తదితర 17 రకాల పోషకాలను నీటిద్వారా అందిస్తారు. ఈ విధానంలో పంటలకు నీరు, పోషకాలను సమయానుకూలంగా మనుషులే తగిన మోతాదులో అందించాల్సి వచ్చేది. బాపట్ల అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు మనుషులతో పనిలేకుండా హైడ్రోపోనిక్ ఆటోమెషిన్ సిస్టమ్ రూపొందించారు. ఈ మెషిన్ మొక్కలకు తగిన సమయంలో.. తగిన మోతాదులో నీరు, ఎరువులను అందజేస్తుంది.

**తెగుళ్లు లేకుండా అధిక ఉత్పత్తులు**



వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మట్టితో పనిలేకుండా పంటలు పండించడంపై పరిశోధనలు సాగుతున్నాయి. తెగుళ్ల బెడద లేకుండా అధిక ఉత్పత్తులు వచ్చేలా హైడ్రోపోనిక్ ఆటోమెషిన్ సిస్టమ్‌ను రూపొందించాం. రైతులకు మేలు జరిగేలా మరిన్ని పంటలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషిచేస్తున్నాం.
– డానియల్ స్మిత్, ప్రిన్సిపాల్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల

**నాణ్యమైన పంటలు**



ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమయ్యే ఆకు కూరలు, కూరగాయలతో పోలిస్తే హైడ్రోపోనిక్స్ పంటలకు మంచి గిరాకీ ఉంటుంది. మట్టి లేకపోయినా ఈ తరహా పంటలు సాగు చేసుకోవచ్చు. తెగుళ్ల సమస్య లేకుండా అధిక దిగుబడులు వస్తాయి.
– కె.కృపావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, అగ్రి ఇంజనీరింగ్ కళాశాల

**సీఏఆర్ ప్రోత్సాహంతో..**

ఇందుకోసం వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ రూ.30 లక్షలను కేటాయించింది. దీంతో కళాశాల పరిశోధనల కోసం రెండు గ్రీన్ హౌస్‌లు ఏర్పాటు చేశారు. పరిశోధనలో వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులను భాగస్వాములను చేశారు. వారితో సొంతంగా ప్లాట్స్ ఏర్పాటు చేసి పంటలు పండించేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ ప్రయోగాలను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె.కృపావతి, సీహెచ్.రత్నరాజు పర్యవేక్షిస్తున్నారు.

**అందుబాటులోకి వచ్చిన యంత్రాలు**

హైడ్రోపోనిక్ ఏ-ఫ్రేమ్ స్ట్రక్చర్‌ను హైదరాబాద్‌లోని ఇన్ఫినిటీ కంపెనీ సరఫరా చేస్తోంది. ట్యాంక్, మోటార్‌తో కలిపి ఉండే ఫ్రేమ్‌ను రూ.15 వేలకు విక్రయిస్తున్నారు. మొక్కలకు సపోర్ట్‌ను ఇచ్చేలా వివిధ రకాల బాల్స్‌తోపాటు మొక్కలకు సంబంధించిన సీడ్, ఎరువులను కూడా సదరు కంపెనీ సరఫరా చేస్తోంది. పరిశోధనల్లో భాగంగా కళాశాలలో ఇప్పటికే కాలీఫ్లవర్ పంటను పండించగా.. పుదీనా, పొన్నగంటి కూర, బచ్చలి కూర, కొత్తిమీర, క్యాబేజీ, ఎర్ర తోటకూర, పచ్చ తోటకూర, బేసిల్, పార్శిలీ, టమోటా, చెర్రి టమోటా తదితర పంటలను ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు.

### ఆపదలో ఉన్నారని హైదరాబాద్ నుంచి వచ్చి రక్తదానం



కర్నూలు(హాస్పిటల్): ఆపదలో ఉన్నారని రక్తం అవసరమైన వారికి ఓ వ్యక్తి హైదరాబాద్ నుంచి వచ్చి రక్తదానం చేశారు. ఆళ్లగడ్డకు చెందిన లావణ్య అనే గర్భిణికి అత్యవసరంగా అరుదైన ఏ నెగిటివ్‌లో టైప్–2 రక్తం కావాలని డేనియల్ రాజు ఫౌండేషన్ ఫౌండర్ సుమన్‌కు సమాచారం వచ్చింది. దీంతో ఆయన హైదరాబాద్‌లో ఉన్న బాల్య స్నేహితుడు సాధిక్ బాషాను రక్తం ఇవ్వాలని కోరారు. వెంటనే ఆయన హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చి రక్తదానం చేశారు. ఇలా సేకరించిన రక్తాన్ని ఐస్‌బాక్స్‌లో భద్రపరిచి నంద్యాలలోని ఆస్పత్రిలో ఉన్న లావణ్యకు అందజేశారు సుమన్. పిలవగానే హైదరాబాద్ నుంచి వచ్చి రక్తదానం చేసిన సాధిక్‌బాషాకు లావణ్య భర్త సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.


రక్తదానం చేస్తున్న సాధిక్‌బాషా

### మీకు అర్థమవుతోందా..!


తరగతిలో పాఠం చెబుతున్న రోబో బాలిక

యూనిఫాం వేసుకుని తరగతి గదిలో పిల్లల మధ్య నిలుచున్నది క్లాస్ లీడర్ కాదు... తన అంత ఎత్తు ఉన్న పిల్లలకు అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్న రోబో ఇది. విద్యార్థినిలా చూడముచ్చటగా ఉన్న ఈ రోబో చకచకా గుణింతాలు, లెక్కలు, పద్యాలను బోధించడంతోపాటు పిల్లలతో కలిసి ఆటలు ఆడుతుంది. విద్యార్థుల సందేహాలను సైతం నివృత్తి చేస్తుంది. ఈ రోబోను కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా శిరిసికి చెందిన భౌతికశాస్త్ర అధ్యాపకుడు అక్షయ్ మాషెల్కర్ రూపొందించారు. దీనికి కన్నడలో శిక్ష (విద్య) అని పేరు పెట్టారు. ఈ రోబోలో అన్ని పాఠాలను ఫీడ్ చేసినట్లు అక్షయ్ తెలిపారు. విద్యార్థులు తమ ప్రశ్నలను అడిగేందుకు కొన్ని స్మార్ట్ కార్డులను తయారు చేసినట్లు చెప్పారు. విద్యార్థి తన ప్రశ్నకు సంబంధించిన స్మార్ట్ కార్డును రోబో పాప చేతిలో పెట్టగానే, చిప్ రీడింగ్ ద్వారా అర్థం చేసుకుని తగిన సమాధానాన్ని వినిపిస్తుందని తెలిపారు. బరువు కూడా తక్కువే కావడంతో ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చని వివరించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల రోబోతో డెమో నిర్వహించడంతో కొన్నిరోజులుగా 'శిక్ష' పేరు మార్మోగుతోంది. రోబో తయారీలో తన శిష్యుడు ఆదర్శ దేవాడిగ సహకరించాడని అక్షయ్ తెలిపారు.

– యశవంతపుర

### బస్సు ఢీకొని ముగ్గురి దుర్మరణం

- ఏలూరు జిల్లా పూళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం


వీరాస్వామి (ఫైల్)


మహేంద్ర (ఫైల్)


ఫణీంద్ర (ఫైల్)

భీమడోలు: రోడ్డు పక్కన బైక్‌లు నిలుపుతున్న నలుగురిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. భీమడోలు మండలం కురెళ్లగూడేనికి చెందిన తాపీమేస్త్రి ఊటుకూరి ఫణీంద్ర(29), కూలీలు కర్నాటి మహేంద్ర (32), దంగ్రు వీరాస్వామి (60), గండికోట శ్రీను ఉదయం యథావిధిగా పని కోసం తమ గ్రామం నుంచి రెండు బైక్‌లపై బయలుదేరి పూళ్ల చేరుకున్నారు. పాత సామగ్రి కొనుగోలు చేసేందుకు నలుగురు పూళ్ల శివారులోని ఓ దుకాణం వద్దకు వచ్చి తమ బైక్‌లను రోడ్డు పక్కన నిలుపుతున్న సమయంలో భీమవరం నుంచి ద్వారకాతిరుమల వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వారిని ఢీకొట్టింది. దీంతో దంగ్రు వీరాస్వామి, కర్నాటి మహేంద్ర అక్కడికక్కడే మృతి చెందారు. ఊటుకూరి ఫణీంద్ర, గండికోట శ్రీను ఎగిరి రెయిలింగ్‌కు రెండోవైపు పడిపోయారు. వారిద్దరికీ తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఫణీంద్ర మృతిచెందాడు. శ్రీనుకు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కొద్దిసేపు మృతుల బంధువులు ఘటనాస్థలం వద్ద ధర్నా నిర్వహించారు.

### లక్ష చండీ మహాయజ్ఞం దేశానికి గర్వకారణం

- కేంద్ర సమాచారశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్
- కురుక్షేత్రలోని లక్ష చండీ మహాయజ్ఞానికి సతీసమేతంగా హాజరు


లక్ష చండీ మహాయజ్ఞంలో స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న కేంద్ర సమాచారశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ దంపతులు

సింహాచలం: భారత వైదిక చరిత్రలోనే కనీవినీ ఎరుగని లక్ష చండీ మహాయజ్ఞం కురుక్షేత్ర వేదికగా నిర్వహిస్తుండటం దేశానికి గర్వకారణమని కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని గుంతీ ఆశ్రమంలో జరుగుతున్న లక్ష చండీ మహా యజ్ఞానికి శనివారం అనురాగ్ ఠాకూర్ సతీసమేతంగా హాజరయ్యారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ శంకరాచార్య సంప్రదాయ పీఠాల్లో గుర్తింపు పొందిన విశాఖ శ్రీశారదాపీఠం లక్ష చండీ మహాయజ్ఞాన్ని పర్యవేక్షిస్తుండటం, ఆ యజ్ఞంలో తాను పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అమ్మవారి ఆదేశం ఉంటే తప్ప ఇంత బృహత్తర కార్యక్రమం చేపట్టడం సాధ్యం కాదన్నారు. కాగా, శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యజ్ఞభూమిలో శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ రాజశ్యామల, చంద్రమౌళీశ్వరుల పీఠార్చన విశేషంగా నిర్వహించారు. 2,200 మంది బ్రాహ్మణులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఏకకాలంలో రుద్రం పఠించడంతో కురుక్షేత్ర ప్రాంగణమంతా శివ నామస్మరణతో మార్మోగింది. అలాగే యజ్ఞం నిర్వహణలో భాగంగా 6,976 చండీ పారాయణ హోమాలు పండితులు నిర్వహించారు. గుంతీమాత, స్వాత్మానందేంద్ర సరస్వతి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## క్లుప్తంగా...

### 22న ఢిల్లీ మేయర్ ఎన్నిక

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మేయర్ ఎన్నిక ఈ నెల 22న జరగనుంది. ఈ మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ జనరల్ (ఎల్జీ) వి.కె. సక్సేనా అనుమతినిచ్చారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిఫారసు మేరకు 22న మున్సిపల్ హౌస్ సమావేశమై అదే రోజు మేయర్‌ను ఎన్నుకోవడానికి సక్సేనా అంగీకరించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) మొదటి సమావేశమైన 24 గంటల్లోనే మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తి కావాలని సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. మేయర్ ఎన్నికల్లో ఎల్జీ నామినేట్ చేసిన సభ్యులకు ఓటు వేసే హక్కు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి పరిస్థితులు అనుకూలంగా మారాయి.

### పాకిస్తాన్‌ను తాలిబన్లు ఆక్రమించుకుంటారేమో!

**న్యూఢిల్లీ:** తాలిబన్లు ఏదో ఒకరోజు పాకిస్తాన్‌ను ఆక్రమించుకున్నా ఆశ్చర్యపడాల్సిన పని లేదని ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ అన్నారు. పాకిస్తాన్‌లోని రేవు నగరం కరాచీలో పోలీసు స్టేషన్‌పై శుక్రవారం జరిగిన ఉగ్రవాదిపై ఆమె స్పందించారు. ఆ దేశాన్ని భయకంపితులను చేసే సామర్థ్యం ఐసిస్ ముష్కర మూకలకు కాదు, పాకిస్తానీ తాలిబన్లకు ఉందని పేర్కొన్నారు.

### ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ హాస్పిటల్స్ సీఈఓగా మేఘనా పండిట్



**లండన్:** బ్రిటన్‌లోని అతిపెద్ద బోధనా ఆసుపత్రుల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ హాస్పిటల్స్–ఎన్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్టు సీఈఓగా భారత సంతతికి చెందిన వైద్యురాలు ప్రొఫెసర్ మేఘనా పండిట్ నియమితులయ్యారు. నేషనల్ హెల్త్ సర్వీస్(ఎన్‌హెచ్ఎస్) ట్రస్టుకు ఒక మహిళ, అందునా భారత సంతతికి చెందిన వ్యక్తి సీఈఓ కావడం ఇదే తొలిసారి. ఆమె 2022 జూలై నుంచి ఓయూహెచ్ మధ్యంతర సీఈఓగా ఉన్నారు. కఠిన పోటీని ఎదుర్కొని తాజాగా పూర్తిస్థాయి సీఈఓ అయ్యారు. భాగస్వామ్య వర్సిటీలతో, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ హాస్పిటల్స్ చారిటీతో కలిసి పనిచేస్తానని మేఘనా చెప్పారు. అత్యున్నత నాణ్యతతో కూడిన పరిశోధనలు, నవీన ఆవిష్కరణలపై ప్రత్యేకంగా దృష్టి పెడతానన్నారు. ఆమె అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీలో మేఘనా పండిట్ శిక్షణ పొందారు. అమెరికాలో యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్‌లో యూరోగైనకాలజీ విజిటింగ్ ప్రొఫెసర్‌గా, ఎన్‌హెచ్ఎస్ ట్రస్టులో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా, వార్విక్ యూనివర్సిటీలో గౌరవ ప్రొఫెసర్‌గా చేశారు.

## పండోరా క్లస్టర్



అంతరిక్షంలో మనకు సుదూరంలో ఉన్న 'పండోరాస్ క్లస్టర్' తాలూకు అద్భుత దృశ్యాలివి. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ వీటిని తొలిసారిగా తన అత్యాధునిక నియర్ ఇన్‌ఫ్రారెడ్ కెమెరా సాయంతో ఇలా అందంగా బంధించింది! మూడు భారీ గెలాక్సీల సమూహాలు పరస్పరం కలసిపోయి ఒక మెగా క్లస్టర్‌గా ఏర్పడ్డ తీరును నాన్ని కూడా ఈ క్లస్టర్లో గమనించవచ్చని నాసా చెబుతోంది. అంతేగాక ఈ కలయిక వల్ల పుట్టుకొచ్చిన అతి శక్తిమంతమైన గురుత్వాకర్షణ శక్తి వల్ల పండోరాకు ఆవల మరింత సుదూరాల్లోని గెలాక్సీలను కూడా పరిశీలించడం జేమ్స్ వెబ్‌కు సులువుగా మారిందట! పండోరా క్లస్టర్‌ను భూమి నుంచి ఇంత స్పష్టంగా వీక్షించగలగడం ఇదే తొలిసారి.

## కృష్ణబిలం పుట్టింది!



అంతరిక్షంలో ఒక అరుదైన దృగ్విషయం సైంటిస్టుల కంటబడింది! రెండు న్యూట్రాన్ నక్షత్రాలు పరస్పరం కలిసిపోయి కిలోనోవాగా పేర్కొనే భారీ పేలుడుకు దారి తీయడమే గాక, చూస్తుండగానే శక్తిమంతమైన కృష్ణబిలంగా రూపాంతరం చెందాయి. ఇటీవలి కాలంలో అంతరిక్షంలో చోటుచేసుకున్న అత్యంత శక్తిమంతమైన పేలుడు ఇదేనని నాసా వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో రెండు తారలూ కలిసిపోయి కొద్దిసేపు ఒకే తారగా మారి అలరించాయట. ఈ మొత్తం ఎపిసోడ్‌ను చిలీలోని యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ నుంచి సైంటిస్టులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించారు. ఇదంతా మనకు 1.5 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఎన్‌జీసీ4993 గెలాక్సీలో చోటుచేసుకుందట.

# బ్రిటన్ గ్రాఫ్ పడిపోతోంది..!


### ముసురుకుంటున్న మాంద్యం • తీవ్ర ఆర్థిక సంక్షోభం • షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు

### నిత్యావసరాల ధరలు నానాటికీ పైపైకి • వృద్ధి రేటు అట్టడుగుకు

యునైటెడ్ కింగ్‌డమ్. స్థిరత్వానికి మారుపేరు. ఎన్ని సంక్షోభాలు, ప్రపంచ యుద్ధాలు జరిగినా ఆర్థిక మూలాలు చెక్కు చెదరని దేశం. కానీ ఇప్పుడు ఆ దేశం కనీవినీ ఎరుగని గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. ఏడాదిలో ముగ్గురు ప్రధానమంత్రులు మారారు. అయినా బలహీనపడిపోతున్న ఆర్థిక వ్యవస్థని కాపాడే దిక్కు లేకుండా పోయింది. ధనిక దేశాల కంటే అన్నింట్లోనూ వెనుకబడిపోతూ మాంద్యం ఉచ్చులో చిక్కుకుంటోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్







### నానాటికీ పతనం...

బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకి పతనమైపోతోంది. ధరాభారం ప్రజల జేబుల్ని గుల్ల చేస్తోంది. పెరుగుతున్న ధరలకి తగ్గట్టుగా ఆదాయాలు పెరగకపోవడంతో ప్రజలకి కొనుక్కొని తినే స్తోమత కూడా కరువు అవుతోంది.దీంతో సమాజంలోని వివిధ వర్గాలు వేతనాల పెంపు డిమాండ్‌తో సమ్మెకు దిగుతున్నాయి. ప్రపంచంలోని మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు ఈ ఏడాది ఆర్థికంగా పుంజుకుంటే బ్రిటన్ మరింత క్షీణిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేస్తోంది. ఆర్థిక మాంద్యం ఎదుర్కోక తప్పదని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రతో చమురు లభ్యత చాలా దేశాలకు అతి పెద్ద సమస్యగా మారింది. అమెరికా తన సొంత గడ్డపై లభించే శిలాజ ఇంధనాలపై ఆధారపడితే, ఫ్రాన్స్ అణు విద్యుత్‌పైనా, నార్వే జలవిద్యుత్‌పైన ఆధారపడ్డాయి. యూకే గ్యాస్‌పైనే ఆధారపడే దేశం కావడంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపెడైపోయాయి. ఒకానొక దశలో 100% పెరిగాయి. దేశం ఆర్థికంగా కుదేలు కావడానికి ఇంధనం అసలుసిసలు కారణమని ఫిస్కల్ స్టడీస్ ఇనిస్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ కార్ల్ ఎమ్మర్‌సన్ అభిప్రాయపడ్డారు.

### జీ–7 దేశాల్లో వెనక్కి


అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి సంపన్న దేశాల కంటే బ్రిటన్ ఎందుకు వెనుకబడిందనే చర్చ జరుగుతోంది. కరోనా మహమ్మారి, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రపంచ ఆర్థిక వ్యవస్థలనే ఛిన్నాభిన్నం చేశాయి. కరోనా విసిరిన సవాళ్ల నుంచి కోలుకునే దశలో ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన యుద్ధం పులి మీద పుట్రలా మారింది. అన్నింటిని తట్టుకొని ధనిక దేశాలు మళ్లీ పూర్వ స్థితికి వస్తూ ఉంటే బ్రిటన్ మాత్రం కోలుకోలేకపోతోంది. ఇందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. రాజకీయాలు, వాతావరణ పరిస్థితులు వంటివి కూడా ప్రభావం చూపిస్తాయి. ఇతర దేశాలు విద్య, ఆరోగ్య రంగం ఆధారంగా పరిస్థితుల్ని అంచనా వేస్తే బ్రిటన్ మాత్రం సేవల ఆధారంగా నిర్ణయిస్తుంది. జీ–7 దేశాలన్నీ ఈ ఏడాది కోలుకుంటాయని ఐఎంఎఫ్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. కానీ బ్రిటన్ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.




### బ్రెగ్జిట్ దెబ్బ...

ప్రపంచదేశాలు కరోనా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటి సంక్షోభాలను ఎదుర్కొంటే బ్రిటన్ ఆర్థిక సమస్యలకు బ్రెగ్జిట్ అదనపు కారణంగా నిలిచింది. 2016లో యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచీ దేశానికి ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. బ్రెగ్జిట్ కారణంగా యూకే ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి ఏకంగా 10 వేల కోట్ల పౌండ్ల నష్టం వాటిల్లుతోందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. దీర్ఘకాలంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ 4 శాతానికి తగ్గుతుందని తెలిపింది. 2021 జనవరి నుంచి బ్రిటన్ నుంచి ఈయూకు ఎగుమతులు 16% పడిపోయాయి. ఈయూ నుంచి వచ్చే పెట్టుబడులు 2,900 కోట్ల పౌండ్లు తగ్గిపోయాయి.

### శ్రామికులు కావలెను...




బ్రెగ్జిట్ ముందు వరకు ఈయూ నుంచి బ్రిటన్‌కి స్వేచ్ఛగా పని చేయడానికి వచ్చేవారు. ఇప్పుడు వర్కర్లు రావడం మానేశారు. ఫలితంగా ఆతిథ్యం, వ్యవసాయం, సేవా రంగాల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. యువత పని చేయడం కంటే ఉన్నత చదువులపై దృష్టి పెడుతూ ఉంటే, వయసు మీద పడ్డ వారు ముందస్తుగా పదవీ విరమణ చేస్తున్నారు. అత్యధికులు రోగాల పాలై ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నారే తప్ప పని చేసే వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఇవన్నీ దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి.

డాలర్‌తో పౌండ్ విలువ **0.83**



బ్రిటన్ జీడీపీ వృద్ధి రేటు అంచనా **-0.6%**




ద్రవ్యోల్బణం **10.1%**




## ● శివరాత్రి శోభ



మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగా–యమున–సరస్వతి నదుల త్రివేణి సంగమం ప్రాంతంలో పవిత్ర స్నానాలు చేస్తున్న భక్తులు

## జీఎస్టీ ఫైలింగ్ ఆలస్య రుసుము తగ్గింపు



**న్యూఢిల్లీ:** జీఎస్టీ వార్షిక రిటర్నుల ఫైలింగ్ ఆలస్య రుసుమును హేతుబద్ధీకరిస్తూ జీఎస్టీ మండలి 49వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను నమోదిత వ్యక్తులు ఫామ్ జీఎస్‌టీఆర్–9కు సంబంధించి రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉంటే ఆలస్య రుసుము రోజుకు రూ.50, రూ.5–20 కోట్ల టర్నోవర్ ఉంటే రోజుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రుసుము రూ.200 ఉంది. పన్ను చెల్లింపుదార్లకు ఉపశమనం కలిగించడానికి ఫామ్ జీఎస్‌టీఆర్–4, ఫామ్ జీఎస్‌టీఆర్–9, ఫామ్ జీఎస్‌టీఆర్–10లో పెండింగ్‌లో ఉన్న రిటర్నులకు సంబంధించి షరతులతో కూడిన మినహాయింపు లేదా ఆలస్య రుసుము తగ్గించడం ద్వారా క్షమాభిక్ష పథకాలను జీఎస్టీ మండలి సిఫార్సు చేసింది.

**రాష్ట్రాలకు పరిహార బకాయిలు..**

2022 జూన్‌కు సంబంధించి రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహార బకాయిలు రూ.16,982 కోట్లు, అలాగే ఆరు రాష్ట్రాలకు మరో రూ.16,524 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రకటించారు. కేంద్రం తన సొంత వనరుల నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకుందని, భవిష్యత్తులో పరిహార రుసుము వసూళ్ల నుంచి ఈ మొత్తాన్ని తిరిగి పొందుతామని ఆమె చెప్పారు. దీంతో జీఎస్టీ చట్టం 2017 ప్రకారం ఐదేళ్ల కాలానికి తాత్కాలికంగా అనుమతించదగిన మొత్తం పరిహార బకాయిలను కేంద్రం క్లియర్ చేస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన వెల్లడించింది. రాష్ట్రాలు వారి అకౌంటెంట్ జనరల్ నుంచి సర్టిఫికేట్‌లను ఇచ్చినప్పుడు పెండింగ్‌లో ఉన్న ఏవైనా పరిహార రుసుము మొత్తాలను వెంటనే క్లియర్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పరిహార బకాయి కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.689 కోట్లు, తెలంగాణకు రూ.548 కోట్లు సమకూరనున్నాయి.

**బెల్లం పానకంపై తగ్గింపు..**

ఇక విడిగా విక్రయించే బెల్లం పానకంపై ప్రస్తుతం 18 శాతం ఉన్న జీఎస్టీ ఎత్తివేస్తూ మండలి నిర్ణయం తీసుకుంది. ప్యాక్, లేబులింగ్ చేసి బెల్లం పానకం విక్రయిస్తే 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పెన్సిల్ షార్ప్‌నర్స్‌కు 18 శాతం నుంచి జీఎస్టీని 12 శాతానికి చేర్చారు. పన్ను ఎగవేతలను అరికట్టడంతోపాటు పాన్ మసాలా, గుట్కా, నమిలే పొగాకు వంటి వస్తువుల నుండి ఆదాయ సేకరణను మెరుగుపరచడానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ చేసిన సిఫార్సులను జీఎస్టీ మండలి ఆమోదించింది.

## మోదీకి బానిసలా మారిన ఈసీ: ఉద్ధవ్



**ముంబై:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బానిసగా మారిపోయిందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ధ్వజమెత్తారు. శివసేనను అంతం చేయడం ఎవరి తరమూ కాదని బీజేపీ, మోదీ గుర్తుంచుకోవాలన్నారు. శివసేన పేరు, ఎన్నికల గుర్తు సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయని ఈసీ ప్రకటించిన నేపథ్యంలో ఠాక్రే శనివారం ముంబైలో తన వర్గం నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ పేరును, గుర్తును దొంగిలించిన వాళ్లకు, వారి యజమానులకు గుణపాఠం నేర్పిద్దామని పిలుపునిచ్చారు. ''ఎన్నికల్లో నెగ్గడానికి బాల్‌ఠాక్రే ఫొటో, పేరును మోదీ వాడుకున్నారు. ఈ ద్రోహులకు ఠాక్రే ఫొటో కావాలి గానీ ఆయన కుటుంబం అక్కర్లేదు. దొంగ (సీఎం షిండే)కు బుద్ధి చెప్పేదాకా విశ్రమించేదే లేదు. అతను తేనెతుట్టెపై రాయి విసిరాడు. తేనెటీగలు కుట్టడం తథ్యం. దొంగిలించిన విల్లు, బాణాన్ని మోయలేడు. శివధనస్సు ఎత్తలేకపోయిన రావణుడిలాగే కూలిపోతాడు'' అన్నారు.

### 'పరిపూర్ణత్వానికి దగ్గరగా కొలీజియం'

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకం కోసం ఉద్దేశించిన కొలీజియం వ్యవస్థ ప్రస్తుతం పరిపూర్ణత్వానికి(పర్‌ఫెక్ట్ మోడల్) దగ్గరగా ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ చెప్పారు. న్యాయ వ్యవస్థలో నియామకాలు, సంస్కరణలపై సీజేఏఆర్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో జడ్జీల నియామకం కోసం పేర్లను ప్రతిపాదించడం వెనుక కఠినమైన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొలీజియం కంటే మెరుగైన వ్యవస్థ ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు. ప్రత్యామ్నాయం లేదు కాబట్టి కొలీజియంను కాపాడుకొనేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొలీజియంపై కేంద్ర ప్రభుత్వం, న్యాయ వర్గాల మధ్య వివాదం రగులుతున్న నేపథ్యంలో జస్టిస్ యు.యు.లలిత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### 18.82 లక్షల దీపాలతో గిన్నిస్ రికార్డు

**ఉజ్జయిని:** మహా శివరాత్రి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో ఏకంగా 18,82,229 దీపాలు వెలిగించారు. గిన్నిస్ రికార్డు సృష్టించారు. శనివారం సాయంత్రం క్షిప్రా నది ఒడ్డున నిర్వహించిన ఈ కార్యక్రమంలో 20 వేల మంది వాలంటీర్లు పాల్గొన్నారు. 2022లో అయోధ్యలో అత్యధికంగా 15.76 లక్షల దీపాలు వెలిగించారు. ఉజ్జయినిలో గత శివరాత్రి సందర్భంగా 11,71,078 దీపాలు వెలిగించారు.

### ముందెవరు ఐ లవ్యూ చెప్తారో?

**విపక్ష ఐక్యతపై ఖుర్షీద్ • కాంగ్రెసే చెప్పుందని వెయిటింగ్: నితీశ్**

**పట్నా:** బీజేపీని ఓడించేందుకు జాతీయ స్థాయిలో విపక్షాలు ఎంత త్వరగా ఒక్కతాటిపైకి వస్తే అంత మంచిదని కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ''అయితే ఇందుకు ఎవరు ముందుగా చొరవ తీసుకోవాలన్నదే ప్రశ్న. ప్రేమలోనూ ఇలాంటి సందిగ్ధం అప్పుడప్పుడూ ఎదురవుతుంది. ఎవరు ముందు ఐ లవ్యూ చెప్పాలన్న ప్రశ్న తలెత్తుతుంది'' అంటూ చమత్కరించారు. శనివారం పట్నాలో జరిగిన సీపీఎం భేటీ ఇందుకు వేదికైంది. అందుకు కాంగ్రెసే తక్షణం చొరవ తీసుకోవాలని ఖుర్షీద్‌తో అందులో పాల్గొన్న జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, సూచించారు. ''మేం ఎదురు చూస్తున్నాం (వుయ్ ఆర్ వెయిటింగ్). ఈ విషయంలో ఇంకేమాత్రం ఆలస్యం కూడదు'' అన్నారు. ''రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా వచ్చిన ఊపును పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నింటితోనూ జట్టు కట్టాలి. తక్షణం ఈ పని జరగాలి'' అని సూచించారు. అలా విపక్షాలన్నీ కలసికట్టుగా రంగంలోకి దిగితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. త్వరలో ఢిల్లీ వెళ్లి రాహుల్‌తో పాటు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో భేటీ అవుతానని నితీశ్ తెలిపారు. విపక్ష కూటమిలో ప్రాంతీయ పార్టీలకే కాంగ్రెస్ అధిక ప్రాధాన్యమివ్వాలని ఆర్జేడీ నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సూచించారు!

## మాజీ భార్యతోపాటు ఆరుగురి కాల్చివేత

**అమెరికాలో 52 ఏళ్ల వ్యక్తి ఘాతుకం**

**ఆర్కాబుతాలా(యూఎస్):** అమెరికాలో మరో ఘోరం జరిగిపోయింది. ఒంటరితనంతో బాధపడుతున్న ఓ వ్యక్తి తన మాజీ భార్య, సవతి తండ్రితో పాటు మరో నలుగురిని కాల్చి చంపాడు. ఉత్తర మిసిసిపీలో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది. రిచర్డ్ డేల్ క్రమ్(52) తొలుత టెన్నెసీ స్టేట్ లైన్ సమీపంలోని ఆర్కాబుతాలా దుకాణంలో బయట ఓ వాహనంలో డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తిని హ్యాండ్‌గన్‌తో కాల్చేశాడు. తర్వాత కొద్ది మైళ్ల దూరంలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి, అక్కడున్న మాజీ భార్య, ఆమె భర్తపై తూటాల వర్షం కురిపించాడు. మాజీ భార్య మరణించగా భర్త గాయాలపాలయ్యాడు. అనంతరం మరో తన సవతి తండ్రి ఇంట్లోకి దూరి ఆయన్ను, ఆయన సోదరిని అంతం చేశాడు. తర్వాత తాపీగా నడుచుకుంటూ తన ఇంటి వెనుకకు చేరుకున్నాడు. రోడ్డుపై కనిపించిన ఓ వ్యక్తిపై, వాహనంలో కూర్చున్న మరొకరిని కాల్చి చంపాడు. పోలీసులు రంగంలోకి దిగి క్రమ్‌ను అతడి ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. కాల్పుల్లో ఆరుగురు మరణించడం పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. తుపాకీ చట్టాలను సంస్కరించడంపై ఇకనైనా దృష్టి పెట్టాలని కాంగ్రెస్‌కు జో బైడెన్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

## ఉగ్రవాదం తీవ్రవాదం | 80% తగ్గాయి: అమిత్ షా



**నాగపూర్:** నరేంద్ర మోదీ హయాంలో కశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో వామపక్ష తీవ్రవాదం 80 శాతం దాకా తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. శనివారం ఇక్కడ మరాఠా వార్తా లోక్‌మత్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీకి ముందు దాకా దేశం పలు అంతర్గత భద్రతా సవాళ్లతో సతమతమవుతూ ఉండేదన్నారు. అలాంటిది గతేడాది కశ్మీర్ లోయను ఏకంగా 1.8 కోట్ల మంది పర్యాటకులు సందర్శించడం గొప్ప ఘనత అని అభిప్రాయపడ్డారు. ''అంతేగాక గత 70 ఏళ్లలో మొత్తం కలిపి కశ్మీర్‌కు రూ.12 వేల కోట్ల పెట్టుబడులు వస్తే గత మూడేళ్లలోనే మరో రూ.12 వేల కోట్ల పెట్టుబడులను మోదీ ప్రభుత్వం సాధించింది. పైగా కశ్మీర్‌లో ప్రతి ఇంటికీ నల్లా నీరు, కరెంటు అందించాం. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో కూడా వామపక్ష తీవ్రవాదం పూర్తిగా అదుపులోకి వచ్చింది. 60 శాతం ప్రాంతాల్లో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేశాం కూడా. రక్షణ రంగంలో దేశం స్వయంసమృద్ధంగా మారుతోంది. ఉపగ్రహ ప్రయోగాల్లో మనమెంతగా దూసుకెళ్తున్నదీ ప్రపంచమంతా చూస్తోంది. మన స్టార్టప్‌లు దుమ్ము రేపుతున్నాయి. ఇలా అన్ని రంగాల్లోనూ భారత్‌లో ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో చూడాలన్న ప్రధాని మోదీ ఆశయం నెరవేరేందుకు ఇంకెంతో దూరం లేదు'' అన్నారు. అందుకు తగ్గట్టుగా వచ్చే పాతికేళ్ల అమృత కాలంలో పలు లక్ష్యాలు పెట్టుకుని ముందుకెళ్తున్నట్టు వివరించారు.

## సిసోడియాకు సీబీఐ పిలుపు

**మద్యం కుంభకోణంలో నేడు విచారణ**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాను సీబీఐ ఆదివారం విచారణకు పిలిచింది. ఆయనపై విచారణ కొనసాగుతున్నందున ఇంకా నిందితుల జాబితాలో చేర్చలేదని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో గత అక్టోబర్ 17న సీబీఐ ఆయన్ను ప్రశ్నించడమే గాక ఇంటినీ, బ్యాంకు లాకర్లను కూడా శోధించింది.

**కుంభకోణమే లేదు: కేజ్రీవాల్**

మద్యం కుంభకోణమనేదే జరగలేదని ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఆప్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగా మోదీ సర్కారు కుట్రపూరితంగా ఇలా లేని కుంభకోణాన్ని పుట్టించిందని ఆరోపించారు. ''అయితే విచారణకు మేం పూర్తిగా సహకరిస్తాం. చివరికి సత్యమే గెలుస్తుంది'' అన్నారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలను బీజేపీ ఎద్దేవా చేసింది. ఏ కుంభకోణమూ జరక్కపోతే మద్యం విధానాన్ని ఎందుకు రద్దు చేసినట్టని ప్రశ్నించింది.

## దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల రాక

- కునో జాతీయ పార్కుకు తరలింపు
- భారత్‌లో 20కి చేరిన చీతాల సంఖ్య

**శివోపూర్:** దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాలు భారత వైమానిక దళం విమానంలో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఎయిర్‌పోర్టుకు శనివారం ఉదయం 10 గంటలకు చేరుకున్నాయి. ఇందులో ఏడు మగవి, ఐదు ఆడ చీతాలు ఉన్నాయి. వీటిని 165 కిలోమీటర్ల దూరంలోని శివోపూర్ జిల్లా కునో జాతీయ పార్కు(కేఎన్‌పీ)లోని క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లో భద్రంగా వదిలారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర పర్యావరణ, అడవుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదు నెలల క్రితం ఆఫ్రికా ఖండంలోని నమీబియా నుంచి 8 చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చీతాలను గత ఏడాది సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కునో జాతీయ పార్కులో స్వయంగా వదిలారు. ఇవి ప్రస్తుతం అడవిలో సందడి చేస్తున్నాయి. తాజాగా తీసుకొచ్చినవాటితో కలిసి మన దేశంలో చీతాల సంఖ్య 20కు చేరుకుంది. వీటిలో 10 మగ, 10 ఆడ చీతాలు ఉన్నాయి. భారత్‌లో చీతాలు ఏడు దశాబ్దాల క్రితం పూర్తిగా అంతరించిపోయాయి. వీటిని మళ్లీ ప్రవేశపెట్టి, సంఖ్యను పెంచాలని 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సంకల్పించింది. కేంద్ర పర్యావరణ శాఖ మాజీ మంత్రి జైరామ్ రమేశ్ 'ప్రాజెక్ట్ చీతా'కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆఫ్రికా ఖండం నుంచి చీతాలను తీసుకొచ్చేందుకు అక్కడి దేశాలతో భారత ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో చీతా కోసం రూ.2,48,296 (3,000 డాలర్లు) ఖర్చు చేసింది. చీతాలను 30 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచిన అనంతరం ఆరోగ్య పరిస్థితి సక్రమంగా ఉంటే అడవిలోకి వదిలేస్తారు.



కునో జాతీయ పార్కు క్వారెంటైన్ ఎన్‌క్లోజర్లో చీతా

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 19 : ఫిబ్రవరి : 2023

# శరణయ్యా త్రినేత్రాయ


బెంగళూరులో ఓ ఆలయంలో నమస్కరిస్తున్న మహిళా భక్తులు


మహాలక్ష్మి లేఔట్ గాయత్రి ఆలయంలో శివలింగాలకు పూజలు


శివరాత్రి సందర్భంగా శనివారం బెంగళూరు పాత ఎయిర్‌పోర్టు రోడ్డులోని బృహత్ శివునికి పూజలు

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పర్వదినం
- శైవ ఆలయాల్లో భక్త నీరాజనం

**బనశంకరి:** రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. కరోనా మహమ్మారి వల్ల రెండేళ్లుగా శివరాత్రి ఆచరణకు ఆటంకాలు ఏర్పడ్డాయి. నిబంధనల వల్ల ఆలయాల్లో పరిమితంగా పూజలు జరిగాయి. ఈసారి కరోనా ఇబ్బంది లేకపోవడంతో భక్తజనం హరోం హరా అంటూ పరమేశ్వరుని దేవస్థానాలకు వెల్లువలా తరలివచ్చారు.

**వేకువ నుంచే భక్త వరద**

ఐటీ సిటీలో మహాశివరాత్రి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పరమ శివునికి పరమ పవిత్రమైన మహాశివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని శైవ క్షేత్రాలు భక్తజనంతో నిండిపోయాయి. వేకువజాము నుంచి భక్తులు శివాలయాలకు విచ్చేసి ముక్కంటిని దర్శించుకుని జలం, పుష్పం పత్రాలతో అర్చించారు. చారిత్రక నేపథ్యం కలిగిన మైసూరు నంజనగూడు లోని శ్రీకంఠేశ్వరునికి పూజలు చేశారు. కోలారు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కోటిలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. వేలాదిగా భక్తులు శివలింగాలను దర్శనం చేసుకున్నారు. కోటనాడు చిత్రదుర్గ, హుబ్లీ సిద్ధారూఢ మఠం, గోకర్ణ, మురుడేశ్వర, గోకర్ణ, ధర్మస్థలం తో పాటు రాష్ట్రంలోని పురాతన శైవక్షేత్రాల్లో త్రినేత్రుడు విశేష పూజలందుకున్నాడు.

**బెంగళూరు దేవస్థానాల్లో**


ఉద్యాననగరిలో పురాతన చరిత్ర కలిగిన శైవక్షేత్రాల్లో వేలాదిగా భక్తజనం పార్వతీపతిని దర్శించుకుని పునీతులయ్యారు. దీంతో శైవక్షేత్రాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. పురాతన శైవ క్షేత్రాలైన కాడుమల్లేశ్వర, గవిపురం గవిగంగాధరేశ్వరస్వామి దేవస్థానం, బుల్ టెంపుల్, హలసూరు సోమేశ్వర ఆలయం, చిక్కపేటలోని కాశీవిశ్వనాథ మందిరం సహా స్థానిక గుడులలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కెంఫోర్టు బృహత్ శివాయ నమః

**బనశంకరి:** సిలికాన్ సిటీలోని పాత విమానాశ్రయం రోడ్డులో మురుగేశ్‌పాళ్యలో వెలసిన కెంఫోర్టు శివాలయంలో శివరాత్రి విశేష పూజలు జరిగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అతి పెద్ద శివుని విగ్రహానికి పూజలు చేశారు. యువతులు శివలింగాలకు క్షీరాభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడిచేశారు. భక్తులకు ఆలయకమిటీవారు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.


బెంగళూరు కాడు మల్లేశ్వర ఆలయంలో భక్తుల క్యూ


పాత విమానాశ్రయం రోడ్డు బృహత్ శివాలయంలో క్షీరాభిషేకం


కాడు మల్లేశ్వర మూల విరాట్‌కు పూజలు


ధార్వాడ కొప్పదగేరిలోని పురాతన ఆలయంలో లింగార్చన

## న్యూస్‌రీల్

### ఎట్టకేలకు చిక్కిన చిరుత



**దొడ్డబళ్లాపురం:** నెలమంగల తాలూకా గేరెహళ్లి చుట్టుపక్కల పరిసరాల్లో సంచరిస్తూ గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కుంటి చిరుత ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున చిక్కింది. అటవీశాఖ, డీఆర్ఎఫ్ఓ అధికారులు రెండు రోజులుగా చిరుత కోసం కార్యాచరణ జరుపుతుండగా శనివారం ఉదయం చిరుతను గుర్తించి మత్తు మందు ఇచ్చి బోనులో బంధించారు. చిరుత కాలికి గాయమై పరుగెత్తలేని స్థితిలో ఉండడం వల్ల త్వరగా పట్టుబడింది. ఇది గ్రామాలపై పడి కుక్కలు, పశువులను బలితీసుకుంది.

### విద్యుత్ ఫెన్సింగ్‌కు రైతు బలి

**దొడ్డబళ్లాపురం:** అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఫెన్సింగ్ తంతి తగిలి రైతు మృతి చెందిన సంఘటన మాగడి తాలూకా బాచేనహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఆనంద్ (48) మృతి చెందిన రైతు. శనివారం ఆనంద్ పొలంలో కట్టేసిన ఆవు కట్టు విప్పుకుని వెళ్లిపోవడంతో దాన్ని వెతుక్కుంటూ సమీపంలోని మరో తోటలోకి వెళ్లి వెతకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆ తోటకు ఉన్న విద్యుత్ ఫెన్సింగ్ తంతిని ముట్టుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ ఫెన్సింగ్ వేసుకున్న తోట యజమానిపై చర్యలు తీసుకోవాలని, బెస్కాం అధికారులు కూడా ఆనంద్ మృతికి కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు.

### చెవిలో పువ్వు పోస్టర్లు

**శివాజీనగర:** అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ మధ్య చెవిలో పువ్వు పోస్టర్ యుద్ధం ఆరంభమైంది. బెంగళూరుతో పాటు రాష్ట్రంలో పలుచోట్ల బీజేపీ సర్కారు సాధనల పోస్టర్లు వెలిశాయి, ఈ పోస్టర్లపై ఇక చాలు చాలు– చెవిలో పువ్వు అనే పోస్టర్‌లను శుక్రవారం నుంచి కాంగ్రెస్ నాయకులు అతికించడం మొదలు పెట్టారు. బడ్జెట్ ముగిసిన తరువాత చెవిలో పువ్వు చాలు అనే పోస్టర్లను అతికించారు.

### పీఎస్‌లో పోలీసులే లేరు

**బనశంకరి:** పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే స్టేషన్‌లో ఒక్క పోలీస్ కూడా లేరని మంజునాథ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతడి సైకిల్ చోరీకి గురికావడంతో ఫిర్యాదు చేయడానికి మహాలక్ష్మీ లేఔట్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఒక్క పోలీసు కూడా అక్కడ కనిపించలేదు. దాదాపు 45 నిమిషాల తరువాత వచ్చారు. సైకిల్ చోరీకి గురైంది అంటూ చెప్పడంతో నవ్వారని, ఫిర్యాదు స్వీకరించడానికి రైటర్ సైతం అందుబాటులో లేడని బాధితుడు ఆరోపించాడు. దీంతో ఫిర్యాదు చేయకుండా వెనక్కి వచ్చేశాడు. మహాలక్ష్మీ లేఔట్ పోలీసులపై తీరుపై పోలీసు ఉన్నతాధికారులకు ట్విటర్‌లో ఈ విషయాన్ని ట్యాగ్ చేశాడు.

### అయ్యో గజరాజా

- టాయ్‌లెట్ గుంతలో పడి మృతి


ప్రాణాలు కోల్పోయిన ఏనుగు

**మైసూరు:** ఎస్టేట్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఏనుగును బలిగొంది. మరుగుదొడ్ల కోసం భూమిలో ఏర్పాటు చేసిన సిమెంటు ట్యాంకులో పడి అడవి ఏనుగు ప్రాణాలొదిలింది. కొడగు జిల్లాలోని సోమవార పేటె తాలూకాలోని శనివార సంతె వద్ద ఎళెనీరు గుండి ఎస్టేట్‌లో చోటు చేసుకుంది. ఎస్టేట్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చేయడానికి సిమెంటు ట్యాంకును కడుతూ ఉన్నారు. శుక్రవారం రాత్రి ఆహారం కోసం వచ్చిన ఏనుగు చీకట్లో కనిపించక గుంతలోకి పడిపోయింది. అక్కడ ఇరుక్కుపోయి ఊపిరి ఆడక కన్నుమూసింది. డీసీఎఫ్ పూవయ్య ఆధ్వర్యంలో జేసీబీతో ఏనుగు కళేబరాన్ని బయటకు తీసి పోస్టుమార్టం జరిపి అంత్యక్రియలు పూర్తిచేశారు.

### అటవీ ప్రాంతంలో మంటలు ఆర్పేందుకు వెళ్లి...

- తీవ్ర గాయాలతో గార్డు మృతి


సుందరేశ్ (ఫైల్)

**యశవంతపుర:** హాసన జిల్లా సకలేశపుర తాలూకా కాడుమనె అటవీ ప్రాంతానికి గురువారం నిప్పంటుకుంది. ప్రమాదాన్ని గుర్తించిన ఫారెస్టర్ మంజునాథ్, గార్డు సుందరేశ్ మంటలను ఆర్పడానికి వెళ్లి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన బెంగళూరు సెయింట్ జాన్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గార్డు సుందరేశ్ మృతి చెందగా మంజునాథ్‌కు చికిత్స కొనసాగుతోంది. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లిలో ప్రభుత్వ లాంఛనాలతో సుందరేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

## పెద్దలు విడదీస్తే, మృత్యువు ఒక్కటి చేసింది

- యాదగిరి జిల్లాలో ప్రేమజంట ఆత్మహత్య



**యశవంతపుర:** యాదగిరి జిల్లా శహపుర తాలూకాలో ఘోరం జరిగింది. శివరాత్రి పండుగ రోజున ప్రేమజంట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. శహపుర తాలూకా హురసగుండగి గ్రామానికి చెందిన సువర్ణ (20), ఈశప్ప (22)లు ఐదేళ్ల నుంచి ప్రేమించుకొంటున్నారు. తల్లిదండ్రులు సువర్ణకు రెండేళ్ల క్రితం మరో యువకునికిచ్చి పెళ్లి చేశారు. భర్తతో కలిసి బెంగళూరులో ఉన్న సువర్ణ ప్రియున్ని మరువలేకపోయింది. ఇద్దరూ టచ్‌లోనే ఉండేవారు. శివరాత్రి పండుగకు శుక్రవారం హురసగుండిగి వెళ్లింది. శనివారం ఉదయం సువర్ణ, ఈశప్పలు కలిసి జీవితంలో కలిసి జీవించడం సాధ్యం కాదని, కలిసి చనిపోవడమే శరణ్యమని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

**మోసగించాడని ఎస్ఐపై యువతి ఫిర్యాదు**

తనపై ఎస్ఐ అత్యాచారం చేసిన్నట్లు కాలేజీ విద్యార్థిని బెళగావి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో వైర్లెస్ విభాగంలో ఎస్ఐగా పని చేస్తున్న లాల్‌సాబ్ తనను ప్రే, పెళ్లి పేరుతో మభ్యపెట్టి దైహికంగా వాడుకొని మోసం చేశాడని విద్యార్థిని ఫిర్యాదు చేయగా లాల్‌సాబ్‌పై కేసు నమోదు చేశారు. ఈ నెల 10న మరో యువతిని అతడు పెళ్లాడినట్లు బాధితురాలు తెలిపింది. ఫేస్‌బుక్ ద్వారా 2020 జూన్‌లో పరిచయం అయిన లాల్‌సాబ్ ప్రేమ పేరుతో వంచించాడని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు డిమాండ్ చేసింది.

**కొడుకు చేతిలో తండ్రి హతం**

కొడుకు మచ్చు కొడవలితో తండ్రిని నరికి హత్య చేసిన ఘటన గదగ జిల్లా నరగుంద తాలూకా హద్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. మలకసాబ్ (55)ను ఆయన కొడుకు మౌలాసాబ్ హత్య చేశాడు. కుటుంబ కలహాలే కారణమని తెలిసింది. నరగుంద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### జింక వధ కేసులో ఇద్దరి అరెస్టు

**శిడ్లఘట్ట:** శిడ్లఘట్ట తాలూకా బాశెట్టిహళ్లి దగ్గర పూలకుంటె హళ్లి గ్రామంలో తోటలో కృష్ణ జింకను చంపి దానిని దాని మాంసాన్ని వండుకు తిన్న కేసులో ఇద్దరిని అటవీ అధికారులు అరెస్టు చేశారు. గంగిరెడ్డి (57), నాగేష్ (45)లను అరెస్టు చేశారు. వారి నుంచి జింక తల, కాళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరికొంత మాంసాన్ని ఇతరులకు విక్రయించినట్లు తెలిపారు. వీరిద్దరూ గంజిగుంటె గ్రామస్తులని అటవీ అధికారి సుదార్ జయచంద్ర తెలిపారు.

## పీయూసీ విద్యార్థినిపై యాసిడ్ దాడి

- కనకపురలో ప్రేమోన్మాది అకృత్యం

**దొడ్డబళ్లాపురం:** ప్రేమ ను నిరాకరించిందనే కోపంతో విద్యార్థినిపై యాసిడ్ దాడి చేసిన దుండగున్ని కనకపుర పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. కనకపుర పట్టణ నివాసి సుమంత్ నిందితుడు. కొన్నిరోజులుగా ప్రేమించాలని పీయూసీ విద్యార్థిని (17)ని ఇతడు వెంటబడి పీడిస్తున్నాడు. ఆమె తిరస్కరించింది. కోపం పెంచుకున్న నిందితుడు శుక్రవారం రాత్రి కనకపుర తాలూకా బైపాస్ రోడ్డులోని చెరువు వద్ద కాపుకాచి విద్యార్థిని ముఖంపై యాసిడ్ చల్లాడు. దీంతో విద్యార్థిని ముఖం, ఎడమ వైపు కన్నుకు గాయాలు అయ్యాయి. చికిత్స కోసం విద్యార్థినిని బెంగళూరు తరలించారు. కేసు నమోదుచేసుకున్న కనకపుర పోలీసులు శనివారంనాడు నిందితున్ని అరెస్టు చేసారు. మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి హాలప్ప ఆచార్ బెంగళూరు మింటో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. సమాజంలో ఇలాంటి చీడ పురుగులు ఉన్నారని, అలాంటి వారికి చట్ట ప్రకారం తగిన శిక్ష పడేలా చూడ్డమే అందరి బాధ్యత అన్నారు. బాధిత విద్యార్థినికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయం చేస్తుందన్నారు.

## పని పూర్తయితే రూ.2 కోట్లు

- ఎమ్మెల్యే హత్యకు సుపారీలో ఆడియో లీక్


ఎమ్మెల్యే సతీష్‌రెడ్డి

**బొమ్మనహళ్లి:** నగరంలో బొమ్మనహళ్లి బీజేపీ ఎమ్మెల్యే, చీఫ్ విప్ ఎం.సతీష్‌రెడ్డిని హత్య చేయాలని రూ. 2 కోట్ల సుపారీ కేసులో పోలీసులు ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశారు. ఇప్పుడు ముఖ్యమైన ఆడియో ఒక్కటి బయటకు వచ్చింది. ఎమ్మెల్యేకు సన్నిహితునిగా ఉన్న వ్యక్తికి సుపారి గురించి ఫోన్ చేసి చెప్పగా, ఆయన ఎమ్మెల్యే పీఏ అయిన హరీష్‌బాబుకు చేరవేశాడు. అప్రమత్తమైన ఎమ్మెల్యే వెంటనే బొమ్మనహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు విచారణ చేపట్టారు.

**ఎవరెవరు మాట్లాడారు**

చిత్రదుర్గ జిల్లాకు చెందిన బైరేష్ అనే వ్యక్తి బొమ్మనహళ్లికి చెందిన చంద్రుకి చేసిన కాల్ ఆడియో ఇప్పుడు వ్యాప్తి అయ్యింది. ఎమ్మెల్యేను హత్య చేయాలని రూ.2 కోట్ల డీల్ కుదిరిందని చంద్రకు బైరేష్ చెప్పాడు. అయితే ఎవరు సుపారి ఇచ్చారో చెప్పలేదు. ఎమ్మెల్యే సతీష్ రెడ్డి ఫోటోను మాత్రం మాకు ఇచ్చారు, పని పూర్తయితే రూ.2 కోట్లు ఇస్తామన్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి వరకూ ఆయన ఎక్కడెక్కడకు వెళుతున్నారో అన్నదానిపై నిఘా వేశారని చెప్పాడు. చంద్ర వెంటనే ఎమ్మెల్యే పీఏను అప్రమత్తం చేయడంతో కుట్ర బయటపడింది.

### వైభవోపేతం.. వైద్యనాథేశ్వర రథోత్సవం



**తుమకూరు:** తుమకూరు గ్రామీణ నియోజకవర్గం అరియూరులో ప్రసిద్ధి శ్రీ వైద్యనాథేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి తేరుపై అధిష్ఠించి రథోత్సవం జరిపారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు.

### కాంగ్రెస్‌లో లడాయి లేదు

**యశవంతపుర:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను కూడా ముఖ్యమంత్రి అభ్యర్థినంటూ మాజీ డీసీఎం పరమేశ్వర చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా సమర్థించారు. శనివారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా విజయపుర బీఎల్‌డీఈ క్యాంపస్‌లో 770 శివలింగాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం అయన విలేకర్లతో మాట్లాడుతూ... పరమేశ్వర మంచి నాయకుడు, అధికారం కోసం కాంగ్రెస్‌లో లడాయి లేదు. బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే తమ లక్ష్యమని అన్నారు. బీజేపీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులు కలిసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తామన్నారు.

### సాయీశ్వరా నమో నమామి


సాయీశ్వర లింగానికి అభిషేకం

**ప్రశాంతి నిలయం:** ఈశ్వరా మహేశ్వరా పుట్టపర్తీశ్వరా అంటూ అశేష భక్తకోటి సాయీశ్వర నామస్మరణ నడుమ పుట్టపర్తి సత్యసాయి సన్నిధిలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులు సాయీశ్వరలింగాన్ని దర్శించి తరించారు. శనివారం సాయంత్రం వేదపండితుల వేద ఘోష మధ్య సాయీశ్వర లింగాన్ని సాయికుల్వంత్ మందిరంలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఆపై ఏకాదశ ద్రవ్యాభిషేకం, మహారుద్రాభిషేక క్రతువులను నిర్వహించారు. విభూది, బిల్వపత్రి తదితర పవిత్ర ద్రవ్యాలతో అభిషేకించి ఆ అభిషేక జలాన్ని భక్తకోటిపై సంప్రోక్షణ గావించారు.

## ట్రాఫిక్ రద్దీలో ప్రపంచ నంబర్-2

- లండన్ తరువాత బెంగళూరు
- 10 కి.మీ. ప్రయాణానికి అర్ధగంట ఆవిరి
- ఓ సంస్థ సర్వేలో చేదు నిజాలు

**బనశంకరి:** బెంగళూరు నగరంలో మనుషుల కంటే వాహనాలే ఎక్కువ. ఇక ట్రాఫిక్ రద్దీలో ప్రపంచ పటంలో టాప్–3లో చోటు సంపాదించుకుంది. లండన్ నగరం అనంతరం బెంగళూరులోనే అత్యంత ట్రాఫిక్ రద్దీ ఉంది. అందులో వీకెండ్‌లో అయితే చెప్పనలవి కాదు. 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే సరిగ్గా అర్ధగంట అవుతుంది. టామ్‌టామ్ అనే కంపెనీ ఈ విషయం వెలుగులోకి తెచ్చింది. 2022లో టామ్‌టామ్ సంస్థ బెంగళూరులో వివిధ చోట్ల ఆధునిక రీతిలో సర్వే చేసి ట్రాఫిక్ రద్దీని లెక్కగట్టింది. ప్రపంచంలో ట్రాఫిక్ రద్దీలో లండన్, ఆ తరువాత ఐటీ సిటీదే రెండవ స్థానమని తాజా సర్వేలో ప్రకటించింది. సిలికాన్ నగరిలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి 36 నిమిషాల 20 సెకండ్ల సమయం పడుతుంది. ఇక భారత్‌లో బెంగళూరే అత్యధిక ట్రాఫిక్ రద్దీ కలిగిన సిటీ. పూణే 6వ స్థానం, న్యూఢిల్లీ 34, ముంబై 47వ ప్లేసులో ఉన్నాయి.


బెంగళూరులోని యలహంకలో బళ్లారి రోడ్డు ట్రాఫిక్ దుస్థితి


కాలు పెట్టడానికి కూడా చోటు లేనంతగా వాహనాల రద్దీ

**వాహనాలు ఎక్కువ, రోడ్లు తక్కువ**

ఉద్యాననగరిలో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. దీంతో రోడ్లు ఏమాత్రం చాలడం లేదు. రోడ్లు విస్తరణ చాలా తక్కువ గా ఉంది. రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వల్ల సమస్య తీవ్రమైంది. 2020-21తో పోలిస్తే ఒకే ఏడాది బెంగళూరులో 10 కిలోమీటర్లు దూరం సంచార అవధి 40 సెకెండ్లు పెరిగింది. 2022 అక్టోబరు 15 శనివారం బెంగళూరులో అత్యంత రద్దీ ఏర్పడిన రోజుగా నమోదంది. ఆ రోజు 10 కిలోమీటర్ల దూరానికి 33 నిమిషాల 50 సెకండ్లు సమయం పట్టిందని సర్వేలో తెలిపారు.

**14 నిమిషాలు చాలు: ట్రాఫిక్ కమిషనర్**

ఐటీ సిటీలో ట్రాఫిక్ జంఝాటం ఎందుకు అని ట్రాఫిక్ ప్రత్యేక కమిషనర్ ఎంఏ.సలీంను అడుగగా వారాంతంలో సహజంగానే సంచారం ఎక్కువగా ఉంటుంది. 2023లో బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ తగ్గింది, 10 కిలోమీటర్ల దూరం వెళ్లడానికి 14 నిమిషాలు సమయం చాలు అని తెలిపారు. ఇక వీకెండ్స్‌లో ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

**అన్ని విధాలా అనర్థమే**

ట్రాఫిక్ జామ్‌ల వల్ల ప్రజల సమయం గాలిలో కలిసిపోవడమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థపైనా భారం పడుతోంది. విలువైన పెట్రోల్, డీజిల్ తదితర ఇంధనాలు కూడా వృథా అవుతాయి. వాతావరణంలో కార్బన్‌డై ఆక్సైడ్ ఇతర విషపూరిత రసాయనాలు కూడా అధికంగా చేరతాయన్నది తెలిసిందే. గంటలకొద్దీ సిగ్నల్స్ వద్ద వేచిచూడటంతో మనుషుల్లో అసహనం, కోపం పెరుగుతాయి. హారన్లు కొడితే శబ్ద కాలుష్యం పెరిగి పశుపక్ష్యాదులకు చేటు. ఇలా ఏ విధంగా చూసినా ట్రాఫిక్ రద్దీ వల్ల అనేక అనర్థాలు పొంచి ఉన్నాయి.

## క్లుప్తంగా

### కోలుకుంటున్న గజరాజు

మైసూరు: రైతు పంట చుట్టూ వేసిన కరెంటు తీగ తగిలి గాయపడిన ఏనుగు క్రమంగా కోలుకుంటోంది. ఫిబ్రవరి 14వ తేదీన బండిపుర పులుల అభయారణ్యంలో బరగి గ్రామంలో పంట రక్షణ కోసం రైతు పొలానికి కరెంటు తీగను అమర్చాడు. ఆహారం కోసం వచ్చిన ఏనుగు ఆ తీగలను తాకడంతో షాక్ కొట్టి తీవ్ర అస్వస్థతకు గురైంది. అటవీశాఖ వైద్యులు వచ్చి గజరాజుకు చికిత్స చేశారు. ఏనుగు కోలుకుంటూ ఉండడంతో ప్రధాని నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ట్విట్టర్ ఖాతాలో ఏనుగు కోలుకుంటున్న ఫోటోను ఆయన పోస్ట్ చేశారు.

### అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి ప్రారంభించారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా తక్షణం మెరుగైన వైద్యం కోసం గంగావతితోపాటు కొప్పళ జిల్లా ఆసుపత్రికి తరలించడానికి వీలుగా ఈ ప్రాంత ప్రజల అనుకూలం కోసం అంబులెన్స్‌ను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈసందర్భంగా అడ్వకేట్ హనుమేశ్ యాదవ్, శక్తికేంద్ర అధ్యక్షులు చంద్రశేఖర్, పీహెచ్‌సీ అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మారెమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం



విరాళాన్ని అందిస్తున్న సురేష్‌బాబు

కంప్లి: ఆలయాలను, గ్రామ దేవతలను కాపాడుకోవడం ప్రతి గ్రామస్తుల బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఎమ్మిగనూరులోని ఎస్సీ కాలనీలో గ్రామస్తుల ఆకాంక్ష మేరకు నిర్మాణ దశలో ఉన్న మారెమ్మదేవి ఆలయ జీర్ణోద్ధరణకు వ్యక్తిగతంగా రూ.లక్షా 11 వేల విరాళం అందించారు. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేసి పూజించే భాగ్యం కల్పించాలని అమ్మవారిని వేడుకున్నారు. అదే విధంగా దీన దళితుల కళ్యాణార్థం ఊరంతా ఒక్కటై ముందడుగు వేయాలన్నారు.

### దూడలను కాపాడారు



కబేళానికి తరలిస్తున్న గేదె దూడలను పట్టుకున్న పోలీసులు

పావగడ: అక్రమంగా వధశాలకు తరలిస్తున్న 8 గేదె దూడల వ్యాను ను స్థానిక భజరంగదళ్ కార్యకర్తలు అడ్డుకుని కాపాడారు. వివరాలు.. కొందరు వ్యక్తులు మడకశిర తాలూకా గుడిబండ పశువుల సంతలో 8 గేదె దూడలను కొనుగోలు చేసి వాటిని ఓ వ్యాను లో వేసుకుని పెనుగొండ కబేళానికి తరలిస్తున్నారు. విషయం తెలిసి మార్గ మధ్యలో పావగడ తాలూకా దొమ్మతమరి గ్రామం వద్ద భజరంగ దళ్ నాయకులు సుమన్, వాసు, రాకేశ్ తదితరులు పట్టుకున్నారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి స్వాధీనం చేసుకున్నారు. వ్యాను డ్రైవర్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

### ఇళ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు



తమ గోడును వెళ్లబోస్తున్న గ్రామస్తులు

బళ్లారిటౌన్: గత 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమను ఇళ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తూ తమపై రౌడీలను ప్రయోగిస్తున్నారని చెరకుంట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జిల్లాధికారి కార్యాలయానికి తరలి వచ్చి తమ ఆవేదనను పత్రికా భవనం వద్ద విలేకరుల ఎదుట వ్యక్తం చేశారు. తాము నివాసం ఉంటున్న ప్రభుత్వ స్థలంలోని ఇళ్లకు పంచాయితీలో ఇంటి గుత్త చెల్లిస్తున్నామన్నారు. తమకు న్యాయం చేకూర్చాలని అక్కడికి వచ్చిన మంత్రి శ్రీరాములుకు వారు విన్నవించారు.

### అధికారులదే పెత్తనం

రాయచూరు రూరల్: జీపీ సభ్యులు, ప్రజాప్రతినిధులకున్న అధికారాలను అధికారులు అనుభవిస్తూ పెత్తనం చెలాయిస్తున్నారని గ్రామ పంచాయతీ సభ్యుల సమాఖ్య నాయకుడు తాయణ్ణ ఆరోపించారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జీపీ అధ్యక్షులు, సభ్యులకు స్వతంత్రంగా విధుల నిర్వహణకు ప్రభుత్వ ఆదేశాలను అధికారులు సాకుగా చూపుతూ అడ్డుకుంటున్నారన్నారు.

# హరహర మహాదేవ.. శంభో శివశంకరా



బళ్లారిలో కోట మల్లేశ్వర స్వామికి విశేష అలంకరణ



చిన్న మార్కెట్‌లో మల్లికార్జున స్వామి ఆభరణాలతో అలంకరణ



హంపీలో స్వామికి పూజ చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామీజీ



మాలూరులో శంకరనారాయణ స్వామికి ప్రత్యేక అలంకరణ



శ్రీనివాసపురంలో అలంకరణలో ప్రసన్న సోమేశ్వరస్వామివారు



కోలారులో సోమేశ్వరస్వామి వారికి విశేష అలంకరణ

- భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు
- కిటకిటలాడిన శివాలయాలు



బళ్లారిలో స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు



కేజీఎఫ్‌లోని కోటిలింగాల పుణ్య క్షేత్రంలో భక్తుల సందడి

బళ్లారి అర్బన్: నగరంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం శివాలయాల్లో హరహర మహాదేవ..శంభోశివశంకరా అంటూ భక్తులు పోటెత్తారు. వివిధ ఆలయాల్లో ఏర్పాటు చేసిన శివలింగాలకు అలంకరణ గావించి శివరాత్రి పూజలను జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచి పంచామృతాభిషేకం, బిల్వార్చన, విశేష అలంకరణ, మహామంగళారతి, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. స్థానిక భక్తులంతా తమ ఇళ్లల్లో పూజలు జరుపుకొని ఉపవాస దీక్షలు చేపట్టి సమీపంలోని శివాలయాలను దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. నగరంలో పలు ఆలయాల వద్ద అఖండ భజనలు నిర్వహించారు.

**హంపీకి పోటెత్తిన భక్తులు..**

హొసపేటె: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతున్న హంపీలోని శ్రీవిరుపాక్షేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులు ఉదయం నుంచే ఆలయం సమీపంలోని తుంగభద్ర నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేసిన అనంతరం ఆలయానికి చేరుకొని క్యూలో నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. హంపీ విద్యారణ్య భారతీ స్వామీజీ చేతుల మీదుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

**సర్వం శివమయం..**

రాయచూరు రూరల్: జిల్లాలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మారుమోగాయి. పట్టణంలోని మహాబలేశ్వర చౌక్‌లో చంద్రమౌళేశ్వర ఆలయం వద్ద రాత్రి 12 గంటల నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. వివిధ శివాలయాల్లో శివస్తోత్రం, కుంభాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవాలయాలన్నీ అలంకరించారు. యక్లాసపుర బసవేశ్వర ఆలయంలో గోపురానికి కలశ ప్రతిష్ఠాపన చేశారు.

**శివాలయాలకు గంగాజలం పంపిణీ**

గంగావతి: మహాశివరాత్రి పర్వదినాన తాలూకాలోని శివాలయాలకు గ్రేడ్-2 తహసీల్దార్ పవిత్ర గంగాజలాన్ని పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ తరపున సరఫరా చేసిన గంగానది జలాన్ని జలాభిషేకానికి తాలూకాలోని ప్రతి దేవస్థానానికి అందజేశారు.

**అంతటా శివనామ స్మరణ**

హుబ్లీ: జంట నగరాల్లోని పలు ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదిన శుభవేళ శివనామ స్మరణ మారుమోగింది. ధార్వాడలోని శ్రీసోమేశ్వరుని దర్శనాన్ని వేలాది మంది భక్తులు చేసుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు బారులుతీరి ముక్కంటిని దర్శించుకున్నారు.

**శివాలయాల్లో భక్తుల సందడి..**

కోలారు : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని చరిత్ర ప్రసిద్ధ సోమేశ్వర ఆలయంలో ఉదయం 6 గంటలకే స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలో నిలబడ్డారు.నగర సమీపంలోని అంతరగంగ కాశీ విశ్వనాథస్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి తరలి వెళ్లారు. వక్కలేరి సమీపంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సోమేశ్వరస్వామి ఆలయంలోని నంది విగ్రహం వద్ద మహిళా భక్తులు నిమ్మకాయ ప్రమిదల్లో దీపాలను వెలిగించారు.

**కోటిలింగాల క్షేత్రం భక్తులతో కిటకిట..**

కేజీఎఫ్ : మహాశివరాత్రి పర్వదినాన తాలూకాలోని కోటిలింగేశ్వర ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. క్షేత్రంలోని 108 అడుగుల శివలింగాన్ని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం 6 గంటలకే భక్తులు ఆలయంలో దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. శివరాత్రి సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంజునాథ రథోత్సవం, బృహత్ శివలింగానికి ప్రత్యేక పూలతో అలంకరించి పాలతో అభిషేకం, హోమం, హవనం జరిపారు. ఎమ్మెల్యే రూపా శశిధర్ కోటిలింగ క్షేత్రానికి చేరుకుని దర్శనం చేసుకున్నారు.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు..**

మాలూరు: పట్టణంలోని దొడ్డపేటలో ఉన్న శ్రీశంకర నారాయణస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని శనివారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

**వైభవంగా శివరాత్రి ఆచరణ..**

శ్రీనివాసపురం: శివరాత్రి పండుగను శనివారం ముళబాగిలు నగరంతో పాటు తాలూకాలోని వివిధ శైవాలయాల్లో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నగరంలోని ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అదేవిధంగా గణేశ పాళ్యలోని శివాలయం, శివకేశవ నగర్‌లోని ఉద్భవశివలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి శివుడి దర్శనం చేసుకున్నారు. రాత్రి సమయంలో పలు దేవాలయాల్లో జాగరణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



రాయచూరులో దర్శనం కోసం భక్తుల క్యూ



హంపీలో పుణ్యస్నానాలాచరిస్తున్న ప్రజలు



కేజీఎఫ్: స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే, భక్తులు



కోలారులో సోమేశ్వరాలయం ముందు భక్తుల క్యూ

## మోదీ కేబినెట్‌లో ఉండడం గర్వకారణం

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్లీ: ప్రధాని మోదీ కేబినెట్‌లో సభ్యునిగా పని చేయడం గర్వకారణమని, తాను రాష్ట్ర రాజకీయాల్లోకి రానని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ వద్ద పని చేయడం తన సౌభాగ్యమన్నారు. ప్రధానిని యావత్ ప్రపంచమే ఆశ్చర్యంగా చూస్తోందన్నారు. తాను రాష్ట్ర రాజకీయాల్లోకి రానని, ముఖ్యమంత్రి అయ్యే ప్రశ్నే తలెత్తదని ఆయన అన్నారు. పేష్వా బ్రాహ్మణులను సీఎం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న మాజీ సీఎం కుమారస్వామి వ్యాఖ్యలపై జోషి ఇలా స్పందించారు. అలాంటి తెలివితక్కువ మాటలకు తాను సమాధానం ఇవ్వబోనన్నారు.

## జిల్లాకు మొండి చెయ్యి

రాయచూరు రూరల్: ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు మొండి చెయ్యి చూపించారని కాంగ్రెస్ పార్టీ సంచాలకుడు రజాక్ ఉస్తాద్ ఆరోపించారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మరోసారి అధికారం కోసం ప్రవేశ పెట్టారన్నారు. రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మరచి హైటెక్ ఆస్పత్రిని ప్రకటించి మాట తప్పారన్నారు.

## గాలి జనార్దన్‌రెడ్డి ముమ్మర ప్రచారం



పూలమాలలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

గంగావతి: హిరేబెణకల్‌లో కేఆర్‌పీపీ సంస్థాపక అధ్యక్షులు గాలి జనార్దన్‌రెడ్డి ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. గ్రామానికి వెళ్లగానే ప్రజలు ఘనంగా స్వాగతించారు. మొదట ఆయన ఆంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లి దర్శనం చేసుకొన్న అనంతరం గ్రామంలో బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడారు.

## పరీక్షలకు సిద్ధంగా ఉండాలి

కంప్లి: పరీక్షల భయాన్ని ఎదుర్కొనేందుకు విద్యార్థులు సన్నద్ధంగా ఉండాలని నివేదిత ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డీవీ.సత్యనారాయణ తెలిపారు. శనివారం ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలపై విద్యార్థులకు జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. సంస్థ పదాధికారులు యూ.శివరాజ్, వై.వెంకటేష్ పాల్గొన్నారు.

## నగరాభివృద్ధికి కృషి

రాయచూరు రూరల్ : నగరాభివృద్ధికి ప్రామాణికంగా పని చేస్తామని నగరసభ అధ్యక్షురాలు లలిత, ఆర్డీఏ అధ్యక్షుడు తిమ్మప్ప నాడగౌడ పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో నగరసభను కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ నిధులు కేటాయించడంతో వారు శుక్రవారం రాత్రి జాకీర్ హుసేన్ సర్కిల్‌లో కిల్లే మఠాధిపతి శాంతమల్ల శివాచార్యుల ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. నగర బీజేపీ అధ్యక్షుడు గోవిందు, ఆర్డీఏ మాజీ అధ్యక్షుడు గోపాలరెడ్డి, రవీంద్రలున్నారు.

# పేదలు, సామాన్యులకు అనుకూల బడ్జెట్

బళ్లారిటౌన్ : ఈసారీ తమ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, సామాన్య వర్గాల అనుకూల బడ్జెట్ అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు సిద్దరామయ్య, డీకేశిలు చెవిలో పూలు పెట్టుకుని సమావేశానికి హాజరైనా ప్రజలే వారి చెవిలో పూలు పెట్టారని ఎద్దేవా చేశారు. ఈసారీ వ్యవసాయానికి రూ.39 వేల కోట్లు, మహిళల అభ్యున్నతికి రూ.46,278 కోట్లు, ఎస్‌సీపీ టీఎస్‌పీ పథకాలకు రూ.30 వేల కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.1842 కోట్లు ప్రవేశ పెట్టారని వివరించారు. కాంగ్రెస్ వారికి ఇది మింగుడు పడకే విమర్శిస్తున్నారన్నారు. బళ్లారి జిల్లాలో రూ.100 కోట్లతో మెగా డైరీ, కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలికి, మత్స్య సంపద అభివృద్ధికి రూ.5 వేల కోట్లు, రూ.2200 కోట్లతో హుబ్లి-బళ్లారి సరిహద్దు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. బీదర్ నుంచి బళ్లారికి 4 లేన్ల రోడ్డు కోసం రూ.7650 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తాను బళ్లారి జిల్లాలో సండూరు లేదా బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు. జనార్దన రెడ్డి పార్టీ వల్ల బీజేపీపై ఎలాంటి ప్రభావం పడ బోదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే జీ.సోమశేఖరరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మురహరిగౌడ, కార్పొరేటర్లు శ్రీనివాస మోత్కర్, హనుమంతప్ప, మల్లనగౌడ, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరాములు, సోమశేఖరరెడ్డి తదితరులు

## గొడవలో ఒకరికి కత్తిపోట్లు

శివాజీనగర: ఓ యువకున్ని కత్తితో పొడిచి గాయపరచిన సంఘటన శనివారం మధ్యాహ్నం దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకాలోని పాణె మంగళూరులో చోటుచేసుకుంది. నెహ్రూ నగరకు చెందిన సులేమాన్ అనే వ్యక్తికి, అతని స్నేహితుడు నిషార్ మధ్య గొడవ జరిగింది. నిసార్ కత్తి తీసుకుని సులేమాన్ కడుపులోకి పొడిచాడు. గాయపడిన బాధితున్ని స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. బంట్వాళ నగర పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి నిందితుని కోసం గాలింపు చేపట్టారు.

## క్యాన్సర్‌పై సైకిల్ జాగృతి జాతా



సైకిల్ జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం

కంప్లి: క్యాన్సర్ ముక్త సమాజ నిర్మాణానికి అందరూ శ్రమించాలని మెట్రి గ్రామ సముదాయ ఆరోగ్య కేంద్రం అధికారి ఏ.ఈరణ్ణ తెలిపారు. ఆయన శనివారం మెట్రి గ్రామంలో విశ్వ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సైకిల్ జాతాను ప్రారంభించి మాట్లాడారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉంటేనే క్యాన్సర్ నిర్మూలన సాధ్యం అన్నారు. క్యాన్సర్ వ్యాధి గురించి భయపడకుండా సకాలంలో సురక్షిత చికిత్స పొందాలన్నారు. సైకిల్ జాతాలో పంచాయతీ సభ్యులు హెచ్.కుమారస్వామి, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు హెచ్.జగదీశ్, హెచ్ఎం.గుండప్ప, శ్రీధర్, గురుమూర్తి జగన్నాథ్, ఆశా కార్యకర్త సుజాత, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధ్యులపై చర్యలు చేపట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల కార్యకర్తలు

గంగావతి రూరల్: జైన్ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడి నేతృత్వంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన నాటకంలో అంబేడ్కర్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బాధ్యులపై చర్యలు చేపట్టాలని శనివారం దళిత సంఘాల నాయకులు నగరంలో ర్యాలీ చేపట్టారు. కర్ణాటక డీఎస్ఎస్ భీమావాద జిల్లా అధ్యక్షులు మరిస్వామి మాట్లాడుతూ అస్పృశ్యత, అవహేళనను ప్రదర్శించిన ఈ నాటక కమిటీ, వర్సిటీ యాజమాన్యంపై అట్రాసిటీ చట్టం కింద వెంటనే ఎఫ్ఐఆర్, దేశద్రోహ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నాటక ప్రదర్శనలు ఖండనీయం అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు మనవి పత్రాన్ని అందించారు. డీఎస్ఎస్ సభ్యులు సుంకప్ప, మంజునాథ్, మారుతి, చెన్నప్ప, మౌలాసాబ్, దుర్గేశ్, సురేశ్, మంజునాథ, సురేశ్, యమనూర్ భట్, ఓంకారప్ప, తిప్పణ్ణ, గణేశ్, నాగరాజ్, శరణప్ప పాల్గొన్నారు.

## కంబోడియాలో చిక్కుకున్న తీర్థహళ్లివాసి

బనశంకరి: శివమొగ్గ జిల్లా తీర్థహళ్లికి చెందిన ఇంజనీర్ కిరణ్‌శెట్టి కంబోడియాలో అక్రమ నియామక ముఠాలో చిక్కుకున్నాడు. థాయ్‌లాండ్‌లో అధిక వేతనం ఇప్పిస్తామని ఒక నియామక ఏజెన్సీ ప్రలోభానికి గురిచేసింది. దీంతో కిరణ్‌శెట్టి కంబోడియాకు వెళ్లాడు. అక్కడ అతన్ని కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. ఆయనను తక్షణమే విడిపించాలని హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర కేంద్ర ప్రభుత్వ అధికారులను కోరారు.

# కోలారు వార్తలు...

## వీలింగ్ బైక్ స్వాధీనం



బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

శ్రీనివాసపురం: పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో బైక్‌పై వీలింగ్ చేస్తున్న జాకీర్ ఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసిన పట్టణ పోలీసులు అనంతరం అతనిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. బైక్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచారు. బైక్ వీలింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జేసీ నారాయణ తెలిపారు.

## వైభవంగా పట్టాభిషేకం



గురువులను సన్మానించిన దృశ్యం

రాయచూరు రూరల్ : నగరంలో మైనార్టీల గురువుల పట్టాభిషేకం శుక్రవారం రాత్రి నెరవేరింది. ఖాదర్ గుండాలో వెలసిన సయ్యద్ అబ్దుల్ నబీ మహ్మద్ అల్ హుసేని చిస్తి అల్ సయ్యద్‌షా ఖాద్రి ఉరుసు ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన గురువులుగా పట్టాధికారం పొందిన సయ్యద్ ఖిజర్ పీర్, సయ్యద్ నాసిర్ పాషాలకు సయ్యద్‌షా వలి పీర్ సాహెబ్ హిత బోధ చేసి వారిరువురికి గురు పట్టాధికారం అప్పగించారు. కార్యక్రమంలో ఫయాజుద్దీన్ ఖాద్రి, ఖతీబ్, అన్వర్ ఖతీబ్, నూరుల్లా ఖాద్రి, ముక్తియార్, శఫీ, నయీమ్ పాషా, తారానాథ్, శ్యాం పాల్గొన్నారు.

## శివశరణుల జయంతి

కంప్లి: కాయక, దాసోహ శరణులు ప్రపంచానికి శ్రేష్ఠ ఆశయాలను అందించారని తహసీల్దార్, శిరస్తిదార్ పేర్కొన్నారు. శివశరణులు మాదర చెన్నయ్య, మాదర ధూళయ్య, ఉరిలింగ పెద్ది, సమగార హరళయ్య, డోహర కక్కయ్య జయంతిలో వారు మాట్లాడారు. కాయకంతో దేశాభివృద్ధి సాధించగలమన్నారు. అన్ని కాయకాలు సమానమన్నారు. కాయకనిష్ఠను సామాన్య ప్రజల్లో శ్రేష్ఠం చేసేందుకు శరణులు అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ సందర్భంగా కంప్లి బసవేశ్వర ఆశ్రమ పీఠాధిపతి పామయ్య శరణులు, రామసాగర టైలర్ చెన్నబసప్ప, వీరేష్, ఫకీరప్ప, కాళి హనుమంతప్ప, శరణప్ప, ఆర్ఐ గణేష్, వీఏ మంజునాథ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వేడుకగా ద్వాదశ లింగాల దర్శనం



ద్వాదశ లింగాలను ఏర్పాటు చేసిన దృశ్యం

కోలారు : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో శనివారం మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని అంతరగంగ రహదారిలో ఉన్న బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయంలో యేటా మాదిరిగానే ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనాన్ని ఏర్పాటు చేసినట్లు రాజయోగి కె చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని డీఏఆర్ పోలీస్ సముదాయ భవనంలో సహస్ర లింగదర్శనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఆస్తి పన్ను కట్టలేదని మాల్‌లో చరాస్తుల సీజ్

బనశంకరి: కోట్లాది రూపాయల పన్నుల ఎగవేత కేసుల్లో బెంగళూరులోని ఒక మాల్ చరాస్తులను బీబీఎంపీ అధికారులు సీజ్‌చేశారు. గత ఐదేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో చర్యలు చేపట్టారు. బీబీఎంపీ పశ్చిమ వలయ జాయింట్ కమిషనర్ యోగేశ్ నేతృత్వంలో శనివారం మాల్‌లోకి వెళ్లి కంప్యూటర్లు, టేబుళ్లు, కుర్చీలు తదితర వస్తువులను సీజ్‌చేశారు. రూ.49 కోట్లు ఆస్తిపన్ను చెల్లించాలని నోటీసులు పంపినా స్పందన లేదని, అందుకే కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, ఇప్పటికైనా పన్నులు చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## రేణుకానందస్వామికి తులాభారం



తులాభారం నిర్వహిస్తున్న హెచ్ఆర్ శ్రీనాథ్

గంగావతి: తాలూకాలోని దాసనాళలో ఆర్యఈడిగ సమాజ కుల దైవం కాటమేశ్వర 14వ జాతర మహోత్సవం సందర్భంగా రేణుకానంద మహాస్వామి 18వ తులాభారాన్ని మాజీ ఎమ్మెల్సీ హెచ్ఆర్ శ్రీనాథ్ నేతృత్వంలో నెరవేర్చారు. ఉదయాన్నే కాటమేశ్వరుడికి విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం ఉచిత భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హుస్సేనప్ప దళపతి, వీరభద్రగౌడ, యమునప్ప గుండూరు, పరంజ్యోతి పాల్గొన్నారు.

## ప్రజా శాంతి కోసం ఎమ్మెల్యే పాదయాత్ర

బళ్లారిటౌన్: ప్రజలకు శాంతి కోసం గ్రామీణ ఎమ్మెల్యే బీ.నాగేంద్ర శనివారం బేవినహళ్లి నుంచి చేళ్లగుర్కి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోక కల్యాణం కోసం తాను పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. శివరాత్రి రోజున పాదయాత్ర చేపట్టడం వల్ల జిల్లా ప్రజలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నానన్నారు. ఒక సంకల్పంతో యాత్రను ప్రారంభించానన్నారు. వచ్చే ఎన్నికల్లో బళ్లారి, విజయనగర జిల్లాల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సండూరుకు అమిత్ షా వచ్చినంత మాత్రాన తమ పార్టీకి నష్టమేం లేదన్నారు. బీజేపీపై ప్రజలకు విరక్తి కల్గిందన్నారు. మాజీ సీఎం సిద్దరామయ్యపై మంత్రి అశ్వత్‌నారాయణ అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. పాదయాత్రలో క్రైస్తవ, ముస్లిం, పలువురు హిందూ మత గురువులు కూడా పాల్గొనడం విశేషం.

## ఎల్ఈడీ బల్బుల అమరికకు శ్రీకారం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగేంద్ర, మేయర్

బళ్లారి టౌన్: నగరంలో మహానగర పాలికె పరిధిలోని గ్రామీణ నియోజకవర్గంలోని వివిధ వార్డుల్లో రూ.30.24 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎల్ఈడీ బల్బుల అమరిక పనులకు శనివారం ఎమ్మెల్యే బీ.నాగేంద్ర, మేయర్ ఎం.రాజేశ్వరి శ్రీకారం చుట్టారు. కోట మల్లేశ్వర ఆలయం వద్ద చేపట్టిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ దాదాపు 30 వేల స్తంభాలకు వీటిని అమరుస్తారన్నారు. ఈసందర్భంగా పాలికె సభ్యులు కుబేర, నందీశ్, ప్రభంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

మైసూరు: చెరువులోకి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని హోసకొటె గ్రామంలో కెంచన హొకెరెలో జరిగింది. బన్నికుప్పె గ్రామానికి చెందిన సణ్ణ మాగయ్య కుమారుడు చేతన్ (30) చెరువులో దూకి ప్రాణాలు తీసుకున్నాడు. బయటకి వెళ్లిన చేతన్ మళ్లీ ఇంటికి తిరిగి రాకపోవడంతో పలుచోట్ల గాలించారు. చెరువులో పడినట్లు తెలిసి వెళ్లి చూడగా మరణించి ఉన్నాడు. బిళికెరె పోలీసులు కేసు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### బీజేపీ పోస్టర్ల ప్రచారం



కృష్ణరాజపురం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని, మంత్రి బైరతి బసవరాజు మరోసారి విజయం సాధించడం ఖాయమని స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. శనివారం కేఆర్ పురం రామమూర్తి నగరలోని బసవనపుర, హెచ్ఏఎల్, హొరమావు వార్డుల పరిధిలో మంత్రి బసవరాజ్ మరోసారి బీజేపీ అధికారంలోకి అనే వాల్‌పోస్టర్‌ను ప్రారంభించారు. కార్యకర్తలు పోస్టర్ల ప్రచారం ప్రారంభించారు.

### ఏసీపీ పుట్టిన రోజు వేడుక



కృష్ణరాజపురం: ఏసీపీ సజ్జాద్‌ఖాన్ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు శనివారం నగరంలోని కేఆర్ పురం నియోజక వర్గం పరిధి బట్టరహళ్లిలో ఉన్న బిలాల్ మసీదు వద్ద ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఆయనతో కేక్ కట్ చేయించారు.

# క్రికెట్ మైదానంలో నెత్తుటి చిచ్చు



హత్యకు గురైన యువకులు భరత్, ప్రతీక్ (ఫైల్)

- దొడ్డబెళవంగలలో ఇద్దరు యువకుల హత్య
- భారీగా ఉద్రిక్తత



నిర్మానుష్యంగా ఉన్న పట్టణంలో పోలీసు వాహనాలు



రాస్తారోకో చేస్తున్న దొడ్డబెళవంగల ప్రజలు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలోని దొడ్డబెళవంగల పట్టణంలో శుక్రవారం జరిగిన రెండు హత్యలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఇంజనీరింగ్ విద్యార్థి భరత్‌కుమార్ (23), పీయూసీ చదివే ప్రతీక్ (17) స్థానిక పబ్లిక్ స్కూల్ మైదానంలో క్రికెట్ మ్యాచ్ చూస్తుండగా గొడవ చెలరేగింది. మరో గుంపునకు చెందిన యువకులు వీరిద్దరినీ కత్తులతో పొడిచి చంపారు. కొందరు దుండగులు కారుతో మైదానంలోకి వచ్చారు. మ్యాచ్‌కు అడ్డమని మిగతావారు వారిని బయటకు పంపేశారు. భరత్, ప్రతీక్‌లే గొడవకు కారణమని కారు తీసుకొచ్చిన దుండగులు దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టణమంతా ఉద్రిక్తత నెలకొని అప్రకటిత బంద్ పాటించారు. హత్యకు ఫలానా పార్టీ కారణమని సోషల్ మీడియాలో ఆరోపణల యుద్ధం జరుగుతోంది. దొడ్డ తాలూకా చరిత్రలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదని, అధికార దాహంతో రాజకీయ పార్టీల నేతలు గ్రామీణ ప్రాంతాల్లో పగ ప్రతీకారాలు రేపుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మంత్రిని నిలదీసిన నిరసనకారులు**

హత్యలను ఖండిస్తూ దొడ్డబళ్లాపురం-తుమకూరు రోడ్డులో బైఠాయించి దొడ్డబెళవంగల పట్టణ ప్రజలు రాస్తారోకో చేపట్టారు. హంతకులను తక్షణం అరెస్టు చేయాలని పట్టుబట్టారు. ఇదే సమయంలో అటు వైపు వచ్చిన మంత్రి ఎంటీబీ నాగరాజును ధర్నాకారులు నిలదీసారు. మీ రాజకీయాలతో మా బిడ్డల ప్రాణాలను బలితీసుకుంటున్నారని, ఇంకా ఏం మిగిలి ఉందని చూడ్డానికి వచ్చారంటూ ప్రశ్నించారు. ఏం సమాధానం చెప్పలేని మంత్రి మౌనంగా ఉన్నారు. 24 గంటల్లోపు నిందితులను అరెస్టు చేయాలని మంత్రి ఎంటీబీ పోలీసులను ఆదేశించారు. మరోవైపు హత్యల కారణంగా దొడ్డబెళవంగల పట్టణంలో అప్రకటిత బంద్ నెలకొంది. ప్రజలు బయట తిరగడంలేదు. ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయం నెలకొంది.

## పాలియేటివ్ కేర్ సేవలకు నాంది

బనశంకరి: దేశంలో స్పెషలైజ్డ్ పాలియేటివ్ కేర్ కోసం పెరుగుతున్న ఆవశ్యకతను పరిష్కరించడానికి దక్షిణ భారత దేశంలో సీనియర్ కేర్ సెక్టార్‌లో ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు అతుల్య సీనియర్ కేర్ సంస్థాపక సీఈఓ జీ.శ్రీనివాసన్ తెలిపారు. నగరంలో విలేకరుల సమావేశంలో శ్రీనివాసన్ మాట్లాడుతూ.. దేశంలో వృద్ధ జనాభా పెరుగుతోందని, అలాగే వారిలో ఆరోగ్య సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ సమయంలో వారి బాగోగులు చూసుకోవడానికి వైద్య నిపుణులు, సేవలకు అవసరం ఉందని, తద్వారా కుటుంబసభ్యులు జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావచ్చని చెప్పారు.

## త్రినేశ్వరుడికి అభిషేకం



మైసూరు గురుకులలో 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు

మైసూరు: శివరాత్రి సందర్భంగా మైసూరు నగరంలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగింది. నగరంలోని అంబా విలాస్ ప్యాలెస్‌లోని త్రినేశ్వర స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మైసూరు యువరాజు యదువీర్ దంపతులు త్రినేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా 11 కిలోల బంగారు శివుడి ముఖానికి ప్రత్యేక పూజలు చేశారు.



బంగారు శివుడు

**శ్రీక్షేత్రంలో అఖండ భజన**

మండ్య: మహా శివరాత్రి సందర్భంగా మండ్య జిల్లా నాగమంగలో ఉన్న శ్రీక్షేత్రం శ్రీ ఆదిచుంచనగిరి శాఖ మఠం ఆవరణంలో అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మఠాధిపతి డాక్టర్.శ్రీ నిర్మలానందనాథ స్వామిజీ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## కామనదుర్గంలో శివరాత్రి వేడుకలు



రామలింగేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శివరాత్రి వేడుకల్లో పాల్గొనడానికి కొండెక్కుతున్న భక్తులు

పావగడ: స్థానిక చారిత్రాత్మక, ఆధ్యాత్మిక కేంద్ర మైన కామిలి కొండగా పిలిచే కామన దుర్గంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో విశేష పూజలు జరిగాయి. త్రేతాయుగంలో వెలసిన ఆలయం కావడంతో రెండు రాష్ట్రాలలోనూ ప్రసిద్ధిగాంచింది. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చాడు. సాయంత్రం గణపతి ప్రార్థన, గంగ పూజ తదితరాలను సంప్రదాయ రీతిలో నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

### ఆకట్టుకున్న జ్యోతిర్లింగాలు

బొమ్మనహళ్లి: మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని మహాదేవపుర మారతహళ్లిలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రజాపితా బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 12 జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్థానిక నాయకుడు బీజేపీ ప్రమోద్ రెడ్డి, అంతర్జాతీయ హిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో ఖైదీ మృతి

బనశంకరి: పరప్పన అగ్రహార జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ గుండెపోటుతో మృతి చెందాడు. ఖైదీ సోమశేఖర్ బెంగళూరు గ్రామాంతర జిల్లా అనేకల్ తాలూకా నివాసి. ఆరేళ్ల క్రితం ఓ కేసులో శిక్ష అనుభవిస్తున్నాడు. శనివారం జైలులో సోమశేఖర్‌కు గుండెపోటు రావడంతో హుటాహుటిన విక్టోరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

### సామూహిక శివ నమస్కారాలు



చింతామణి: శ్రీ పతంజలి యోగా శిక్షణ సమితి ఆధ్వర్యంలో మహా శివరాత్రి పురస్కరించుకొని సామూహిక శివ నమస్కారాలు నిర్వహించారు. పట్టణంలోని ఆజాద్‌చౌక్‌లోని హరిహరేశ్వర ఆలయంలో యోగా గురువులు స్థానికులతో శివ నమస్కారాలు చేయించారు.

### అభిమానికి పరామర్శ

యశవంతపుర: గాయపడిన అభిమానిని చూడటానికి నటుడు ధ్రువసర్జా ఆస్పత్రికి వచ్చారు. బెంగళూరుకు చెందిన అభిమాని పృథ్వీరాజ్ మూడు రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడ్డారు. ఎంఎస్‌రామయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బ్రెయిన్‌డెడ్ అయిందని వైద్యులు తల్లిదండ్రులకు చెప్పారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న ధ్రువసర్జా నేరుగా ఆస్పత్రికి వచ్చారు. బాధితుడి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ధ్రువసర్జా విజ్ఞప్తి చేశారు.

### బనశంకరీదేవికి ప్రత్యేక పూజలు



బనశంకరి: శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బనశంకరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యానారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకం నిర్వహించి వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. భక్తులు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

# మహేశా పాపవినాశా.. కైలాసవాసా



గౌరిబిదనూరులో భవానీ శంకరుడు



బసవేశ్వరుడి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆనేకల్ పట్టణంలో స్వామివారి ఊరేగింపు

మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏ నోట విన్న శివ నామస్మరణే వినిపించింది.

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- మారుమోగిన శివనామ స్మరణ



మరకత శివలింగం వద్ద రాంబాబు దంపతులు, ట్రస్టీ సభ్యులు

గౌరిబిదనూరు: మహా శివరాత్రి పురస్కరించుకుని నగరంలోని బీహెచ్ రోడ్డు శనేశ్వర స్వామి ఆలయంలో వెలిసిన భవానీ శంకరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. శుక్రవారం నుంచి వివిధ ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు శ్రీనివాస స్వామి, డీఎస్ వెంకటరమణస్వామి, శ్రీహర్ష స్వాముల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. ధర్మకర్తలు సూర్యనారాయణగుప్త, ఎస్ఏ నవీన్, ఎస్ఏ గోకుల్ తదితరులు పర్యవేక్షించారు. అదే విధంగా ఈశ్వర దేవాలయంలో సైతం శివరాత్రి పూజలు జరిగాయి.

**శివాలయాలు కిటకిట**

బొమ్మనహళ్లి: శివరాత్రి సందర్భంగా నగరంలోని బొమ్మనహళ్లిలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హెచ్ఎస్ఆర్ లేఔట్ శ్రీబసవేశ్వర స్వామి, గాయత్రి అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ సతీష్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

**శనేశ్వర స్వామి ఊరేగింపు**

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ పట్టణంలో వెలిసిన ప్రసిద్ధి శ్రీ శనేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఉత్సవ మూర్తిని పట్టణంలో ఊరేగించారు. శనేశ్వరస్వామితో పాటు చంద్రమౌళీశ్వర, రాఘవేంద్ర స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు.

**దత్తపీఠంలో శివరాత్రి పూజలు**

మైసూరు: మైసూరు నగరంలో ఊటి రోడ్డులో ఉన్న అవధూత దత్తపీఠం గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఆశీర్వదించిన గణపతి సచ్చిదానంద స్వామీజీ శివలింగానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. శివరాత్రి రోజు ఉపవాసం చేసి పరమశివుడిని పూజిస్తే ఎంతో పుణ్య ఫలమన్నారు.

**విజయపురలో ఓంకార నాదం**

విజయపుర (బెంగళూరు గ్రామీణ): శివరాత్రి పర్వదినం సందర్భంగా విజయపుర పట్టణంతో పాటు తాలుకా చుట్టు పక్కల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అదే విధంగా పలు ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

**సిద్ధలింగేశ్వరుడికి విశేష పూజలు**

తుమకూరు: తుమకూరు నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని సిద్ధగంగ మఠంలో ఉన్న శ్రీ సిద్ధలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బీహెచ్ రోడ్డులోని సోమేశ్వర స్వామికి కుంభాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వపత్రాల అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా సోమేశ్వర స్వామి దేవాలయం, హొరపేటలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయం, కుణిగల్ రోడ్డులో మారుతి బనశంకరి, బసవణ్ణ దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి.

**నాగనాథేశ్వరునికి ప్రత్యేక అలంకరణ**

చింతామణి: శివరాత్రి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పురాతన శ్రీ నాగనాథేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**కాశీ విశ్వనాథుడికి పూజలు**

తుమకూరు: తుమకూరు నగరంలో శివరాత్రి సందర్భంగా హోసపేటలో వెలిసిన శ్రీ కరి బసవేశ్వర స్వామి మఠంలోని విశ్వనాథుడికి విశేష పూజలు, కుంభాభిషేకం చేశారు. స్వామివారికి రుద్రాక్షలు అలంకరించారు.



చింతామణిలో నాగనాథేశ్వరుడికి పూజలు

**శివబాలయోగి ఆశ్రమంలో...**

బనశంకరి: జేపీ.నగర మూడో ఫేజ్‌లోని శ్రీశివబాలయోగి ఆశ్రమంలో వెలిసిన మరకత శివలింగం దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం అర్చకులు మరకత శివలింగానికి అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం శివరుద్ర బాలయోగి మహారాజ్ మరకత శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివలింగాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్టీ చైర్మెన్ డీ.రాంబాబు, ట్రస్టీ సభ్యులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**మండ్యలో...**

మండ్య: మండ్య నగరంతో పాటు జిల్లాలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



తుమకూరులో శివలింగానికి అభిషేకం



శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న స్వామీజీ



తుమకూరులో శివలింగాల ఊరేగింపు



విజయపురలో ఆదిదేవుడికి ప్రత్యేక అలంకరణ

## హోసూరు వార్తలు..

### ప్లస్ టూ అమ్మాయి అపహరణ

హోసూరు: 17 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేశాడని బాధితురాలి బంధువులు హోసూరు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు నామక్కల్ జిల్లాకు చెందిన 17 ఏళ్ల అమ్మాయి అదే ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతోంది. ఫేస్‌బుక్ ద్వారా ఓ వ్యక్తితో ఆమెకు పరిచయమై ప్రేమగా మారింది. విషయం తెలుసుకొన్న బాలిక తల్లిదండ్రులు మందలించారు. రెండు రోజుల క్రితం బాలికను అమ్మమ్మతో హోసూరులోని బంధువుల ఇంటికి పంపారు. హోసూరు బస్టాండుకు చేరుకొన్న బాలిక బస్సు దిగగానే అదృశ్యమైంది. చుట్టుపక్కల గాలించినా జాడ తెలియకపోవడంతో వృద్ధురాలు బంధువులకు సమాచారం అందజేసింది. ఈ ఘటనపై బాలిక బంధువులు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**నకిలీ వైద్యుడు అరెస్ట్**

ఎలాంటి డిగ్రీ లేకున్నా ప్రజలకు అలోపతి వైద్యం అందజేస్తున్న నకిలీ డాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిష్ణగిరి సమీపంలోని గిడ్డంబట్టి గ్రామానికి చెందిన గోవిందరాజ్ కొడుకు తిరుమూర్తి (31)చ బిఇఎంఎస్ చదువుకొన్నాడు. గత ఏడాదిగా హోసూరు పారిశ్రామిక వాడ బేగేపల్లి సమీపంలోని గోవిందఅగ్రహారం ప్రాంతంలో క్లినిక్ నిర్వహిస్తూ స్థానిక ప్రజలకు ఆంగ్లవైద్యం అందజేస్తున్నట్లు వైద్య శాఖాధికార్లకు సమాచారం అందింది. ఆ మేరకు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారిణి జ్ఞానమీనాక్షి నేతృత్వంలో వైద్యాధికార్లు, సిఫ్‌కాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించారు. తిరుమూర్తి నకిలీ డాక్టర్ అని తెలిసింది. అతన్ని అరెస్ట్ చేసి క్లినిక్‌కు సీల్ వేశారు.

### దొరికిన దోపిడీ దొంగ

క్రిష్ణగిరి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దోపిడీకి యత్నించిన వ్యక్తిని బేరికె పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు బేరికె సమీపంలోని సీకనపల్లి గ్రామానికి చెందిన నీలమ్మ (48). శుక్రవారం వంటగ్యాస్ తీసుకొచ్చేందుకు ఇంటికి తాళాలు వేసుకొని బయటకెళ్లింది. ఈ సమయంలో అదే ప్రాంతానికి చెందిన నిఖిల్ (20) నీలమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు దూరాడు. ఇంటివద్దకు చేరుకొన్న నీలమ్మ స్థానికుల సహాయంతో నిందితున్ని పట్టుకొని బేరికె పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

### అనైతిక బంధం చాలన్నందుకు దాడి

కెలమంగలం: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న విషయం భర్తకు తెలిసిపోయిందని, ఇకపై తనతో సంప్రదించరాదని సూచించిన మహిళపై ప్రియుడు వేటకొడవలితో దాడి చేశాడు. ఈ ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా బెట్టముగిళాలం సమీపంలోని కోటయ్యూరుకొల్లై గ్రామానికి చెందిన మహిళ (40)కు అదే ప్రాంతానికి చెందిన రుద్ర (38)తో వివాహేతర సంబంధం ఉండేది. విషయం తెలుసుకొన్న ఆమె భర్త మందలించాడు. ఇకపై వివాహేతర సంబంధాన్ని ఆపుకోవాలని సదరు మహిళ రుద్రకు హితబోధ చేయగా ఆవేశం చెందిన వేటకొడవలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలేర్పడిన ఆమెను స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని పరారీలో ఉన్న రుద్ర కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# త్రినేత్రాయ నమోస్తుతే



మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం



శివనంజుండేశ్వరస్వామి కొండపైకి ఎక్కుతున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

హోసూరు, కెలమంగలం: మహాశివరాత్రి సందర్భంగా శనివారం శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజాము నుంచి ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు. హోసూరు తాలూకా ఎస్. ముదుగానపల్లి గ్రామంలో అమృతవల్లి సమేత మల్లికార్జున స్వామి ఆలయ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులను తేరుపై ఉంచి ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ధర్మకర్త జగదీశ్ రెడ్డి, కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కుటుంబీకులు పాల్గొన్నారు.

**బేవనత్తం కొండపై**

డెంకణీకోట తాలూకా బేవనత్తం వద్ద దట్టమైన అడవిలో బేవనత్తం వద్ద కొండపై కొలువైన శివానంజుండేశ్వరస్వామి ఆలయం శనివారం శివనామస్మరణతో మారుమోగింది. శనివారం జరిగిన ఈ జాతరకు డెంకణీకోట, తళి, అంచెట్టి, హోసూరు, బాగలూరు, సూళగిరి తదితర ప్రాంతాల నుంచే కాక ఆనేకల్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు జాతరలో పాల్గొని శివనామస్మరణ చేస్తూ కొండెక్కి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయం వద్ద పల్లక్కి ఉత్సవాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

**మదగొండపల్లిలో**

మదగొండపల్లిలో వెలసిన శ్రీ హరికేశవస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. హోసూరు తేరుపేటలోని చంద్రచూడేశ్వరస్వామి కొండపై శివరాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. హోసూరు, డెంకణీకోట, తళి, అంచెట్టి, బాగలూరు, బేరికె, సూళగిరి తదితర ప్రాంతాలలోని శివాలయాలలో శివరాత్రి ఉత్సవాలు జరిగాయి.

**కనుల పండువగా రథోత్సవం**

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హోసకోటి పరిధి అనుగొండనహళ్లి గ్రామంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ పార్వతంబ అమ్మవారి సమేతంగా వెలిసిన భానేశ్వర స్వామి వారి బ్రహ్మ రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

# రికార్డుల కోసం సాహసాలు





విద్యార్థుల సాహస కార్యక్రమాలు, సాధించిన రికార్డ్స్ సర్టిఫికెట్లు

హోసూరు: హోసూరు పారిశ్రామికవాడలోని మహర్షి విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు ప్రపంచ రికార్డుల కోసం సాహస కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో పాఠశాల 40వ వార్షికోత్సవ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 3800 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ సాహస కార్యక్రమంలో పాల్గొన్నారు. 658 విద్యార్థులచే తమిళ్ గుమ్మి నాటక ప్రదర్శన, 805 మంది విద్యార్థులచే తమిళ సాంప్రదాయ నాట్య ప్రదర్శన, 48 మంది విద్యార్థులచే కర్ణాటక సాంప్రదాయ నాటక ప్రదర్శన, 1039 మంది విద్యార్థులచే గుజరాత్ దాండియా, 443 మంది విద్యార్థులచే నాటక ప్రదర్శన కార్యక్రమాలను చేపట్టి ప్రపంచ సాధన రికార్డుల సర్టిఫికెట్లను అందుకున్నారు. కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యంత్రాంగం తెలిపింది. కార్యక్రమంలో ఎలైట్ వరల్డ్ రికార్డ్స్, ఏషియన్ వరల్డ్ రికార్డ్ అకాడమి, ఇండియా రికార్డ్ అకాడమి, తమిళ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలకు చెందిన అధికారులు న్యాయనిర్ణేతలుగా పాల్గొని పాఠశాలకు ప్రపంచ సాహస సాధన రికార్డ్స్ సర్టిఫికెట్లను అందజేసింది.

### కార్మికుడు ఆత్మహత్య

క్రిష్ణగిరి: కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా బందారపల్లి గ్రామానికి చెందిన సురేష్ (37) సూళగిరి మసీపంలోని తిరుమలగౌండన్‌కొటాయ్ ప్రాంతంలో నివాసముంటూ పాత ఇనుప వస్తువుల గోడన్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనికి తాగుడు అలవాటుంది. రోజూ మద్యం తాగి పనికెళ్లేవాడు. గమనించిన యాజమాని మద్యం తాగి విధులకు రాకూడదని హెచ్చరించాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సురేష్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

## క్లుప్తంగా...

### 23 నుంచి 'జన్మభూమి'కి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

**తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర):** ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించే దిశగా వాల్తేర్ డివిజన్ మరిన్ని అడుగులు ముందుకువేస్తుంది. ఇందులో భాగంగా పలు రైళ్లకు పాత బోగీల స్థానంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను అంచెలంచెలుగా ఏర్పాటు చేస్తోంది. విశాఖపట్నం-సికింద్రాబాద్ (12805) మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23వ తేదీ నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేయనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 24 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. విశాఖ నుంచి పూర్తి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనున్నవాటిలో ఇది 20వ రైలు కానుంది.

### పెనాల్టీల తగ్గింపును స్వాగతించిన బుగ్గన



**సాక్షి, అమరావతి:** చిన్న వ్యాపార సంస్థలకు విధించే పెనాల్టీలను తగ్గించడం, అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటులో రాష్ట్ర సూచనలను పరిగణనలోకి తీసుకోవడంపై రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం న్యూఢిల్లీ విజ్ఞానభవన్‌లో జరిగిన 49వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అధికారులతో కలిసి బుగ్గన పాల్గొన్నారు. రాష్ట్రం సూచించిన విధంగానే రూ.20 కోట్ల వ్యాపార పరిమాణం ఉన్న సంస్థలు రిటర్నులు ఆలస్యంగా దాఖలు చేసినప్పుడు విధించే పెనాల్టీల సవరణకు కౌన్సిల్ అంగీకరించినట్లు తెలిపారు. అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌లో తీసుకోవాల్సిన సవరణల కోసం మంత్రుల కమిటీ సూచనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని, కమిటీలో తాను కూడా సభ్యుడిగా ఉన్నానని, ట్రిబ్యునల్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి చోటు కల్పించడంతో పాటు, త్వరగా ఏర్పాటు చేయాలన్న సూచనలకు కౌన్సిల్ అంగీకరించిందని వెల్లడించారు. జూన్, 2022 వరకు రాష్ట్రాలకు చెల్లించాల్సిన రూ.16,982 కోట్ల పరిహార బకాయిల చెల్లింపునకు కౌన్సిల్ అంగీకరించిందని, ఇందులో రాష్ట్రానికి సుమారు రూ.689 కోట్లు రావాల్సి ఉందన్నారు.సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి(వాణిజ్య పన్నులు) ఎస్.గుల్జార్, రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ ఎం.గిరిజా శంకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ

### వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా వెంకట్

**సాక్షి, హైదరాబాద్:** అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడిగా విజయ రాఘవన్, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకట్ ఎన్నికయ్యారు. ఈ నెల 15 నుంచి శనివారం వరకు పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో జరిగిన సంఘం జాతీయ పదవ మహాసభల చివరి రోజు నూతన కమిటీని, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను, 155 మందితో కూడిన జనరల్ కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ నుంచి 15 మంది, ఏపీ నుంచి 12 మంది, కేరళ నుంచి 30, పశ్చిమ బెంగాల్ నుంచి 18 మందిని జనరల్ కౌన్సిల్‌కు ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన వారిలో వి.వెంకటేశ్వర్లు, డి.సుబ్బారావు, వి.శివ నాగరాణి, కె.వి. నారాయణ, కె.ఆంజనేయులు, ఎం.నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య, ఎ.రవి, డి.వెంకన్న, యం.రాజేశ్, జి.సింహాచలం ఉన్నారు. ఈ మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించినట్టు బి.వెంకట్ తెలిపారు.

# ఆర్ట్స్ కోర్సులకే అందలం!

- దేశంలో యూజీ కోర్సుల్లోనే అత్యధిక చేరికలు
- బీఏలో 1.04 కోట్ల మంది..
- బీఎస్సీలో 49.12 లక్షల మంది..
- ఆ తర్వాత.. బీకాంలో 43.22 లక్షల మంది.. బీటెక్‌లో 23.20 లక్షలు, బీఈలో 13.42 లక్షల మంది
- మొత్తం విద్యార్థుల్లో యూజీ కోర్సుల్లోనే 78.9 శాతం మంది
- పీజీ కోర్సులు చదువుతున్నవారు 11.4 శాతమే
- కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఐష్ తాజా నివేదికలో వెల్లడి



**సాక్షి, అమరావతి:** దేశంలో వివిధ ఉన్నత విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది ఆర్ట్స్ కోర్సులవైపే మొగ్గుచూపుతున్నారు. బీఏలో ఏకంగా 1.04 కోట్ల మంది చేరగా ఆ తర్వాత బీఎస్సీలో 49.12 లక్షల మంది, బీకాంలో 43.22 లక్షల మంది చేరారు. ఉన్నతవిద్యా కోర్సుల్లో చేరినవారిలో ఏకంగా 78.9 శాతం మంది అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) కోర్సుల్లోనే ఉండటం గమనార్హం. ఇదే సమయంలో పీజీ కోర్సులు చదువుతున్నవారు కేవలం 11.4 శాతానికే పరిమితమయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హాట్ ఫేవరెట్ కోర్సులు అయిన బీటెక్‌లో 23.20 లక్షల మంది చేరగా, బీఈలో 13.42 లక్షల మంది ఉన్నారు. ఈ మేరకు దేశంలోని వివిధ కోర్సుల్లో చేరికలపై కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ.. ఆలిండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐష్) నివేదిక-2020-21 విడుదల చేసింది. ఇందులోని గణాంకాల ప్రకారం.. దేశంలో వివిధ కోర్సుల్లో మొత్తం 4,13,80,713 మంది విద్యార్థులు చేరగా.. అందులో 3.26 కోట్ల మంది (78.9 శాతం) యూజీ కోర్సులు చదువుతున్నారు. ఇక పోస్టుగ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో 47.16 లక్షలు (11.4 శాతం) మంది ఉన్నారు. ఇక డిప్లొమా కోర్సుల్లో చేరికలు తక్కువగానే నమోదయ్యాయని.. మొత్తం విద్యార్థుల్లో వీరి సంఖ్య 29.79 లక్షలే (7.2 శాతం)నని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ డిప్లొమా కోర్సుల్లో చేరినవారిలో అత్యధికులు టెక్నికల్, పాలిటెక్నిక్, నర్సింగ్, టీచర్ ట్రైనింగ్ కోర్సులు చదువుతున్నారు. అలాగే పీజీ డిప్లొమా కోర్సులను కేవలం 2.57 లక్షల మంది మాత్రమే అభ్యసిస్తున్నారు. ఇక సర్టిఫికెట్ కోర్సుల్లో చేరినవారు 1.55 లక్షల మంది మాత్రమేనని ఐష్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం విద్యార్థుల్లో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల వాటా వరుసగా 0.62, 0.38 శాతాలు మాత్రమేనని నివేదిక పేర్కొంది.

### బీఏ, బీకాంల్లో మహిళలు.. బీటెక్, బీఈల్లో పురుషులు..

జాతీయ స్థాయిలో పలు కోర్సుల్లో చేరికలను గమనిస్తే ఇంజనీరింగ్ కోర్సుల మినహా దాదాపు మిగిలిన అన్ని కోర్సుల్లోనూ పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. బీఏలో చేరిన వారిలో 52.7 శాతం మంది మహిళలే ఉన్నారు. ఇక బీఎస్సీలో 52.2 శాతం, బీకాంలో 48.5 శాతం మంది మహిళలేనని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇంజనీరింగ్ కోర్సుల్లో మాత్రం పురుషులతో పోలిస్తే మహిళల చేరికలు 28.5 శాతమే ఉన్నాయి. పీజీ సోషల్ సైన్సెస్ కోర్సుల్లోనూ 56.5 శాతం చేరికలతో మహిళలదే పైచేయిగా ఉంది. అలాగే పీజీ సైన్స్ కోర్సుల్లో 61.5 శాతం, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో 43.1 శాతం, కామర్స్‌లో 66.5 శాతం మంది మహిళలు ఉన్నారు. ఎడ్యుకేషన్ విభాగంలోనూ 64.4 శాతంతో మహిళల చేరికలే అధికమని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పీహెచ్‌డీ కోర్సుల్లో ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగంలో 33.3 శాతమే మహిళల వాటా. పీహెచ్‌డీ మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీల్లో 48.8 శాతం మంది మహిళలున్నారు.

### పీహెచ్‌డీలో పెరిగిన చేరికలు

కాగా పీహెచ్‌డీ కోర్సుల్లో చేరికలు పెరిగాయని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 2.11 లక్షల మంది పీహెచ్‌డీ కోర్సుల్లో చేరినవారున్నారు. వీరిలో ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో 56,625 మంది ఉన్నారు. ఇక మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ వంటి అంశాల్లో 48,600 మంది పరిశోధనలు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్నవారు 2,255 మంది ఉన్నారు.

### దేశంలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఇలా..

| కోర్సు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| బీఎస్సీ (ఆనర్స్) | 3,21,703 | 2,65,510 | 5,87,213 |
| ఎంబీఏ | 3,42,741 | 2,62,239 | 6,04,980 |
| బీబీఏ | 3,92,536 | 2,44,141 | 6,36,677 |
| ఎమ్మెస్సీ | 3,36,064 | 5,24,278 | 8,60,342 |
| బీఈ | 9,60,510 | 3,82,350 | 13,42,860 |
| బీఈడీ | 5,09,444 | 9,28,883 | 14,38,327 |
| బీఏ (ఆనర్స్) | 7,85,357 | 9,56,168 | 17,41,525 |
| ఎంఏ | 6,92,518 | 10,42,225 | 17,34,743 |
| బీటెక్ | 16,54,260 | 6,66,565 | 23,20,825 |
| బీకాం | 22,26,693 | 20,96,193 | 43,22,886 |
| బీఎస్సీ | 23,41,226 | 25,71,438 | 49,12,664 |
| బీఏ | 49,92,607 | 54,20,376 | 1,04,12,983 |
| మొత్తం | 1,55,55,659 | 1,53,60,366 | 3,09,16,025 |

### దేశంలో ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సుల్లో విద్యార్థుల చేరికలు ఇలా..

| | |
|---|---|
| కంప్యూటర్ ఇంజనీరింగ్ | 10,81,681 |
| మెకానికల్ ఇంజనీరింగ్ | 5,95,405 |
| ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ | 5,87,811 |
| సివిల్ ఇంజనీరింగ్ | 4,47,785 |
| ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ | 3,54,686 |
| ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ | 2,04,642 |
| ఆర్కిటెక్చర్ | 78,682 |
| కెమికల్ ఇంజనీరింగ్ | 54,882 |
| అగ్రికల్చర్ ఇంజనీరింగ్ | 22,171 |



### పీజీలో అత్యధికం ఈ కోర్సుల్లోనే..



దేశంలో పీజీ కోర్సుల్లో చేరినవారిలో అత్యధికంగా 9,41,648 మంది సోషల్ సైన్సు కోర్సులను చదువుతున్నారు. సైన్సు కోర్సులు అభ్యసిస్తున్నవారు 6,79,178 మంది ఉన్నారు. 68,60,001 మంది మేనేజ్‌మెంట్ కోర్సులు చదువుతున్నారు. కామర్స్ కోర్సుల్లో 5,36,560 మంది చేరారు. పీజీ కోర్సుల్లోనే భాషా సంబంధిత కోర్సుల్లో 3,20,176 మంది ఉన్నారు. ఇక ఎడ్యుకేషన్ విభాగం కోర్సులను 2,06,394 మంది చదువుతున్నారు.

### 2020-21కి దేశంలో వివిధ కోర్సుల్లో విద్యార్థుల చేరికలు



| | |
|---|---|
| పీహెచ్‌డీ | 2,11,852 |
| ఎంఫిల్ | 16,744 |
| పీజీ డిప్లొమా | 2,57,187 |
| పీజీ | 47,16,649 |
| యూజీ | 3,26,57,509 |
| డిప్లొమా | 29,79,320 |
| సర్టిఫికెట్ | 1,55,911 |
| ఇంటిగ్రేటెడ్ | 3,85,541 |
| మొత్తం | 4,13,80,713 |

# 'ఇరుకు' సభ కోసమే.. బాబు నానా రభస

### సభ కోసం రెండు స్థలాలు చూపిన పోలీసులు

- వాటిని కాదని అనపర్తి ఇరుకు రోడ్డు కోసం పట్టు
- ఇరుకు రోడ్డులో జనం ఎక్కువగా వచ్చినట్లు చూపేందుకే హంగామా
- అక్కడ సభ పెడితే తొక్కిసలాటకు అవకాశం ఉంటుందన్న పోలీసులు
- వారిని అసభ్యంగా దూషించిన చంద్రబాబు
- నిబంధనలు తుంగలో తొక్కి ఇరుకు రోడ్డులోనే సభ నిర్వహణ



అనపర్తిలో చంద్రబాబు సభ కోసం పోలీసులు సూచించిన బాలికల హైస్కూల్ ఎదుట లే ఔట్



సభ కోసం పోలీసులు సూచించిన మరో స్థలం కళా క్షేత్రం ప్రాంగణం



జనం ఎక్కువ వచ్చినట్లు చూపించేందుకు సభ కోసం చంద్రబాబు ఎంచుకున్న ఇరుకు రోడ్డు

**సాక్షి, అమరావతి:** తన సభకు విపరీతంగా జనం వచ్చారని చూపించుకునేందుకు చంద్రబాబు కాకినాడ జిల్లా అనపర్తిలో ఇరుకు రోడ్డును ఎంచుకుని పెద్ద హైడ్రామా సృష్టించారు. ఆ రోడ్డులో సభ పెట్టడం ప్రమాదకరమని చెప్పిన పోలీసులపై విరుచుకుపడి వారిని దుర్భాషలాడారు. తన స్థాయిని మరచిపోయి గల్లీ నాయకుడిలా డీఎస్పీని ఇష్టానుసారం దూషిస్తూ ఊగిపోయారు. అనుమతిచ్చినా సభ జరగనివ్వడంలేదని, పోలీసులు అడ్డుకుంటున్నారని, సీఎం జగన్ ఇదంతా కావాలని చేయిస్తున్నారని తనకు తానే ఒక కట్టు కథను అల్లి శుక్రవారం సాయంత్రం అనపర్తిలో నానా హంగామా సృష్టించారు. నిజానికి.. పోలీసులు అనుమతిచ్చింది ర్యాలీకి మాత్రమే. కానీ, ర్యాలీ పేరుతో ఇరుకు రోడ్డులో సభ పెట్టేందుకు చంద్రబాబు, టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. సభ కోసం పోలీసులు అనపర్తిలోని రెండు స్థలాలను టీడీపీ నేతలకు సూచించారు. గరల్స్ హైస్కూల్ ఎదుట ఉన్న ఖాళీ లేఅవుట్, స్థానికంగా ఉన్న కళా క్షేత్ర ప్రాంగణంలో ఎక్కడైనా సభ పెట్టుకోవాలని కోరారు. కానీ, టీడీపీ నేతలు అందుకు ఒప్పుకోలేదు. అవి పెద్ద స్థలాలు కావడంతో సభకు వచ్చే కొద్దిపాటి జనం కనపడరని, సభ ఫెయిల్ అయినట్లు తెలిసిపోతుందనే భయంతో ఇరుకు రోడ్ల జంక్షన్‌ను ఎంచుకున్నారు. అక్కడే సభ పెడతామని భీష్మించుకుని పోలీసులతో గొడవకు దిగారు. చంద్రబాబు కూడా స్వయంగా పోలీసులపై విరుచుకుపడి తిట్ల దండకం అందుకున్నారు. మరోవైపు.. ఇరుకు రోడ్డులో సభ పెడితే ఇబ్బందులొస్తాయని, జీఓ నెంబర్-1లో ఉన్న మార్గదర్శకాలను పాటించాలని పోలీసులు ఆయన్ను కోరారు. చిన్న రోడ్డులో ఎక్కువ మంది జనం వస్తే సమస్యలు వస్తాయని తాము ప్రత్యామ్నాయ స్థలాలు చూపించామని ఎంత చెప్పినా చంద్రబాబు వినకుండా డీఎస్పీని తిట్టిపోశారు. తాను చూపించిందే ఆర్డర్.. ఇదేనయ్యా ఆర్డర్ అంటూ ఊగిపోయారు. 'ఎక్స్‌ట్రాలు చేయకు.. ఇదే ఆర్డర్' అంటూ బెదిరింపులకు దిగారు. ఆ తర్వాత ర్యాలీగా పోలీసులు వద్దన్న చోటుకే వెళ్లి సభ పేరుతో హడావుడి చేశారు. తన పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టడంతో వారు రెచ్చిపోయి పోలీసులపై రాళ్లు రువ్వి, వాళ్ల వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. కావాలని ఇరుకు రోడ్డును సభ కోసం ఎంచుకోవడం, ఎలాగో పోలీసులు అడ్డుకుంటారు కాబట్టి హైడ్రామా సృష్టించి మీడియా హైప్ ద్వారా లబ్ధిపొందాలనే ఉద్దేశంతోనే చంద్రబాబు అనపర్తిలో డ్రామా నడిపినట్లు స్పష్టమవుతోంది.

**బాబులో పశ్చాత్తాపం లేదు**

ఇక కందుకూరులో ఇరుకు రోడ్డులో సభ నిర్వహించి 8 మంది మృత్యువాత పడడానికి కారణమైనా ఆయనలో ఏమాత్రం పశ్చాత్తాపం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటి పొరపాట్లు మళ్లీ జరక్కుండా చూసేందుకు పోలీసులు ప్రయత్నిస్తుంటే తనను కావాలని అడ్డుకుంటున్నారని, తన సభలకు వస్తున్న జనాన్ని చూసి భయపడి ఇదంతా చేస్తున్నారని ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. నిజంగా తన సభలకు అంత పెద్దఎత్తున జనం వచ్చే పరిస్థితి ఉంటే పోలీసులు చూపించిన ఖాళీ స్థలాల్లో సభ నిర్వహించుకోవడానికి అభ్యంతరం ఏమిటనే ప్రశ్నకు చంద్రబాబుగానీ ఆయన పరివారం నుంచి గానీ సమాధానంలేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం.. పోలీసులతో గొడవకు దిగి హైడ్రామా సృష్టించడం.. మీడియా హైప్‌తో ఏదో జరిగిపోయినట్లు చిత్రీకరించడం.. తద్వారా ప్రజల దృష్టిని తన వైపు తిప్పుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు సభలు నిర్వహిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

### ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారు

చంద్రబాబునాయుడు

**అనపర్తి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్రజాస్వామిక విధానాలతో పాలన సాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి పాలమూరులో బస చేసిన ఆయన శనివారం ఉదయం స్థానిక సీడీఆర్ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న టీడీపీ వలంటీర్‌ను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన అనపర్తి పర్యటనలో టీడీపీ కార్యకర్తలపై పోలీసులు అమానుషంగా దాడి చేశారని ఆరోపించారు. జగ్గంపేట, పెద్దాపురంలో నిర్వహించిన సభలకు లేని ఆంక్షలు అనపర్తి పర్యటనకు మాత్రం ఎందుకొచ్చాయో పోలీసులకే తెలియాలన్నారు. కేవలం ముఖ్యమంత్రి సూచనల మేరకు పోలీసులు ఈ విధంగా ప్రవర్తించారని విమర్శించారు. టీడీపీకి ప్రజల్లో వస్తున్న చైతన్యం, వైఎస్సార్‌సీపీపై వస్తున్న వ్యతిరేకత చూసి భయపడి టీడీపీ సమావేశాలను భగ్నం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాలకు పూనుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో చట్ట వ్యతిరేకంగా పనిచేయాలని పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి వారితో పనిచేయిస్తున్నారని తెలిపారు. ఉన్నత స్థాయి అధికారులు రఘురామిరెడ్డి, సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు కింది స్థాయి అధికారులను బానిసలుగా భావించి వారితో ఇష్టారీతిన పనిచేయించుకుంటున్నారని చంద్రబాబు ఆరోపించారు.

# మహిళలంటే టీడీపీకి గౌరవం లేదు

- వారిని అవమానించటం చంద్రబాబు, లోకేశ్‌కు అలవాటు
- లోకేశ్ తన స్థాయి తెలుసుకుని మాట్లాడాలి
- మహిళలను రాజకీయాల్లోకి లాగి లబ్ధిపొందాలనుకోవడం వారి దిగజారుడుతనమే
- పాదయాత్రకు జనస్పందన లేక తీవ్ర నిరాశ, నిస్పృహ
- ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక జగన్‌పై విమర్శలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఫైర్



**చిలకలూరిపేట:** చంద్రబాబుకు, ఆయన తనయుడు లోకేశ్‌కు, ఇతర టీడీపీ నేతలకూ మహిళలంటే గౌరవంలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. ప్రతిసారి వైఎస్ భారతమ్మను రాజకీయాల్లోకి లాగడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. భారతమ్మ పేరును ఇకపై ప్రస్తావిస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. స్థానిక పురుషోత్తమపట్నంలోని తన నివాసంలో మంత్రి రజిని శనివారం మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే..

భారతమ్మ విజయవంతమైన ఒక మహిళా పారిశ్రామికవేత్త. సాక్షి లాంటి దినపత్రికను తన నాయకత్వంలో దేశంలోనే ప్రముఖ స్థానంలో నిలిపిన ఘనత ఆమెది. బాబు కుటుంబంలోని మహిళలు హెరిటేజ్ లాంటి సంస్థలకు సారథ్యం వహించటం లేదా? చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఒక నీతి, జగనన్న కుటుంబ సభ్యులకు మరోనీతి ఉంటుందా? చంద్రబాబునాయుడు సీబీఐతో కలిసి సాక్షి దినపత్రికను ఇబ్బందులకు గురిచేయాలని గతంలో ఎంతో ప్రయత్నించారు. అయిన భారతమ్మ ఆ సంస్థను ఎంతో ఉన్నత స్థానంలో నిలిపారు. మహిళలను రాజకీయాల్లోకి లాగి లబ్ధిపొందాలని చూడడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం.

**పేదల పెన్నిధి వైఎస్సార్..**

దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల దైవం. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదల ప్రాణాలకు భరోసా కల్పించడమే కాక.. ఉచిత విద్యుత్ ద్వారా రైతులకు ఊతం ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎందరో పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించారు. ఈ పథకాలన్నీ ఏ ప్రభుత్వాలు వచ్చినా కొనసాగిస్తూనే ఉన్నాయి. అలాంటి వ్యక్తి మా పార్టీ డీఎన్ఏ అని చెప్పుకోవటానికి ఎంతో గర్వంగా ఉంది. టీడీపీ అధికారంలో ఉండగా ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక గొప్ప పరిపాలనను అందిస్తున్న సీఎం జగన్‌ను విమర్శించటమే పనిగా పెట్టుకున్నారు.

**జగనన్నను విమర్శించే స్థాయి లోకేశ్‌కు లేదు**

అలాగే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లోకేశ్‌కు లేదు. ఏకంగా 151మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న ఘనత జగనన్నది. సర్పంచి నుంచి మంత్రుల వరకు ఎందరో నాయకులను తయారు చేసిన గొప్ప నేత జగనన్న. అలాంటి వ్యక్తి పేరు ఎత్తే అర్హత ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని లోకేశ్‌కు లేదు. లోకేశ్ పాదయాత్రకు జనస్పందన లేక పూర్తి నిరాశలో ఉండడంతో ఏం చేయాలో తెలీక జగనన్నను తిట్టడం పనిగా పెట్టుకున్నారు.

# పోలీస్ విధులకు ఆటంకం కలిగించారు

- విశాలమైన ప్రదేశాల్లో సభ నిర్వహించుకోవాలని సూచించాం
- కావాల్సినంత పోలీస్ బందోబస్తు ఇస్తామని చెప్పాం
- టీడీపీ నేత నల్లమిల్లికి అనుమతి కూడా అలాగే ఇచ్చాం
- కానీ అనపర్తిలో చంద్రబాబు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ రోడ్డుపైనే సభ పెట్టారు
- ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్ వెల్లడి



ఇన్‌చార్జ్ ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

**సాక్షి, భీమవరం/రాజమహేంద్రవరం రూరల్/బిక్కవోలు:** విశాలమైన ప్రదేశంలో సభ నిర్వహించుకునేందుకు అనుమతిచ్చినా పట్టించుకోకుండా.. రోడ్డుపై సభ పెట్టడమే కాకుండా.. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకే టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ మంత్రులు జవహర్, నిమ్మకాయల చినరాజప్ప తదితరులపై కేసు నమోదు చేసినట్లు తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని దిశ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'శుక్రవారం అనపర్తి నియోజకవర్గంలో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి కోరుతూ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దరఖాస్తు చేశారు. రోడ్డుపై సభ నిర్వహించకూడదన్న షరతులతో వారికి అనుమతులిచ్చాం. విశాలమైన ప్రదేశంలో, ప్రజలకు ఇబ్బంది కలగకుండా సభ నిర్వహించుకోవాలని సూచించాం. కానీ పోలీసుల మాటలు పట్టించుకోకుండా.. బిక్కవోలు నుంచి అనపర్తికి చంద్రబాబు, టీడీపీ నేతలు ర్యాలీగా వస్తుండటంతో ఆర్ఎస్ పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద డీఎస్పీ భక్తవత్సలనాయుడు వారితో షరతుల ఉల్లంఘనపై చర్చించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ మంత్రులు జవహర్, నిమ్మకాయల చినరాజప్పతో పాటు వెయ్యి మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు చంద్రబాబు ప్రోద్బలంతో పోలీసులను నెట్టుకుంటూ ముందుకు దూసుకొచ్చారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనపై డీఎస్పీ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేతలు వెయ్యి మందిపై బిక్కవోలు ఎస్సై బుజ్జిబాబు కేసు నమోదు చేశారు' అని ఇన్‌చార్జ్ ఎస్పీ సుధీర్‌కుమార్ వివరించారు. ఇరుకైన ప్రదేశం కావడంతో అనపర్తిలో రోడ్‌షోకు మాత్రమే అనుమతిచ్చామని.. సభకు అనుమతివ్వలేదని స్పష్టం చేశారు. గోకవరంలో చంద్రబాబు సభను అడ్డుకోలేదని తెలిపారు. కేసు విచారణ చేపట్టి సంబంధిత నేతలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సభ నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

**ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు..**

అనుమతులు లేని ప్రాంతాల్లో సభలు నిర్వహించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టబద్ధమైన చర్యలు తప్పవని ఐజీ జి.పాలరాజు చెప్పారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో సభ నిర్వహణకు కళాక్షేత్రంతోపాటు బలభద్రపురం వద్ద పెద్ద లేఅవుట్‌ను సూచించి అక్కడ పూర్తిస్థాయి భద్రత కల్పిస్తామని చెప్పినా వినకుండా.. చంద్రబాబు, టీడీపీ నేతలు పోలీసులను నెట్టేసి.. రోడ్డు పైనే సభ పెట్టారని పాలరాజు తెలిపారు. ఇదే సమయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు కొందరు బస్సు అద్దాలు పగలగొట్టడంతో పాటు పోలీసులపై రాళ్లు రువ్వారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో మాజీ సీఎం చంద్రబాబుకు రక్షణ కల్పించేందుకే పోలీసులు కొద్దిపాటి లాఠీచార్జి చేయాల్సి వచ్చిందన్నారు. రాళ్లు రువ్విన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

# సానుభూతి కోసమే బాబు డ్రామాలు

- చట్టాన్ని ఉల్లంఘించడం హీరోయిజం కాదు
- నిబంధనలకు విరుద్ధంగా సభలు పెడుతూ ప్రజల ప్రాణాల మీదకు తెస్తారా?
- అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే పోలీసులను సంఘవిద్రోహశక్తులంటారా?
- చంద్రబాబు బేషరతుగా పోలీసులకు క్షమాపణ చెప్పాలి
- మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ సుభాష్ చంద్రబోస్ డిమాండ్



మంత్రి వేణుగోపాలకృష్ణ



ఎంపీ సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే సత్యనారాయణరెడ్డి

**అనపర్తి/రామచంద్రపురం:** ప్రజల సానుభూతి పొందేందుకే చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ.. రాజ్యసభ సభ్యుడు, ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేలను తన ప్రసంగాల్లో దుర్భాషలాడడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ సభలు పెట్టేందుకు యత్నించిన చంద్రబాబు పోలీసులపై సంఘ విద్రోహక శక్తులు అంటూ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అనపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి ఎంపీ బోస్, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంత్రి చెల్లుబోయిన శనివారం వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే..

**బాబు భద్రత ముఖ్యం : బోస్**

జెడ్ కేటగిరీ సెక్యూరిటీ కలిగిన చంద్రబాబు భద్రత ప్రభుత్వానికి, పోలీసులకు అతి ముఖ్యం. ఇందులో భాగంగానే అనపర్తిలో పోలీసులు నిబంధనల మేరకు వ్యవహరించారు. నిజానికి.. చంద్రబాబు రోడ్ షోకు మాత్రమే అధికారులు అనుమతులిచ్చారు తప్ప రహదారిపై బహిరంగ సభకు కాదు. అనుమతులు ఉన్నాయంటూ చంద్రబాబు మాట్లాడడం, కూడళ్లలో సభలు నిర్వహించాలనుకోవడం సరికాదు. చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి గత గోదావరి పుష్కరాల సమయంలో, ఇటీవల కందుకూరు, గుంటూరులో నిర్వహించిన కార్యక్రమాల్లో పదుల సంఖ్యలో ప్రజలు బలయ్యారు. చంద్రబాబు చట్టాలను గౌరవించకుండా వాటిని ఉల్లఘించడాన్ని హీరోయిజంగా భావించడం కరెక్ట్ కాదు. చంద్రబాబు జాతిపిత గాంధీతో పోల్చుకోవడం హాస్యాస్పదం. ఇక అనపర్తి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వ్యక్తిని పక్కన పెట్టుకుని నిజాయితీపరుడైన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరం.

**అనపర్తి నుంచి పోటీకి సిద్ధమా?: సూర్యనారాయణరెడ్డి**

అనపర్తిలో టీడీపీ నేతలు గుండాయిజానికి పాల్పడి చట్టాన్ని వాళ్ల చేతుల్లోకి తీసుకున్నారు. చంద్రబాబు తన ప్రసంగంలో కుల ప్రస్తావన తీసుకురావడం విడ్డూరంగా ఉంది. అనపర్తి రెండో పులివెందులే. రాబోయే ఎన్నికల్లో నాపై పోటీచేసి గెలుపొందే సత్తా చంద్రబాబుకు ఉందా?

**నిజమైన సైకో బాబే : మంత్రి చెల్లుబోయిన**

రోడ్ షోకు అనుమతి తీసుకున్నారు. జనం రాకపోవడంతో ఇరుకు రోడ్డులో సభ పెట్టాలని చంద్రబాబు చూశారు. వేరే చోట మీటింగ్ పెట్టుకోవాలని పోలీసులు సూచించినా వినలేదు. ఇలా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించటానికి ఆయనకు సిగ్గులేదు. పోలీసులను సైకోలు అంటున్న చంద్రబాబే నిజమైన సైకో. లోకేశ్ పాదయాత్రను జనాలు పట్టించుకోకపోవడంవల్లే చంద్రబాబు సైకోలా ప్రవర్తిస్తున్నారు. పోలీసులను సంఘ విద్రోహక శక్తులు అంటున్న ఆయనే పెద్ద సంఘ విద్రోహక శక్తి.

గట్టిగా అనుకుని ఆచరణలో పెడితే చాలు తలుచుకున్న పని తప్పక సఫలం అవుతుంది అనే మాటలకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తారు బామ్మ ఊర్మిళా అషేర్. ఎనిమిది పదుల వయసుకు చేరువలో ఉండి తన పాకశాస్త్ర ప్రావీణ్యంతో లక్షలాది అభిమానులను ఘుమఘుమలతో కట్టిపడేసింది. ఆటుపోట్ల జీవనాన్ని అధిగమించి తన సత్తా చూపుతోంది.



ఊర్మిళా అషేర్

● బామ్మ వంట

# గెలుపు ఘుమఘుమలు @ 78

‘‘మొన్న అప్‌లోడ్ చేసిన నా 200 వ వీడియోతో యూ ట్యూబ్ చానెల్ లక్ష మంది అభిమానులను సంపాదించింది. ఇటీవలే దేశవ్యాప్తంగా టీవీలో ప్రసారమవుతున్న ‘రసోయి షో’లో పాల్గొన్నాను. మాస్టర్ చెఫ్ ఇండియా సీజన్ 7లో పోటీదారుగా చేరడంతో మీ అందరికీ పరిచయం అయ్యాను. ఇదంతా మీ అభిమానం వల్లే కలిగింది’ అంటూ ఆనందంగా చెబుతోంది ఊర్మిళ అషేర్. ముంబైలో ఉంటున్న ఊర్మిళ అషేర్ గుజరాతీ కుటుంబీకు రాలు. తన కుటుంబం ఆర్థిక కష్టాలు తీరాలంటే ఏదో ఒక సాయం చేయాలనుకుంది. అందుకు తనకు వచ్చిన పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని పెట్టుబడిగా పెట్టింది. తన మనవడు హర్ష్‌తో కలిసి మూడేళ్ల క్రితం ‘గుజ్జు బెన్ న నాస్తా’ ఫుడ్ బిజినెస్ స్టార్ట్ చేసింది. ఏడాదికి రూ.45 లక్షల టర్నోవర్ సాధిస్తూ 78 ఏళ్ల వయసులోనూ ‘గ్రేట్ బామ్మా’ అనిపించుకుంటోంది.



> కష్టాలు తాత్కాలికమే. జీవితంపై నమ్మకం కోల్పోకూడదు. విపరిణామాలు మనపైన ప్రభావం చూపకుండా ఉండేందుకు ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోకూడదు. ధైర్య స్థైర్యాలతోనే జీవితాన్ని గెలవాలి.
>
> – ఊర్మిళా అషేర్

### కోల్పోనిది ధైర్యమొక్కటే..

ఊర్మిళా అషేర్‌కు పద్దెనిమిదేళ్ల వయసులో పెళ్లయ్యింది. భర్త చిరుద్యోగి. ముగ్గురు పిల్లలు. ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. రెండున్నరేళ్ల వయసులో కూతురు మూడవ అంతస్తు మీద నుంచి కింద పడి మరణించింది. భర్త తెచ్చే జీతం డబ్బులతో ఇంటిని నడుపుకుంటూ వచ్చింది. పెద్ద కొడుకుకి పెళ్లి చేసింది. కరోనాకు ముందు ఇద్దరు కొడుకుల్లో ఒకరు గుండెపోటుతో, మరొకరు బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించారు. ఆ తర్వాత భర్త మరణించాడు. ఈ ఎదురు దెబ్బలు ఆమెను నిత్యం గట్టిపరుస్తూనే ఉన్నాయి. ‘మరణం అనేది పరమసత్యం. దాని గురించి ఎన్ని రోజులని ఏడుస్తూ కూర్చుంటాం. నేనెప్పుడూ నా వద్ద ఉన్న శక్తితోనే ఏం చేయగలను అనేదానిపై దృష్టిపెడ తాను. ఉన్న సమస్యలు చాలవన్నట్టు నాలుగేళ్ల క్రితం నా మనవడు హర్ష్ ప్రమాదానికి గుర య్యాడు. ఈ ప్రమాదంలో పై పెదవి పూర్తిగా దెబ్బతిని, ఇంటికే పరిమితం అయ్యాడు. అతను నడుపుతున్న దుకాణాన్ని కరోనా మహమ్మారి కారణంగా మూసేశాం. దీంతో ఆర్థికంగా చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ కష్టాలు తాత్కాలికమేనని, జీవితంపై నమ్మకం కోల్పోకూడదని తెలుసు’ అని చెప్పే ఊర్మిళ ఈ విపరిణామాలు మనవడిపైన ప్రభావం చూపకుండా ఉండేందుకు ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోకూడదని, ధైర్య స్థైర్యాలతోనే జీవితాన్ని గెలవాలని చెబుతూ ఉంటుంది. ఆమె మనో నిబ్బరం, ఆత్మవిశ్వాసాలే నేడు ఏడాదికి రూ.45 లక్షల టర్నోవర్‌కు చేరుకునేంతగా ఫుడ్ బిజినెస్‌లో ఎదిగేలా చేశాయి. కష్టం వచ్చినప్పుడు ఇంకాస్త గట్టిగా ఉండాలని తన కథనే ఉదాహరణగా ఇతరులతో పంచుకుంటోంది ఈ దాదీ.

### వ్యాపార విస్తరణ

కోడలు, మనవడితో ఉండే ఊర్మిళ తన చేతి రుచి గురించి చెబుతూ– ‘‘నాకు చిన్నప్పటి నుంచి వంటలు బాగా చేస్తాననే పేరుంది. మమ్మల్ని మేం బతికించుకోవడానికి ముందుగా గుజరాతీ చిరుతిళ్ల వ్యాపారాన్ని ప్రారంభించాం. ఆర్డర్లు వచ్చినదాన్ని బట్టి 20–25 రోజుల్లో 500 కిలోల పచ్చళ్లను రెడీ చేశాం. దీంతో పాటు తేప్లా, ఢోక్లా, పూరన్ పోలీ.. వంటి ఇతర స్నాక్స్ కూడా అమ్మడం మొదలు పెట్టాం. డిమాండ్‌ను బట్టి పనివాళ్లను ఎక్కువ మందిని నియమించుకున్నాం. ఒక సంవత్సరం తిరిగేసరికల్లా మా జీవితాలే మారిపోయాయి. నేనిప్పుడు టెడెక్స్ స్పీకర్‌ని కూడా. నా కథలను ఇతరులతో పంచుకుంటూ, ఇతరులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటూ వివిధ నగరాలకూ ప్రయాణిస్తున్నాను. ఇప్పుడు మా ఆలోచన ఒక్కటే! నేను, మా మనవడు కలిసి అంతర్జాతీయ విమానాశ్రయాలలో ‘గుజ్జుబెన్ నాస్తా’ను ఏర్పాటు చేయాలని. అమెరికా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా నుండి కూడా ఆర్డర్లు తీసుకుంటున్నాం. వ్యాపారాన్ని ఇంకా విస్తరిస్తేనే కదా మరింత మందికి చేరువ అయ్యేది... మా ఊరగాయలను ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో పెట్టడానికి కావలసిన లాంఛనాలు కూడా పూర్తయ్యాయి’ అని ఉత్సాహంగా వివరించే ఊర్మిళ మాటలు నేటి యువతకూ స్ఫూర్తినిస్తాయి.





అర్చన భానుషాలి

‘ఒక మహిళ చిత్రకారిణిగా ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని టాటూ ఆర్టిస్ట్‌గా ఉంటానంటే ఆశ్చర్యంగా చూస్తారు’ అంటుంది **అర్చన భానుషాలి.** దేశంలో ఉత్తమ మహిళా టాటూ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన అర్చన మగవాళ్లు రాజ్యమేలే ఈ రంగంలో తన ఉనికిని సగర్వంగా చాటుతోంది.

● ఫిమేల్ టాటూ ఆర్టిస్ట్

# చెరిగిపోని పచ్చబొట్టు సంతకం

శివరాత్రి సందర్భంగా ‘శివ్ అండ్ శక్తి కాస్మిక్ డాన్స్’ అనే సబ్జెక్ట్‌ను పచ్చబొట్టుగా వేసింది అర్చన భానుషాలి. శివుడు, పార్వతి ఆనంద తాండవం చేస్తున్న ఆ పచ్చబొట్టులో జీవం ఉట్టి పడుతోంది. అర్ధనారీశ్వరుడి చిత్రం కూడా పచ్చబొట్టుగా వేస్తుందామె. ఇవే కాదు ఆమె బొమ్మల్లో మన సంస్కృతిని ప్రతిబింబించే భారతీయ పౌరాణిక, ఆధ్యాత్మిక చిహ్నాలు కనపడతాయి. శివాజీ వంటి వీరులూ, అన్నా హజారే వంటి సామాజిక ఉద్యమకారులు కూడా కనపడతారు. పచ్చబొట్టును ఒక విశృంఖల చిహ్నంగా కాకుండా వ్యక్తిత్వ ప్రకటనగా మార్చడం వల్లే అర్చనకు మంచి పేరొచ్చింది. అందుకే ఆమె ప్రస్తుతం దేశంలో ఉన్న మహిళా టాటూ ఆర్టిస్ట్‌లలో బెస్ట్ ఆర్టిస్ట్‌గా, సీనియర్ ఆర్టిస్ట్‌గా గౌరవం పొందుతోంది.





### కమర్షియల్ ఆర్టిస్ట్‌గా

అర్చన కుటుంబానిది గుజరాత్ అయినా ముంబైలో స్థిరపడింది. అర్చన ఏడేళ్ల వయసు నుంచే వయసుకు మించిన పరిణతిని ప్రదర్శిస్తూ బొమ్మలు వేసేది. దాంతో ఇంట్లో ప్రోత్సహించారు. అయితే ఇంటర్ వయసు వచ్చే సరికి గుజరాతీలలో అమ్మాయిలకు పెళ్లి చేసి పంపాలనే తొందర ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు పెళ్లి చేస్తామని వెంటపడితే అప్పుడే వద్దని చెప్పి ముంబై జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో మూడేళ్ల డిప్లమా చేసింది కమర్షియల్ ఆర్ట్‌లో. ఆ తర్వాత లండన్ వెళ్లి ఒక సంవత్సరం కోర్సు చదవాలని అనుకుంది. ఆ కోర్సుకు అడ్మిషన్ కోసం ప్రయత్నిస్తుండగా టీవీలో ఒక షో చూసింది. అందులో ప్రఖ్యాత అమెరికన్ టాటూ చిత్రకారిణి కేట్ వాన్ డి తన క్లయింట్లకు అద్భుతంగా టాటూలు వేయడం చూపించారు. ‘నేను పేపర్ మీద వేసేది ఈమె ఒంటి మీద వేస్తోంది. నేనెందుకు ఇలా వేయకూడదు’ అనుకుంది అర్చన. ఆమె యాత్ర మొదలైంది.




> ఈ రంగంలో మగవారు విపరీతంగా ఉన్నారు. ఆడవాళ్ల ప్రవేశం అంత సులభం కాదు. కాని నేను పంతంతో ఈ స్థాయికి వచ్చాను. మహిళలకు నేను చెప్పేది ఒక్కటే. మీకు లక్ష్యం ఉంటే సరిపోదు. దానికి తగ్గ కష్టం చాలా చేయాలి. ఇవాళ నేను ఈ రంగంలో గుర్తింపుతో పాటు ఆర్థికంగా కూడా మంచి రాబడి పొందుతున్నాను.
>
> – అర్చన

‘మా అమ్మానాన్నలు నేను టాటూ ఆర్టిస్ట్‌గా మారతానంటే కంగారు పడినా ఆ తర్వాత ప్రోత్సహించారు. దాని వల్ల టాటూ వేయడంలో కోర్సు చేశాను. నాకు బొమ్మలు వచ్చు కనుక చాలా త్వరగా పని నేర్చుకున్నాను. మేము గుజరాతీలం. ఒకరి కింద పని చేయడం కంటే సొంత బిజినెస్ ఉండటాన్నే ఇష్టపడతాం. అందుకే ‘ఏస్ టాటూజ్’ పేరుతో ముంబైలో మా నాన్న నా కోసం టాటూ స్టూడియో ఏర్పాటు చేశాడు’ అంటుంది అర్చన. అయితే అసలు ప్రోత్సాహం భర్త నిఖిల్ నుంచి, అత్తా మామల నుంచి లభించింది. ‘మా అత్తగారు నన్ను బాగా ప్రోత్సహిస్తారు. పెళ్లయ్యాక నా మొదటి పచ్చబొట్టును ఆమెకే వేశాను’ అంది అర్చన.

## హెల్త్

● సెప్టిసీమియా

# రక్తానికీ ఇన్ఫెక్షన్..? రక్షణ ఇలా!



**సాధారణంగా ఇతర అవయవాలకు వచ్చే ఇన్ఫెక్షన్ తెలుసుగానీ... రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్ గురించి పెద్దగా అవగాహన ఉండదు. ఇక్కడ ఓ కీలకం దాగి ఉంది. మిగతా అవయవాలకు ఇన్ఫెక్షన్ సోకితే... మెల్లగా పాకుతూ అంత త్వరగా ప్రమాదం రాకపోవచ్చు. కానీ రక్తానికి ఇన్ఫెక్షన్ గనక సోకితే అది అన్ని అవయవాలకూ, కణాలకూ వెళ్తూ ఆహారాన్నీ, ఆక్సిజన్‌ను తీసుకెళ్తూ వెళ్తూ ఇన్ఫెక్షన్‌ను కూడా దేహమంతటికీ వ్యాప్తి చేస్తుంది కాబట్టి ఇది కాస్త ప్రమాదకరమైన పరిస్థితి. రక్తానికి ఇన్ఫెక్షన్ కలిగించే ఈ కండిషన్‌ను ‘సెప్టిసీమియా’ అని పిలుస్తారు. దీనిపై అవగాహన కోసం ఈ కథనం.**

మామూలుగా ఏదైనా భాగానికి ఇన్ఫెక్షన్, ఇన్‌ఫ్లమేషన్ వస్తే దాన్ని వాడుకగా ‘సెప్టిక్’ అయిందని అంటారు. రక్తానికి ఇన్ఫెక్షన్ వచ్చి అది దేహాన్నంతటినీ విషపూరితం చేసే కండిషన్‌ను ‘సెప్సిస్’ లేదా ‘సెప్టిసీమియా’ అంటారు. దీని గురించి కొన్ని వివరాలివి...

### సెప్టిసీమియాకు కారణాలు

బ్యాక్టీరియల్, వైరల్, ఫంగల్, ఏవైనా పరాన్నజీవులతో పాటు మరికొన్ని అంశాలు కూడా సెప్టిసీమియాకు దారితీయవచ్చు. చాలాకాలంగా ఆల్కహాల్‌కు తీసుకుంటూ ఉండటం, దీర్ఘకాలంగా అదుపులేకుండా డయాబెటిస్ బారిన పడటం, తగిన పోషకాహారం తీసుకోకపోవడం, కొన్ని రకాల మందుల్ని దీర్ఘకాలికంగా వాడటం, రోగనిరోధక వ్యవస్థను మందకొడిగా చేసే ఇమ్యునోసప్రెసెంట్స్ వాడుతుండటం, కొన్ని రకాల యాంటీబయాటిక్ మందులను విచక్షణరహితంగా వాడటం సెప్టిసీమియాకు దారితీయవచ్చు.

### కొన్ని ఇన్ఫెక్షన్లలో సెప్టిసీమియా ముప్పు మరీ ఎక్కువ...

- గుండెజబ్బులు వచ్చి చికిత్స పొందని సందర్భాల్లో
- ఊపిరితిత్తుల జబ్బులు వచ్చిన వాళ్లలో దాదాపు సగం మందిలో కేసుల్లో అది సెప్టిసీమియాకు దారితీయవచ్చు. ప్రధానంగా నిమోనియా వచ్చినప్పుడు ఇది మరీ ఎక్కువ.
- ఏదైనా కారణంతో పొట్ట (అబ్డామిన్)లో ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు దాదాపు మూడోవంతు కేసుల్లో అది సెప్టిసీమియాకు దారితీయవచ్చు.
- కిడ్నీ ఇన్ఫెక్షన్ వచ్చిన సందర్భాల్లో దాదాపు 11 శాతం కేసుల్లో అది సెప్టిసీమియాకు దారితీయవచ్చు. ముఖ్యంగా పైలోనెఫ్రైటిస్ అనే కిడ్నీ వ్యాధి వచ్చిన వారిలో లేదా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వచ్చిన వారిలో అది సెప్టిసీమియా ముప్పు తెచ్చిపెట్టవచ్చు.
- మెదడు తాలూకు ఇన్ఫెక్షన్స్ కూడా సెప్టిసీమియాగా మారవచ్చు.
- ఎముకలు, కీళ్లకు ఇన్ఫెక్షన్ సోకితే చాలా కొద్దిమందిలో (2% మందిలో) అది సెప్టిసీమియాగా మారే అవకాశముంది.

### లక్షణాలు

- చలితో వచ్చే జ్వరం ( ఫీవర్ విత్ చిల్స్)
- ఊపిరి అందకపోవడం (బ్రెత్‌లెస్‌నెస్)
- గుండె వేగంగా కొట్టుకోవడం (ర్యాపిడ్ హార్ట్‌బీట్)
- అయోమయం / మూర్ఛ (ఆల్టర్డ్ మెంటల్ స్టేటస్ / సీజర్స్)
- మూత్రం పరిమాణం బాగా తగ్గడం
- దేహంలోని చాలా చోట్ల నుంచి రక్తస్రావం
- పొట్టలో నొప్పి / వాంతులు / నీళ్ల విరేచనాలు
- కామెర్లు (జాండీస్).

### చికిత్స

సెప్టిసీమియా రోగులను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉంచి చికిత్స చేయాల్సి ఉంటుంది. చికిత్సలో భాగంగా డాక్టర్లు ఈ కింది ప్రొసీజర్స్ చేస్తారు.
● రక్తనాళం ద్వారా ద్రవపదార్థాలు అందజేయడం (ఇంట్రావీనస్ ఫ్లుయిడ్స్) ● రక్తనాళం ద్వారా యాంటీబయాటిక్స్ (ఇంట్రావీనస్ యాంటీబయాటిక్స్) ● రక్తపోటు అకస్మాత్తుగా పెరగడాన్ని నివారించే మందులతో సపోర్ట్ ● ఆక్సిజన్ తీసుకోలేకపోతున్న రోగికి కృత్రిమ శ్వాస ఇవ్వడం, వెంటిలేటర్‌తో శ్వాస అందించడం ● కిడ్నీ రోగుల్లో డయాలసిస్ ● అవసరమైన సందర్భాల్లో రక్తమార్పిడి లేదా రక్తంలోని కొన్ని అంశాలు తగ్గితే కోల్పోయిన వాటిని తిరిగి భర్తీ చేయడం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ లేదా బ్లడ్ ప్రొడక్ట్స్‌ను ఎక్కించడం) ● పేషెంట్‌కు ఇవ్వాల్సిన ఆహారాన్ని కూడా రక్తనాళం ద్వారానే అందిస్తారు. (ఇంట్రావీనస్ న్యూట్రిషనల్ సపోర్ట్).



డాక్టర్ ఆరతి బెల్లారి
సీనియర్ ఫిజీషియన్

### నిర్ధారణ పరీక్షలు

రక్త పరీక్ష, మూత్ర పరీక్షలతో పాటు ఎక్స్‌–రే, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి రేడియాలజికల్ పరీక్షలతో సెప్టిసీమియా ఉనికి, తీవ్రతను అంచనా వేయవచ్చు. ఈ పరీక్షల ఆధారంగా తర్వాత చేయాల్సిన చికిత్సనూ నిర్ణయిస్తారు.

### నివారణ

బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ వంటి సూక్ష్మజీవుల బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవడం ద్వారా చాలావరకు సెప్టిసీమియా నుంచి రక్షించుకోవచ్చు. మనం తీసుకునే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి కూడా పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త పడాలి. అలాగే మరికొన్ని అంశాలూ సెప్సిస్ నుంచి కాపాడతాయి. అవి...

- ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.
- నీటిని కాచి, చల్లార్చి లేదా ఫిల్టర్ అయిన నీటినే తాగాలి.
- వంటకాల్ని వేడివేడిగా ఉండగానే తినేయాలి. బయటి ఫుడ్‌కు (వీలైనంతవరకు) దూరంగా ఉండాలి.
- కూరగాయలను, ఆకుకూరలను శుభ్రంగా కడిగాకే వంటకు ఉపక్రమించాలి. తొక్క ఒలిచి తినే పండ్లు మినహా మిగతా వాటిని కడిగే తినాలి.
- తినడానికి ముందుగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- గాయాలను, పుండ్లను నేరుగా చేతితో ముట్టుకోకూడదు. వాటిని ముట్టుకోవాల్సి వస్తే చేతులకు గ్లౌవ్స్ వేసుకొని, సేవలందించాలి.
- తుమ్ముతూ, దగ్గుతూ ఉండేవారి నుంచి, ముక్కు నుంచి స్రావాలు వస్తున్నవారి నుంచి, జ్వరంతో బాధపడుతున్నవారి నుంచి దూరంగా ఉండాలి. వాళ్లతో మాట్లాడాల్సి వస్తే ఫేస్‌మాస్క్ ధరించాలి.
- చెప్పులు, బూట్లు వంటి పాదరక్షల్ని బయటే విడవాలి.
- పొగతాగడం, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.
- డయాబెటిస్ అదుపులో ఉంచుకోవాలి. డాక్టర్ల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకూడదు.

### ఫంగల్ వ్యాధుల్ని నివారించే తెల్లముల్లంగి!

**హెల్త్ టిప్**



తరచూ ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వస్తున్నాయా? ఆలస్యం వద్దు తెల్లముల్లంగితో వండిన పదార్థాలు ఎక్కువగా తింటూ ఉంటే... ఫంగల్ ఇన్ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. అంతేకాదు తేలిగ్గా నివారితమవుతాయి. దీనికి ఓ కారణం ఉంది. రెఫానస్ సెటైవస్ యాంటీఫంగల్ పెప్టైడ్–2 (సంక్షిప్తంగా ఆర్ఎస్ఏఎఫ్‌పీ–2) అనే ఓ ప్రోటీన్ కారణంగా తెల్లముల్లంగి ఫంగల్ వ్యాధుల్ని తేలిగ్గా నివారించగలుగుతుంది.

అంతేకాదు... ఇది మంచి డీ–టాక్సిఫైయర్ కావడంతో దేహంలో పేరుకుపోయిన విషపదార్థాలను బయటకు పంపుతుంది. తద్వారా కాలేయం ఆరోగ్యం చాలా బాగా మెరుగుపడుతుంది. కామెర్లతో బాధపడిన వాళ్లలో ఎర్ర రక్తకణాలు నాశనం కాకుండా కాపాడుతుంది. వాటిని కాపాడటమంటే పోషకాలు, ఆక్సిజన్ అందేలా చూసి ప్రతి కణాన్నీ కాపాడినట్టే. మామూలుగానైతే డయాబెటిస్‌తో బాధపడేవారు దుంపకూరల్ని తినకూడదంటారు. కానీ ముల్లంగిలోని పీచు చక్కెరను చాలా నెమ్మదిగా వెలువడేలా చేస్తుంది కాబట్టి ఇది డయాబెటిస్ ఉన్నవారికీ మేలు చేసే దుంపగా పేరుతెచ్చుకుంది.

కార్డియోమయోపతి!

# లక్షణాలు కనపడకుండానే గుండెజబ్బు రావచ్చా?


**కార్డియోమయోపతీ అనేది గుండె కండరాలకు సంబంధించిన వ్యాధి. మొదట్లో చాలామందిలో దీనికి సంబంధించి ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే చాలామందిలో ఇది ఆలస్యంగా బయటపడటం, కొందరిలో ప్రమాదకరమైన పరిస్థితికి తీసుకోవడం కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో కొన్ని కుటుంబాల్లో ఇది వంశపారపర్యంగా కనిపించవచ్చు. గుర్తించడం, చికిత్స అందించడంలో ఆలస్యం జరిగితే ప్రమాదకరంగా కూడా మారవచ్చు.**

**లక్షణాలు:** ఈ వ్యాధి చాలా నెమ్మదిగా ముదురుతూ పోవడం వల్ల మొదట్లో లక్షణాలు కనిపించవు. అటు తర్వాత కూడా క్రమక్రమంగా లక్షణాలు బయటపడుతుంటాయి. కానీ ఇంకొందరిలో మాత్రం సమస్య నిర్ధారణకు ముందునుంచే లక్షణాలు వ్యక్తమవుతుంటాయి.
● శ్వాస తీసుకోవడం కష్టం ఉండటం, తరచూ శ్వాస అందక విపరీతమైన ఆయాసం వస్తుండటం ● విపరీతమైన అలసట, ● పొట్ట – చీలమండ వాపు, కొంతమందిలో కాళ్లవాపు ● అరుదుగా ఒక్కోసారి స్పృహ తప్పవచ్చు.

**రకాలు :** కార్డియోమయోపతిలో ప్రధానంగా మూడు రకాలు ఉంటాయి. అవి డయలేటెడ్ కార్డియోమయోపతి, హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి, రెస్ట్రిక్టెడ్ కార్డియోమయోపతి.

వంశపారంపర్యంగా వచ్చే హైపర్‌ట్రోఫిక్ రకంలో గుండెకండరాలు, గుండెగోడలు మందంగా తయారవుతాయి. పైగా హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతిలో గుండె కండరాలు, గోడలు మందంగా మారడమన్నది రోగులందరిలోనూ ఒకేలా ఉండదు. ఈ తరహా కేసులు మొత్తం కార్డియోమయోపతిలో నాలుగు శాతం వరకు ఉంటాయి.

వంశపారంపర్యంగానే వచ్చే మరో రకమైన రెస్ట్రిక్టివ్ రకంలో గుండెగదుల్లో రక్తం భర్తీ అయ్యేందుకు అవసరమైన ఒత్తిడికి సంబంధించిన లోటు ఏర్పడుతుంది. ఈ తరహా కార్డియోమయోపతి కేసులు 1 శాతం ఉంటాయి.



**కారణాలు:** ● మద్యం అలవాటు ● వైరల్ ఇన్ఫెక్షన్‌లు ● నియంత్రణలో లేని అధిక రక్తపోటు (హైబీపీ), ● గుండె కవాటాలకు సంబంధించిన సమస్యలు దీనికి కారణమవుతాయి. అయితే అనువంశీకంగా (వంశపారంపర్యంగా) కొన్ని కుటుంబాల్లో కనిపించే కార్డియోమయోపతికి మాత్రం జన్యువుల్లో మార్పు (మ్యుటేషన్)లే కారణం. అలాంటప్పుడు తల్లిదండ్రుల్లో ఒకరికి డయలేటెడ్ కార్డియోమయోపతి ఉన్నట్లయితే పిల్లల్లో సగం మందికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయి.

**చికిత్స ఎలాగంటే...**

● కార్డియోమయోపతి కారణంగా గుండె కొట్టుకోవడంలో తీవ్రమైన హెచ్చుతగ్గులు, ఛాతీలో నొప్పి, రక్తం గడ్డకట్టడం వంటి మరికొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉండవచ్చు. అందుకే నిర్దిష్టంగా కాకుండా... పరిస్థితి తీవ్రత ఆధారంగా చికిత్స అందిస్తారు. గుండె ఏ మేరకు నష్టపోయింది, ఎలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయన్న అంశాల ఆధారంగా డాక్టర్లు చికిత్సను నిర్ణయిస్తారు. ● అధిక రక్తపోటు, గుండె స్పందనల్లో విపరీతమైన హెచ్చుతగ్గులను మందులతో అదుపు చేస్తారు. ● గుండెకొట్టుకోవడంలో అసాధారణ మార్పులను అదుపుచేయడానికి అవసరమైతే పేస్‌మేకర్ అమర్చుతారు. దాన్ని అమర్చడం ద్వారా గుండెస్పందనలు సజావుగా, లయబద్ధంగా జరిగేలా చూస్తారు. గుండెకొట్టుకోవడంలో ఇంకా ఏవైనా లోటుపాట్లు ప్రాణానికి ప్రమాదం తెచ్చేలా ఉంటే... వాటిని సరిచేసి ప్రాణాల్ని కాపాడటం కోసం ఐసీడీ పరికరాన్ని అమర్చుతారు. ● హైపోట్రోఫిక్, రెస్ట్రిక్టివ్ రకాల కార్డియోమయోపతిలో... అది ఏ రకమైనప్పటికీ చికిత్సలో ప్రధానంగా వ్యాధిలక్షణాలను అదుపు చేయడం, పేషెంట్ పరిస్థితి విషమించకుండా చూడటమే ప్రధానం.



డాక్టర్ హేమంత్ కౌకుంట్ల
సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్

# స్పోర్ట్స్



## ఆర్‌సీబీ కెప్టెన్‌గా స్మృతి మంధాన

వచ్చే నెలలో ముంబైలో జరిగే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు కెప్టెన్‌గా స్మృతి మంధానను నియమించారు. భారత జట్టు వైస్ కెప్టెన్ అయిన స్మృతిపై ఇటీవల జరిగిన వేలం కార్యక్రమంలో ఆర్‌సీబీ రూ. 3 కోట్ల 40 లక్షలు వెచ్చించి జట్టులోకి తీసుకుంది. స్మృతికి ఆర్‌సీబీ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పురుషుల ఐపీఎల్ టోర్నీలో ఆర్‌సీబీ కెప్టెన్‌గా ఉన్న డు ప్లెసిస్, మాజీ సారథి విరాట్ కోహ్లి ట్విటర్‌లో ప్రకటించడం విశేషం.

## ఫైనల్లో బోపన్న జోడీ

ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-4తో కెవిన్ క్రాయిట్జ్-టిమ్ పుయిట్జ్ (జర్మనీ) ద్వయంపై గెలుపొందింది. 67 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ఐదు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.



# మలుపు ఎటువైపు?

- స్పిన్‌తో ఆస్ట్రేలియా ఎదురుదాడి
- భారత్ 262 ఆలౌట్
- ఆదుకున్న అక్షర్ పటేల్, అశ్విన్
- ఆసీస్ 61/1
- రసవత్తరంగా రెండో టెస్టు

**మనం నమ్ముకున్న 'స్పిన్' మంత్రం మనకే బెడిసి కొట్టింది. రెండో రోజు ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను కూల్చేసింది. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు పరుగు ముందే టీమిండియా ఆలౌటైంది. అక్షర్ పటేల్, అశ్విన్ ఆదుకోకుంటే మాత్రం పరిస్థితి ఇంకాస్త క్లిష్టంగా ఉండేది. టాపార్డర్ నుంచి మిడిలార్డర్ దాకా ప్రధాన బ్యాటర్లను లయన్ తిప్పేస్తుంటే ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు.**



అక్షర్ పటేల్

లయన్

న్యూఢిల్లీ: ఎవరి ఊహకు అందనంతగా స్పిన్ తిరుగుతోంది. మ్యాచ్ అనూహ్య మలుపులు తిరుగుతోంది. రెండు రోజుల్లోనే 21 వికెట్లు కూలాయి. ఇందులో 16 వికెట్లు స్పిన్నర్లవే! ప్రత్యేకించి రెండో రోజు ఆటలో పడిన 11 వికెట్లలో 10 వికెట్లు స్పిన్నర్లే పడేశారు. దీంతో ఢిల్లీ టెస్టు రసవత్తరంగా మారింది. మిగిలిన మూడు రోజుల ఆటలో గెలుపు ఎటు మళ్లుతుందో చెప్పలేని స్థితి! టీమిండియాకు ఎదురులేని ఢిల్లీ కోటలో ఆస్ట్రేలియా 'స్పిన్'తో ప్రతిదాడి చేసింది. దీంతో రెండో రోజు ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 83.3 ఓవర్లలో 262 పరుగుల వద్ద ఆలౌటైంది. లోయర్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్ (115 బంతుల్లో 74; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో ఆదుకున్నాడు. ఆసీస్ స్పిన్నర్లలో లయన్ (5/67) చెలరేగాడు. కున్‌మన్, మర్ఫీలకు రెండేసి వికెట్లు దక్కాయి. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ కోల్పోయి 61 పరుగులు చేసింది.

**లయన్ ఉచ్చులో...**

ఓవర్‌నైట్ స్కోరు 21/0తో శనివారం ఆట కొనసాగించిన భారత్ 7 ఓవర్లపాటు బాగానే ఆడింది. కున్‌మన్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్ లాంగాన్‌లో భారీ సిక్సర్ బాదాడు. ఇక ఓపెనర్లు కుదురుకున్నట్లే అనుకుంటున్న తరుణంలో లయన్ బౌలింగ్‌కు దిగాడు. తన రెండు వరుస ఓవర్లలో టాపార్డర్‌ను ఎల్బీడబ్ల్యూగా దెబ్బ మీద దెబ్బ తీశాడు. ముందుగా రాహుల్ (17; 1 సిక్స్)ను బోల్తా కొట్టించిన లయన్ తన మరుసటి ఓవర్లో కెప్టెన్ రోహిత్ శర్మ (32; 2 ఫోర్లు), 100వ టెస్టు ఆడుతున్న పుజారా (0)లను పెవిలియన్ చేర్చాడు. ఇంకో ఓవర్లో అయ్యర్ (4) ఆట ముగించడంతో భారత్ 66 పరుగులకే 4 ప్రధాన వికెట్లను కోల్పోయింది. కోహ్లి క్రీజులో ఉండటమే జట్టుకు కాస్త ఊరట కాగా 88/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగిసింది.

**అక్షర్ వీరోచితం**

లంచ్ తర్వాత కోహ్లి, జడేజా జాగ్రత్తగా ఆడటంతో భారత్ వంద పరుగులు పూర్తి చేసుకుంది. అనంతరం స్పిన్నర్లు మర్ఫీ, కున్‌మన్ కలిసి భారత్‌ను పెద్ద దెబ్బే కొట్టారు. జడేజా (26; 4 ఫోర్లు)ను మర్ఫీ, కోహ్లి (44; 4 ఫోర్లు)ని కున్‌మన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నారు. శ్రీకర్ భరత్ (6) లయన్ ఉచ్చులో చిక్కాడు. 139/7 స్కోరు వద్ద భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే అశ్విన్ (37; 5 ఫోర్లు) అండతో అక్షర్ జట్టును ఒడ్డున పడేశాడు. అక్షర్ 94 బంతుల్లో (6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీ సాధించాడు. దీంతో టీమిండియా... ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు దాకా వెళ్లగలిగింది.

### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 263; **భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (బి) లయన్ 32; రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 17; పుజారా (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 0; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) కున్‌మన్ 44; అయ్యర్ (సి) హ్యాండ్స్‌కాంబ్ (బి) లయన్ 4; జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 26; శ్రీకర్ భరత్ (సి) స్మిత్ (బి) లయన్ 6; అక్షర్ (సి) కమిన్స్ (బి) మర్ఫీ 74; అశ్విన్ (సి) రెన్‌షా (బి) కమిన్స్ 37; షమీ (బి) కున్‌మన్ 2; సిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (83.3 ఓవర్లలో ఆలౌట్) 262. వికెట్ల పతనం:** 1-46, 2-53, 3-54, 4-66, 5-125, 6-135, 7-139, 8-253, 9-259, 10-262. **బౌలింగ్:** కమిన్స్ 13-2-41-1, కున్‌మన్ 21.3-4-72-2, లయన్ 29-5-67-5, మర్ఫీ 18-2-53-2, హెడ్ 2-0-10-0.

**ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** ఖాజా (సి) అయ్యర్ (బి) జడేజా 6; హెడ్ (బ్యాటింగ్) 39; లబుషేన్ బ్యాటింగ్ 16; **మొత్తం (12 ఓవర్లలో వికెట్ నష్టానికి) 61. వికెట్ల పతనం:** 1-23. **బౌలింగ్:** అశ్విన్ 6-1-26-0, షమీ 2-0-10-0, జడేజా 3-0-23-1, అక్షర్ 1-0-2-0.

### వార్నర్ కన్‌కషన్

ఆసీస్ స్టార్ ఓపెనర్ వార్నర్ రెండో టెస్టు మిగతా ఆటకు దూరమయ్యాడు. తొలిరోజు ఆటలోనే సిరాజ్ పదో ఓవర్లో వార్నర్ మోచేతికి గాయమైంది. కాసేపు ఫిజియో సేవలతో బ్యాటింగ్ చేశాడు. అయితే గాయం తీవ్రత దృష్ట్యా టెస్టు నుంచి తప్పుకోగా... కన్‌కషన్ (ఆటలో గాయమైతేనే) సబ్‌స్టిట్యూట్‌గా రెన్‌షాను తీసుకున్నారు. మూడో టెస్టుకల్లా వార్నర్ కోలుకునేది అనుమానంగానే ఉంది.

## భారత్‌కు కాంస్యం



దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు కాంస్య పతకం లభించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 2-3తో చైనా చేతిలో పోరాడి ఓడిపోయింది. భారత స్టార్స్ ప్రణయ్, పీవీ సింధు తమకంటే తక్కువ ర్యాంక్ ఉన్న ప్లేయర్ల చేతిలో ఓడిపోవడం భారత్‌ను దెబ్బ తీసింది. తొలి మ్యాచ్‌లో 9వ ర్యాంకర్ ప్రణయ్ 13-21, 15-21తో 121వ ర్యాంకర్ లె లాన్ జీ (చైనా) చేతిలో... రెండో మ్యాచ్‌లో 9వ ర్యాంకర్ పీవీ సింధు 9-21, 21-16, 18-21తో 101వ ర్యాంకర్ గావో ఫాంగ్ జీ (చైనా) చేతిలో ఓడిపోవడంతో భారత్ 0-2తో వెనుకబడింది. అయితే మూడో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-చిరాగ్ శెట్టి జోడీ 21-19, 21-19తో హి జి టింగ్-జౌ హావో డాంగ్ ద్వయంపై... నాలుగో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-18, 13-21, 21-19తో లియు షెంగ్ షు-తాన్ నింగ్ ద్వయంపై నెగ్గడంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ఇషాన్-తనీషా ద్వయం 17-21, 13-21తో జియాన్ జాంగ్ బాంగ్-వె యా జిన్ జోడీ చేతిలో ఓడిపోవడంతో భారత్ కాంస్యంతో సంతృప్తి పడింది.

## హైదరాబాద్ ఎఫ్‌సీ ఓటమి

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు అనూహ్య ఓటమి ఎదురైంది. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీతో శనివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 2-3 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. జంషెడ్‌పూర్ తరఫున రిత్విక్ దాస్ (22వ ని.లో), జే ఇమ్మాన్యుయెల్ థామస్ (27వ ని.లో), డానియల్ చుక్వు (29వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... హైదరాబాద్ తరఫున ఒగ్‌బెచె (12వ, 79వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు.

## బ్లాక్‌హాక్స్ విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు మూడో విజయం నమోదు చేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 10-15, 15-14, 15-9, 12-15, 15-11తో చెన్నై బ్లిట్జ్ జట్టును ఓడించింది.

# రేణుక, స్మృతి మెరుపులు వృథా

- ఇంగ్లండ్ చేతిలో భారత్ పరాజయం
- రేపు ఐర్లాండ్‌తో చివరి మ్యాచ్



స్మృతి



రేణుక

కెబేహ (దక్షిణాఫ్రికా): మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత జోరుకు ఇంగ్లండ్ బ్రేకులేసింది. గ్రూప్-2లో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 11 పరుగుల తేడాతో ఓడింది. ఇంగ్లండ్ ఈ మెగా టోర్నీలో 'హ్యాట్రిక్' విజయాలతో సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 151 పరుగులు చేసింది. రేణుకా సింగ్ (4-0-15-5) అద్భుతమైన బౌలింగ్‌తో టాపార్డర్ బ్యాటర్లు సోఫియా (10), వ్యాట్ (0), అలైస్ క్యాప్సీ (2)లను బెంబేలెత్తించింది. సీవర్ బ్రంట్ (42 బంతుల్లో 50; 5 ఫోర్లు), ఆఖర్లో అమీ జోన్స్ (27 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో ఇంగ్లండ్ పోరాడే లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 140 పరుగులే చేసింది. ఆరంభంలో ఓపెనర్ స్మృతి మంధాన (41 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్), ఆఖరిదాకా రిచా ఘోష్ (34 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు. కానీ మిగతా బ్యాటర్లు షఫాలీ (8), జెమీమా (13), హర్మన్‌ప్రీత్ (4), దీప్తి శర్మ (7)ల వైఫల్యంతో జట్టు ఓడింది. నేడు వెస్టిండీస్ చేతిలో పాకిస్తాన్ ఓడిపోయి... రేపు ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై గెలిస్తేనే భారత్ ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా సెమీస్ చేరుతుంది. వెస్టిండీస్, ఇంగ్లండ్ జట్లపై పాక్ గెలిచి... ఐర్లాండ్‌ను భారత్ కూడా ఓడిస్తే... భారత్, ఇంగ్లండ్, పాక్ ఆరు పాయింట్లతో సమఉజ్జీగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు సెమీస్ చేరుకుంటాయి.

### స్కోరు వివరాలు

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** సోఫియా (బి) రేణుక 10; వ్యాట్ (సి) రిచా (బి) రేణుక 0; అలైస్ (బి) రేణుక 3; సీవర్ బ్రంట్ (సి) స్మృతి (బి) దీప్తి 50; హీథెర్ (సి) షఫాలీ (బి) శిఖా 28; అమీ జోన్స్ (సి) రిచా (బి) రేణుక 40; ఎకిల్‌స్టోన్ (నాటౌట్) 11; కేథరిన్ (సి) రాధ (బి) రేణుక 0; సారా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 151. వికెట్ల పతనం:** 1-1, 2-10, 3-29, 4-80, 5-120, 6-147, 7-147. **బౌలింగ్:** రేణుక సింగ్ ఠాకూర్ 4-0-15-5, శిఖా పాండే 4-0-20-1, పూజ వస్త్రకర్ 2-0-24-0, దీప్తి శర్మ 4-0-37-1, రాజేశ్వరి గైక్వాడ్ 1-0-12-0, షఫాలీ 1-0-11-0, రాధ 4-0- 27-0. **భారత్ ఇన్నింగ్స్:** స్మృతి (సి) సీవర్ (బి) సారా 52; షఫాలీ (సి) బ్రంట్ (బి) బెల్ 8, జెమీమా (సి) బ్రంట్ (బి) సారా 13; హర్మన్‌ప్రీత్ (సి) అలైస్ (బి) ఎకిల్‌స్టోన్ 4; రిచా (నాటౌట్) 47; దీప్తి (రనౌట్) 7; పూజ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 140. వికెట్ల పతనం:** 1-29, 2-57, 3-62, 4-105, 5-119. **బౌలింగ్:** కేథరిన్ 3-0-39-0, బెల్ 4-0-22-1, చార్లీ 3-0-23-0, ఎకిల్‌స్టోన్ 4-0-14-1, సారా 4-0-27-2, బ్రంట్ 2-0-15-0.

## పట్టు బిగించిన సౌరాష్ట్ర

కోల్‌కతా: బెంగాల్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌పై సౌరాష్ట్ర పట్టు బిగించింది. 230 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 169 పరుగులు చేసింది. బెంగాల్ మరో 61 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 404 పరుగుల వద్ద ఆలౌటైంది.

## విజయం దిశగా ఇంగ్లండ్

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం దిశగా సాగుతోంది. 394 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 63 పరుగులు చేసింది. న్యూజిలాండ్ గెలవాలంటే మరో 331 పరుగులు చేయాలి. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 374 పరుగులకు ఆలౌటైంది.

# సినిమా




# మహా జోరు

**మహా శివరాత్రి సందర్భంగా టాలీవుడ్ జోరుగా హుషారుగా మహా అప్‌డేట్స్ ఇచ్చింది. ఆ విశేషాలు తెలుసుకుందాం...**

వెండితెర భోళా శంకరుడిగా దుష్టులపై శివతాండవం చేస్తున్నారు చిరంజీవి. మెహర్ రమేష్ దర్శకత్వంలో చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా తమన్నా, ఆయనకు చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'భోళా శంకర్'లోని చిరంజీవి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతదర్శకుడు. ఏప్రిల్ 14న 'భోళా శంకర్'ని విడుదల చేయాలనుకుంటున్నారు. మరోవైపు పండగ రోజున 'నేను ప్యార్‌లోన పాగలే..' అంటూ 'రావణాసుర' చిత్రం కోసం పాట పాడారు రవితేజ. పబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా, స్వయంగా రవితేజ పాడటం విశేషం. సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ డైరెక్టర్. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా, హీరో సుశాంత్ కీ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఇక సంక్రాంతికి థియేటర్స్‌లోకి వస్తానన్న విషయాన్ని శివరాత్రి రోజున వెల్లడించారు ప్రభాస్. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'ప్రాజెక్ట్ కె' చిత్రం రూపొందుతున్న సంగతి తెలి సిందే. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీ రోల్స్ చేస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. అలాగే శివరాత్రి రోజునే 'రామబాణం' ఫస్ట్ లుక్‌ను వదిలారు గోపీచంద్. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత మూడోసారి హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'రామబాణం'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రంలో డింపుల్ హయతి హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, ఖుష్బూ కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో రిలీజ్ కానుంది. ఇక త్వరలోనే మ్యూజిక్ బ్లాస్ట్ ఉంటుందంటున్నారు 'ఏజెంట్'. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఏజెంట్'. సాక్షి వైద్య హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ ప్రముఖ హీరో మమ్ముట్టి ఓ కీ రోల్ చేస్తున్నారు. కాగా 'ఏజెంట్' ఆడియోను త్వరలోనే విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు మేకర్స్. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమాస్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రం ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది.

ఇవే కాదు.. అల్లరి నరేశ్ 'ఉగ్రం', సాయిధరమ్ 'విరూపాక్ష', సందీప్ కిషన్ 'ఊరు పేరు భైరవకోన'తో పాటు మరికొన్ని చిత్ర బృందాలు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపాయి.

## పోస్టర్ బాగుంది

**- నాగార్జున**

''ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ అందర్నీ ఆకట్టుకునేలా బాగుంది. ఈ సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అన్నారు అక్కినేని నాగార్జున. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో తేజ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా బొమ్మదేవర రామచంద్ర రావు దర్శక-నిర్మాణ సారథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నాగార్జున రిలీజ్ చేశారు. ''ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బాడిస, కెమెరా: వాసు.



తేజ, నాగార్జున, రామచంద్ర రావు

## కొత్త కాన్సెప్ట్‌లా ఉంది

**- దర్శక-నిర్మాత యం.ఎస్. రాజు**

దివంగత ప్రముఖ నటి-దర్శకురాలు విజయ నిర్మల మనవడు శరణ్ కుమార్ (నరేశ్ కజిన్ రాజ్ కుమార్ కొడుకు) హీరోగా రూపొందిన చిత్రం 'మిస్టర్ కింగ్'. శశిధర్ చావలి దర్శకత్వంలో బీఎస్ రావు నిర్మించారు. యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్ కథా నాయికలు. ఈ నెల 24న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అతిథిగా పాల్గొన్న దర్శక-నిర్మాత ఎంఎస్ రాజు మాట్లాడుతూ - ''ట్రైలర్ ప్రామిసింగ్‌గా వుంది. కొత్త కాన్సెప్ట్‌తో సినిమాని రూపొందించారనిపిస్తోంది'' అన్నారు. ''మా అల్లుడు శరణ్ హీరోగా పరిచయమవుతున్నాడు. సూపర్‌స్టార్ కృష్ణ, విజయ నిర్మలగార్ల ఆశీస్సులు ఉంటాయి'' అన్నారు నరేష్. ''ఈ చిత్రంలో బలమైన పాత్ర చేశాను'' అన్నారు శరణ్. ''ఆత్మాభిమానం వున్న ఓ అబ్బాయి కథ ఇది'' అన్నారు శశిధర్. ''సినిమా అద్భుతంగా వచ్చింది'' అన్నారు బీఎస్ రావు.



యం.ఎస్.రాజా, నరేష్, శరణ్‌కుమార్

## మాఫియాగా మారింది


**- సి. కల్యాణ్**



''నిర్మాతల మండలిలో 1200 మంది సభ్యులు ఉన్నారు. కానీ ప్రొడ్యూసర్స్ గిల్డ్‌లో 27 మంది సభ్యులు ఉన్నారు. ప్రొడ్యూసర్స్ గిల్డ్ మాఫియాగా మారింది. గుత్తాధిపత్యం వల్ల పరిశ్రమ నాశనమవుతోంది'' అని నిర్మాత సి. కల్యాణ్ ఆరోపణలు చేశారు. నేడు నిర్మాతల మండలి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కల్యాణ్ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ - ''అందరూ ఒకే తాటిపై ఉండాలని ఆరంభం అయిన ఆర్గనైజేషన్ చిన్నగా ఎల్ఎల్‌పీగా మారి అది కాస్తా 'గిల్డ్'గా మారింది. గిల్డ్ ఏంటి? ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఏంటి? రెండింటినీ కలిపేయొచ్చు కదా అని చాలా మంది అంటున్నారు. కలపడానికి మేం చేస్తున్న ప్రయత్నాన్ని కొందరు అడ్డుకుంటున్నారు. ఇక్కడంతా మోనోపలి అయ్యింది. వారే హీరోలు, వారే డిస్ట్రిబ్యూటర్స్, వారివే థియేటర్స్.. ఇలా ఇండస్ట్రీని శాశిస్తున్నారు. కల్యాణ్ లీడ్ చేస్తే మంచే జరుగుతుంది అనే నమ్మకం కలిగితే మా ప్యానల్‌కు ఓటు వెయ్యండి'' అన్నారు. కాగా ఈ ఎన్నికల్లో కల్యాణ్ పోటీపడటంలేదు. నిర్మాతల మండలి తరఫున అధ్యక్ష పదవికి పి. కిరణ్ పోటీలో ఉన్నారు.

ఈ ఎన్నికలపై 'దిల్' రాజు స్పందిస్తూ - ''ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న నిర్మాతలు ఉన్న 'ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్'ని గెలిపించాలని కోరుతున్నాను'' అన్నారు. ఈ ప్యానెల్ తరఫున అధ్యక్షుడిగా దామోదర ప్రసాద్ పోటీ చేస్తున్నారు.

## పొలిమేరలో...



రాజేష్, కామాక్షి

సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, బాలాదిత్య, రవి వర్మ, చిత్రం శ్రీను, అక్షత శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో ఓ చిత్రం రూపొందింది. 'మా ఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మించారు. పల్లెటూరి నేపథ్యంలో, ఊరి పొలిమేర చుట్టూ సాగే కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతం : గ్యాని, కెమెరా: ఖుషేందర్ రమేష్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.సి. సతీష్ కుమార్.

## వాస్తవంతో...



శ్రుతి ధాంగే

శ్రుతి ధాంగే ప్రధాన పాత్రధారిగా, సత్యప్రకాష్, ఆనంద్ రాజ్ ఇతర ముఖ్య తారాగాణంగా నటించిన చిత్రం 'వీరఖడ్గం'. ఎంఏ చౌదరి దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు నిర్మించిన ఈ రివెంజ్ బ్యాక్‌డ్రాప్ చిత్రం మార్చి మొదటి వారంలో రిలీజ్ కానుంది. ''వాస్తవాన్ని వెంటాడుతూ గతం చేసిన యుద్ధమే ఈ 'వీరఖడ్గం' చిత్రం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. బ్రహ్మానందం, మదన్, తపస్వి, అపూర్వ పృథ్వీరాజ్ కీ రోల్స్ చేసిన ఈ చిత్రానికి సంగీతం: షయాక్ పార్వాజ్, మాటలు: ఘటికాచలం, లైన్‌ప్రొడ్యూసర్: మారిశెట్టి సునీల్‌కుమార్.

## సీక్వెల్ ఆలోచన లేదు

**- దర్శకుడు వెంకీ అట్లూరి**



''సార్' సినిమాకు తల్లిదండ్రులు, విద్యార్థులు ఎమోషనల్‌గా బాగా కనెక్ట్ అవుతారు. ఈ సినిమా చూసిన తర్వాత విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో అర్థం అవుతుంది. మనసున్న ప్రతి మనిషికీ 'సార్' సినిమా నచ్చుతుంది'' అన్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ధనుష్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలైంది. 'సార్' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రదర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ- ''చదువు అనేది నిత్యావసరం. అందుకే 'సార్' సినిమా బ్యాక్‌డ్రాప్ 1990 అయినప్పటికీ ఇప్పటి ఆడియన్స్ కూడా కనెక్ట్ అవుతారనిపించింది. ధనుష్‌గారికి మా నిర్మాత 'సార్' కథ చెప్పమనగానే హ్యాపీ ఫీలయ్యాను. కథ విన్నాక ధనుష్‌గారు చప్పట్లు కొట్టి, కాల్షీట్స్ ఎప్పుడు కావాలని అడగటంతో ఇంకా హ్యాపీ ఫీలయ్యాను. ఇందులో తండ్రీకొడుకుల మధ్య మంచి సీన్ ఉంటుంది. అది త్రివిక్రమ్‌గారితో జరిపిన సంభాషణల నుంచే పుట్టింది. 'సార్' యూనివర్సల్ సబ్జెక్ట్. తమిళంలోనూ మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రానికి సీక్వెల్ ఆలోచన లేదు. ఇక నుంచి నా ప్రతి సినిమాకీ వైవిధ్యం చూపించడంతో పాటు విభిన్న జోనర్లలో చిత్రాలు చేస్తాను'' అన్నారు.

## హీరామండిలో...

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించిన తొలి వెబ్ సిరీస్ 'హీరామండి'. మనీషా కొయిరాల, సోనాక్షీ సిన్హా, అదితీ రావ్ హైదరీ, రిచా చద్దా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ఫస్ట్ గ్లింప్స్‌ను శనివారం విడుదల చేశారు. లాహోర్ బ్యాక్‌డ్రాప్‌లో ఒకప్పటి వేశ్యల జీవితాల ఆధారంగా ఈ సిరీస్‌ను రూపొందించారు. త్వరలో స్ట్రీమింగ్ కానుంది.



## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## వధువు కావలెను



ముదిరాజ్ / M.Tech / C.Govt.స్టేషన్ మాస్టర్ / రైల్వేస్ / 80,000/-PM / 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10316]

కుమ్మరి/కట్న ప్రసక్తి లేదు/CA/చార్టర్డ్ అకౌంటెంట్/8.5 Lakhs P/A/5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10316]

క్రిస్టియన్ మాల/B.Tech/IT / C.Govt. ఇంజినీర్/BHEL / 1 Lakhs PM / "6" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10316]

లంబాడి/M.Tech / Govt.Asst.ఇంజినీర్ /ఎలక్ట్రికల్ Dept / 86,000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-10316]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/ C.Govt. Sr. అసోసియేట్/SBI బ్యాంక్/60,000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10316]

ఎరుకుల/ST, 46 సం॥, బిజినెస్, రెండవ పెళ్లి వరునికి , పిల్లలు, ఏ బాధరబందీలేని మిడిల్ క్లాస్ వధువు కావలెను. వయస్సు: 36-46, కట్నప్రసక్తిలేదు, నో బ్రోకర్స్. Ph: 9948605439 [HA-13867]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech, MBA/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/ 65,000/-pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529, 9912280929 [HA-13863]

యాదవ/M.Tech, (IT)/ C.Govt. Sr. ఇంజినీర్/రైల్వే/86,000/-pm /5'9"ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 9515755529 [HA-13863]

నాయీబ్రాహ్మణ / B.Tech / C.Govt. Asst. మేనేజర్ / FCI/ 78,000/-pm/ 5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-13863]

2వ పెళ్లి/B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ ఇరిగేషన్ Dept./ 80,000/-pm/ 5'10" ఎత్తు/32 సం॥ల వరునికి వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 9963757612 [HA-13863]

మహేష్, హిందూ, బలిజ/30/5'7"/ CA, B.Com/ 14L Pa/ బలిజ కులంలో మంచి వధువు కావాలి. కాల్: 9590188558 [HA-54566]

36 సం॥ల బిజినెస్ మ్యాన్‌కి సెకండ్ మ్యారేజ్, కుల ప్రసక్తిలేని వరుడికి సెకండ్ మ్యారేజ్/విడో, పిల్లలు ఉన్న వారు అయినా సంప్ర నో చౌరీ Hyd సంప్ర: 6304070671 [H-793371]

SC మాల/క్రిస్టియన్/కట్నప్రసక్తి లేదు/ 28y/5'10"/B.Tech(Civil) Asst. Commercial Tax Officer (ACTO) 90,000/-PM గల వరునికి తగిన వధువు కావలెను. Ph: 8978880072 [H-796858]

గౌడ్స్/33yrs/5'7" / B.Tech / కలర్: Fair/సాఫ్ట్‌వేర్ జాబ్/80K per Month. వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. No Caste bar. Ph: 85004 27582 [H-793707]

SC మాల/కుల, కట్న ప్రసక్తి లేదు/లేట్/45y/ 5'11"/ B.Tech/MBA/LLB(Ph.D)/40K PM/కొంచెం శరీరక వైకల్యం కాలు Hydలో స్థిరపడిన వరునికి 1st & 2nd మ్యాచ్ వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్: 7702438915 [H-793707]

కాపు / కుల పట్టింపు లేదు / 62 సం॥ Govt. Officer Retd. వరుడుకి 55 సం॥ పైబడిన వెల్‌సెటిల్డ్ వధువు కావలెను. నో బ్రోకర్స్. 78459 06925 [B-1868]

Keralite Divorcee, well settled Nair, 40 Yrs Looking for bride around 30 Yrs from decent family. Caste no bar, 2nd Marriage accepted. Ph: 8639033316. [HA-13867]

★

రెడ్డి కుటుంబానికి చెందిన 37 ఏళ్ల అబ్బాయి హైదరాబాద్ (న్యూ సిటీ) MBBS MD (డాక్టర్) తగిన మ్యాచ్ కోసం వెతుకుతున్నాడు. (080-69070619) [HA-9493]

35 ఏళ్ల అబ్బాయి బి.కామ్ చదివాడు, విడాకులు తీసుకున్న అమ్మాయి కోసం చూస్తున్నాడు. (Caste no bar) (080-69070619) [HA-9491]

SC MALA / Hindu/ 2nd Marriage/ 38/5'10"/ PG/ SWE/ 1lakh P/M/Seeks Good Looking Bride (urgently) No Brokers Cont: 8187861989 [H-796859]

★★

రెడ్డి /2వ పెళ్లి / 43 సం॥ / 5.4" / మంత్లీ ఇన్‌కమ్ రూ. 60,000 / 17 సం. పాప & 14 సం॥ బాబు ఉన్న అందమైన వరునికి, 35-42 సం॥ వధువు కావలెను. డైరెక్ట్ : 8885888762. [A-413]

వీరశైవలింగాయత్/38 సం.లు/ఎ.5.4 / Govt Contract Job/ నె.జీ: 20,000/- వరునికి/ కుల, కట్న చదువు ప్రసక్తి లేని 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలున్నా సరే. సెల్:79937 50326 [L-794333]

36/5.4/B.Tech/Software Employee/ 18 LPA. 1.1.40 PM Any 1st and 2nd అందమైన అమ్మాయి తోడుకు కావలెను. Direct Contact : 90597 78982 [L-794336]

రిటైర్డ్ ప్రొ॥ Now Govt. సర్వీస్ 1L PM, 65Y ఏ బాధ్యతలు లేని వ్యక్తి కి 55సం॥పైబడి ఏబాధ్యతలు లేని O.C వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ ✆ 80746 96179, 79950 45904. [O-786978]

క్రిస్టియన్ మాల/MCA/ 32Y, IT ఉద్యోగి, 2లక్షలు-pm,హైట్:5.7/వరుడుకి వధువు కావాలి / నెల్లూరు ఫ్యామిలీ ప్రిఫర్డ్ / నోబ్రోకర్లు, డైరెక్ట్ : 90663 66214. [N-5320]

Direct: కోనసీమ కాపు/ 36, 5'6" వరుడికి రాజకీయ వృత్తి ఇష్టం ఉన్న గొప్ప వధువు కావలెను. Ph: 9113679022 [WB-50953]

## వరుడు కావలెను



విశ్వబ్రాహ్మణ్/ఏకైక కుమార్తె / B.Tech/ Govt.Asst. ఎగ్రి॥ఇంజినీర్/ఇరిగేషన్ Dept/ 50,000/-PM/5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10316]

గౌడ/80 లక్షల ఆస్తి/M.Sc/Govt. Jr. Asst/ఫారెస్ట్ Dept/42,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10316]

వడ్డెర/50 లక్షల ఆస్తి/B.Tech/C. Govt. P.O/SBI బ్యాంక్ / 50,000/-PM / 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10316]

SC హిందు మాల/ఏకైక కుమార్తె/B.Tech/ Govt.ల్యాండ్ సర్వేయర్/రెవెన్యూ Dept/ 45,000/-PM /5'6"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10316]

SC హిందు మాదిగ/M.Sc/Agri/ Govt. AEO/అగ్రికల్చర్ Dept/52,000/-PM / 5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10316]

2వ పెళ్లి/ విడో / 46y / District Auditing Officer/ 1L P/M Own విల్లా/ 12 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీగల వెల్‌సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8885985513 [H-796858]

వైశ్య/ విడో/48yr/ Govt Job VRS/50K P/M/ Own Business, Own House(Rents) కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 9177631661 [H-796858]

రెండవపెళ్ళి/విడో /55y/ ఒంగోలు / Govt Job/ 90,000/- PM / Own House Rents/ Well Settled ఏ భాదర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను Ph: 8519803423 [H-796858]

## అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి )

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

### వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 6', Developer, H1, 150 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5' 8", Sr Analyst, 30.3 L P/A, 5 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE, MS, 30, 6', SWE, 250 K, 30 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 6', Manager, 18 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

### వరుడు కావలెను

రెడ్డి Bengaluru, MTech IIIT, 26, 5' 3", SWE, 25L P/A, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 28, 5' 7", Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 4", Engineer, H1, 200 K, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 28, 5'3", SAP Consultant, 20 L P/A, Hyd, 10 Cr. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి BE, M.Tech IIT, MS, 29, 6', 293 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 30, 5' 7", SWE, 20 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 11", Doctor, Hyd, Rich, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, M.Tech IIT, MS, 28, 5' 7", 300 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MA, 28, 5' 2", 230 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 4", SWE, 200 K, 2 Crores, USA, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 26, 5' 3", Doctor, Rich, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Motati, BE, 25, 5' 6", 64 L P/A, Hyd, Very Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి వధువులు అన్ని వయస్సుల సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, జాబ్స్, లోకల్, విదేశీ, మొదటి, అలస్య, రెండవ పెళ్లి సంబంధాలు కలవు. కాల్: 6304826162 (మీ నమ్మకమైన Match Expert) [HA-13867]

బ్రాహ్మణ / 25/5'3" / ఇంటర్ "28/5'3"B.Sc "28/5'4"/BBM "27/5'2"హోటల్ మేనేజ్‌మెంట్ వధువులకు వరులు కావలెను. కట్నప్రసక్తిలేని వారు సంప్ర. జాబ్/ పురోహితం అయినా Ok. Ph: 7893005879. [HA-13863]

క్రిస్టియన్ మాల / B.Tech / SWE/ 40,000/-pm / 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7396369922 [HA-13863]

SC మాల/ఏకైక కుమార్తె/M.Sc/ Govt. Jr. Asst./ R&B Dept./ 40,000/-pm/ 5'3" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8897389698 [HA-13863]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI/ 65,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9676995093 [HA-13863]

వడ్డెర/B.Sc-Agri/Govt. అగ్రికల్చర్ ఆఫీసర్/ 45,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13863]

బ్రాహ్మణ/25/5'3"/ ఇంటర్ "28/5'2"B.Sc "30/5'3"/ఇంటర్ "27/5'3"MBA వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్ Ok. పురోహితులకు కూడా సం॥ధాలు కలవు. Ph: 7815999246 [HA-13863]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/35yrs/MBA/సెంట్రల్ Govt ఆఫీసర్/3 లక్షలు (PM) / 15 కోట్ల ఆస్తి గల పిల్లలులేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK) సంప్రదించండి: 7396213324 [H-793371]

రెడ్డి/49yr/5'5"/కుల పట్టింపు లేదు/ఫెయిర్/PG/ Govt.ఎంప్లాయ్/86K(PM)/వెల్ సెటిల్డ్/బిజినెస్ & సొంత ఇల్లు/సొంత ఫ్లాట్స్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [H-793371]

వైశ్య/54y / విడో / 5'4"/Housewife / 20 ఎకరాల పొలం/సొంత ఇల్లు+రెంట్స్ ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. (పిల్లలు లేరు) సంప్ర: 9515939479 [H-793371]

రెడ్డి/58y/విడో/తెల్లని ఛాయ/ప్రభుత్వ రిటైర్డ్/Own House గల పిల్లలు లేని వధువుకి కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. సంప్ర: 9063346856 [H-793371]

No Caste bar, 1, 2వ, 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే. P:W: 7794960803 [H-796806]

కాపు/ 59yrs/5'2"/MBA/ కలర్: Fair/ Govt. జాబ్/65K Per Month. ఇల్లరికం అయినా OK వధువుకి వరుడు కావలెను. No Caste Bar. Ph: 79958 25318 [H-793707]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్. * 29yrs/ 5'4"/ డిగ్రీ/అందమైన వధువులకు వరులు కావలెను/రిటైర్/Pvt, Govt. జాబ్ & పురోహితం అయినా OK. Ph: 6301 953 980 [H-793707]

FC/విడో/60y/5'4"Fair/సొంత ఇల్లు & రెంట్స్/ వ్యవసాయ భూములు గల ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. Ph: 8297484478 [H-793707]

★

హైదరాబాద్‌కు చెందిన 28 ఏళ్ల డాక్టర్ చాలా సంపన్న కుటుంబానికి చెందిన అందమైన అమ్మాయి తగిన జోడి కోసం వెతుకుతోంది (080-69070621). [HA-9492]

SC మాల హిందు/డైవర్సీ/37 సం.లు, సెంట్రల్ గవర్నమెంట్ టీచర్ సెటిల్డ్ వధువుకు తగిన గవర్నమెంట్ టీచర్ గవర్నమెంట్ లెక్చరర్ గల వరుడు కావలెను. డైరెక్ట్. 7013362957 [HA-13817]

★★

రెడ్డి/విడో/50Y/5'3"/ఒంగోలులో సొంత ఫ్లాట్లు/ Hydలో/సొంత బిజినెస్ రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికంOK)(నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [HA-28852]

క్రైస్తవ/మాల/ప్రభుత్వ టీచర్/B.Sc.,B.Ed/41/ 5'2"/Fair/ డైవర్సీ వధువుకు క్రైస్తవ వరుడు కావలెను. తూ॥గో॥/ప॥గో॥ వారికి ప్రాముఖ్యత/ వారి బయోడేటా/ఫోటోతో వాట్సాప్ 99897 70090 నకు పంపగలరు. నో ఫోన్ కాల్స్. [R-388]

Direct. Konaseema Kapu, 32, 5'4", BA seeks tall educated rich husband below 50. Ph: 9113679022 [WB-50521]

## వేదికలు



సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. Ph: 8555980066 / 6302543297 [H-796858]

నిఖిల్ గౌడ్స్ మ్యారేజి బ్యూరో, ఓన్లీ గౌడ్స్/శెట్టి బలిజ/దేశ/విదేశ/1వ/2వ/Engg./డా॥/ పిజీ /డిగ్రీ గౌడ వధూవరులకై. Opp. ఆకృతి టౌన్‌షిప్, బోడుప్పల్. Ph: 9848041335/ 9848371924 [HA-13867]

విశ్వబ్రాహ్మణ పెళ్లి సంబంధాలు కోసం కాల్: 99856 08686 అన్ని ప్రాంతాల Matchesని మంచి సర్వీస్‌తో సెట్ చేయబడును. (33 సం॥ల ప్రైవేట్ జాబ్ అబ్బాయికి వధువు కావాలి). [HA-13867]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM / Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ 5,వాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-793278]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com ✆ 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధృవ మ్యారేజస్. 9949395407 [H-787368]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-10303]

★

మాదిగ వివాహ పరిచయవేదిక. ప్రతి శని, ఆదివారాలు, 12-6PM, ముందుగా మీ ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి. # సికింద్రాబాద్ స్టేషన్, బ్లూసల్ బ్యాక్. 9347046175 [H-793265]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యవైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704658103/ 9533608887 (Whatsapp No.) [HA-863]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-906]

V.R.Reddy Marriage Bureau U.S.A & Local Matches Proposals For Rich Families Fast settlement. Ph: 9581725589 Email: ramanaNarsingi@gmail.com (Send Bio-data) [H-779943]

★★

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-792976]

35సం॥ నుండి 45 సం॥ మధ్య వయసు గల ఒంటరి, విడోలు మరియు విడాకులు పొందిన స్త్రీ/పురుషులకు కులం, కట్నం, మతం ప్రసక్తిలేని అభ్యుదయ భావాలు కలిగిన ఆదర్శ వివాహ సంబంధాలు ఉచితముగా చూడబడును. ఈ సేవ ప్రస్తుతం ఉన్న వివాహ వేదికల శైలికి భిన్నమైనది. కావున సంప్రదించాలనుకున్నవారు తప్పని సరిగా పై నిబంధనలు పాటించి, తమ ప్రొఫైల్ వివరాలను మా యొక్క వాట్సప్ నెంబరు ✆ 85230 53468 కు పంపగలరు అని మనవి. [O-786998]

Kalyani Matrimony : కాపు, కమ్మ, గౌడ, బ్రాహ్మిణ, వెలమ, వైశ్య వారి ఉన్నతమైన సంబంధం కొరకు వెంటనే సంప్ర: 8500747535, 9533133969 రెండవ సంబంధములు కూడా చూడబడును.[H-793269]



# బాబుకు 'వరం' కాదని రామోజీ బాధ

- సీఎం వైఎస్ జగన్ హయాంలోనే అత్యధిక శాతం పోలవరం ప్రాజెక్టు పనులు
- తన కమీషన్ల కోసం ప్రాజెక్టును పణంగా పెట్టిన చంద్రబాబు
- అధిక లాభాలొచ్చే పనులు మాత్రమే చేపట్టడం నిజం కాదా?
- స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేయకుండానే ఎందుకు డయాఫ్రమ్ వాల్ నిర్మించారు?
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఎందుకు ఖాళీగా వదిలేశారు?
- అందుకే 2019 అక్టోబర్ 1న ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీలో వరద ప్రవాహం
- మీ చంద్రబాబు నిర్వాకం వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- ఆ తప్పిదాలన్నీ సరిచేస్తూ అత్యధిక శాతం పనులు చేయించింది ఈ ప్రభుత్వమే
- కరోనా, ఆర్థిక ఇబ్బందుల్లోనూ రికార్డు సమయంలో స్పిల్ వే పూర్తి
- 2021 జూలై 11న గోదావరి ప్రవాహం స్పిల్ వే మీదుగా మళ్లింపు
- ఈనెల 15తో దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- డయాఫ్రమ్ వాల్‌ను సరిచేయడంపై మేధోమథనం



2019 నవంబర్‌లో కాఫర్‌డ్యామ్‌లు ఇలా..



2023 ఫిబ్రవరిలో పూర్తయిన ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్‌లు

**సాక్షి, అమరావతి:** తన ఆత్మీయుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కుర్చీలో లేరనే అక్కసుతో ఒప్పును తప్పుగా చిత్రీకరించి ఉన్నది లేనట్లు కనికట్టు చేయడం తనకు మాత్రమే సాధ్యమైన పాత్రికేయమని రామోజీ ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూనే ఉన్నారు. తేలికగా చేయగలిగి.. అధికంగా వచ్చే లాభాలను కాంట్రాక్టర్‌తో కలిసి పంచుకుతినే పనులకే ప్రాధాన్యం ఇచ్చి, చంద్రబాబు.. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు జీవాన్ని తీశారు. పోలవరంను కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దుతూ ఇప్పుడు ప్రణాళికాయుతంగా సీఎం వైఎస్ జగన్ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తుంటే జీర్ణించుకోలేక 'ఆ ఐదేళ్లలోనే పనులు భేష్' శీర్షికతో శనివారం 'ఈనాడు'లో రామోజీ వంకరరాతలు రాశారు. ఆ రాతల్లో తమ దోపిడీకి అడ్డుకట్ట పడిందనే అక్కసు తప్ప మరొకటి కన్పించలేదు. అత్యధిక శాతం పనులు సీఎం వైఎస్ జగన్ హయాంలోనే పూర్తయ్యాయనే వాస్తవాన్ని మరుగున పరిచి చంద్రబాబుకు రాజకీయ లబ్ధి చేకూర్చాలనే తాపత్రయం రామోజీ కథనంలోని ప్రతి వాక్యంలోనూ కనిపించింది.

### ఆరోపణ : ప్రాజెక్టు నిర్మాణంలో ఆలస్యం

**వాస్తవం:** గోదావరిపై ప్రధాన డ్యామ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్) నిర్మించడానికి వీలుగా.. వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను తొలుత పూర్తి చేయాలి. ఈ పనులు పూర్తయ్యేలోగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. కానీ.. చంద్రబాబు మాత్రం ఆ పనులేవీ చేయకుండానే.. కమీషన్ల కోసం తేలికగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే మట్టి తవ్వకం, స్పిల్ ఛానల్‌లో కాంక్రీట్‌ను కుప్పలా పోయడం వంటి పనులకే ప్రాధాన్యం ఇచ్చారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండానే ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. స్పిల్ వే పునాది స్థాయిలోనే వదిలేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక.. వాటికి ఇరు వైపులా ఖాళీలు వదిలేసి, చేతులెత్తేశారు. దీంతో 2019 అక్టోబర్ 1న గోదావరికి దాదాపు 14 లక్షల క్యూసెక్కుల వరద (సీడబ్ల్యూసీ గేజ్ ప్రకారం) ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గూండా ప్రవహించడం వల్ల దాదాపు 13 మీటర్/సెకను వేగంతో వరద ఉధృతి పెరగడంతో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి, స్పిల్ వే మీదుగా వరద నీటిని మళ్లించి ఉంటే.. డయాఫ్రమ్ వాల్ దెబ్బతినే పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు. గోదావరి వరద ఉధృతి వల్ల ప్రధాన డ్యామ్ గ్యాప్-1 నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భం +23 మీటర్ల నుంచి -12.00 మీటర్ల వరకు అంటే దాదాపు 35 మీటర్ల మందంతో కోతకు గురైంది. గ్యాప్-2లో + 8 మీటర్ల నుంచి -12 మీటర్ల వరకు అంటే దాదాపు 20 మీటర్ల మందంతో, దిగువ కాఫర్ డ్యాం లో 36.5 మీటర్ల మందంతో గోదావరి గర్భం కోతకు గురైంది. స్పిల్ ఛానల్ లోని కాంక్రీటు బ్లాకులు (దిమ్మెలు) కొట్టుకుపోయాయి. వరద ఎగదన్నడంతో ముంపు గ్రామాలను గోదావరి వరద చుట్టుముట్టింది. నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీటన్నింటినీ సరిచేసేందుకే ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగింది.

### ఆరోపణ : బాబు హయాంలో చకచకా పనులు

**వాస్తవం:** రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయాన్ని భరించి.. అన్ని అనుమతులు తెచ్చి తామే పూర్తి చేస్తామని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చింది. ఆ మేరకు ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ)ని 2014 మే 28న ఏర్పాటు చేసి.. ఆ సంస్థతో ఒప్పందం చేసుకోవాలని నాటి టీడీపీ సర్కార్‌ను కోరుతూ వచ్చింది. ఒప్పందం చేసుకోకుండా కాలయాపన చేస్తూ.. పోలవరం నిర్మాణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగించాలని నాటి సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. ఈ క్రమంలో పార్లమెంట్ ద్వారా రాష్ట్రానికి హక్కుగా సంక్రమించిన ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టారు. దీంతో 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలోనే బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు రుణాలతో పోలవరానికి నిధులు ఇస్తామని.. 2018 డిసెంబర్‌లోగా పూర్తి చేయకపోతే ఇచ్చిన నిధులను రుణంగా పరిగణిస్తామని కేంద్రం పెట్టిన షరతులకు అంగీకరిస్తూ 2016 డిసెంబర్ 26న సీఎంగా చంద్రబాబు సంతకం చేశారు. ఆ తర్వాత 2016 డిసెంబర్ 30న పనులు ప్రారంభించారు. అంటే.. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన 2014 జూన్ 8 నుంచి 2016 డిసెంబర్ 30 వరకూ 31 నెలలపాటు పోలవరంలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. ఆ నాటి టీడీపీ ఎంపీ రాయపాటికి చెందిన సత్తా లేని ట్రాన్స్‌ట్రాయ్‌ని తప్పించాలని అనేక మార్లు కేంద్రం చెప్పినా పట్టించుకోలేదు. ఆ సంస్థనే అడ్డుపెట్టుకుని పోలవరం పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి, తేలికగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే పనులకే ప్రాధాన్యం ఇచ్చారు.

### ఆరోపణ : మంత్రుల మాటలు కోటలు దాటాయి

**వాస్తవం:** చంద్రబాబు నిర్వాకం వల్ల అస్తవ్యస్తంగా మారిన పోలవరాన్ని గాడిలో పెడుతూ.. ఆనాటి తప్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ ప్రణాళికా యుతంగా పోలవరాన్ని పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే యాక్షన్ ప్లాన్ రచించి, అమలు చేస్తున్నారు. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ... ఆర్థిక ఇబ్బందులను అధిగమించి.. 48 గేట్లతో సహా స్పిల్ వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్‌ను, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేసి.. 2021 జూలై 11న గోదావరి ప్రవాహాన్ని 6.1 కి.మీల పొడవున మళ్లించి చరిత్ర సృష్టించారు. చంద్రబాబు పాపాల వల్ల దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చే విధానాన్ని ఖరారు చేయడంపై డీడీఆర్పీ, సీడబ్ల్యూసీతో 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. 2022 ఏప్రిల్‌లో విధానాన్ని ఖరారు చేయడంతో.. దాని ప్రకారం 2022 జూలై 9 నాటికే 20 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది. వరదలు తగ్గాక పనులు చేపట్టి ఈ నెల 15 నాటికి 31.5 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది. గోదావరికి ఎంత పెద్ద వరద వచ్చినా నిశ్చితంగా ప్రధాన డ్యామ్ పనులను చేపట్టవచ్చు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని పంపులతో తోడేస్తూ.. కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చి, యథాస్థితికి తెచ్చే పనులను ముమ్మరం చేసింది. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను ఎలా సరిచేయాలనే అంశంపై 15 నెలలుగా డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ, ఐఐటీ(తిరుపతి, చెన్నై, ఢిల్లీ) ప్రొఫెసర్లు, ఎన్‌హెచ్‌పీసీతో రాష్ట్ర ప్రభుత్వం మేధోమథనం చేస్తోంది. డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చే పరీక్షలను ఇటీవల ఎన్‌హెచ్‌పీసీ పూర్తి చేసింది. ఆ సంస్థ నివేదిక ఇవ్వగానే డయాఫ్రమ్ వాల్‌పై ముందడుగు వేసి.. ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసే దిశగా చిత్తశుద్ధితో సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతినక పోయి ఉంటే.. 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ అధికారవర్గాలే స్పష్టం చేశాయి. ఇవన్నీ నిజాలే కదా! మంత్రులు ఈ వాస్తవాలు చెప్పడం మాటలు కోటలు దాటడమా రామోజీ?

### నిర్వాసితులకు మేలు చేసిందెవరు?

నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనుల్లో కమీషన్లు రావనే నెపంతో వాటిని టీడీపీ సర్కార్ చేపట్టకుండా వారిని నట్టేట ముంచింది. ఐదేళ్లలో కేవలం రూ.484 కోట్లు ఖర్చు పెట్టి 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించింది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల పునరావాసంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మూడేళ్లలోనే రూ.1,677 కోట్లు ఖర్చు పెట్టి 8,446 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. రానున్న రెండు మూడు నెలల్లో రూ.525 కోట్లతో మిగిలిన పునరావాసం పనులు పూర్తి చేసి.. 9,390 కుటుంబాలకు పునరవాసం కల్పించనున్నారు. తద్వారా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులు అందరికీ పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

# అత్యంత పారదర్శకంగా సీనరేజి టెండర్లు

- ప్రైవేటు 'ముద్ర' అంటూ ఈనాడులో అవాస్తవాలతో రాతలు
- ఈ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి స్థిరమైన ఆదాయం లభిస్తుంది
- రవాణా ఫారాలు డూప్లికేట్ చేస్తారనడం ఊహాజనిత ఆరోపణ
- టెండర్లలో అర్హత సాధించిన కాంట్రాక్టర్ ద్వారా మాత్రమే సీనరేజి వసూళ్లు
- ఇసుకపైనా అవగాహన లేని రాతలు
- గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో మైనింగ్ ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న సీనరేజి విధానంపై ఈనాడు పత్రిక అవాస్తవాలతో కూడిన కథనాన్ని ప్రచురించిందని గనుల శాఖ డైరెక్టర్ వీజీ పేర్కొన్నారు. సీనరేజి వసూళ్ల విధానంపై కనీస అవగాహన లేకుండా వరుసగా తప్పుడు కథనాలు రాయడం సరికాదన్నారు. 'ప్రైవేటు ముద్ర.. గుత్తేదారు చెప్పిందే లెక్క' శీర్షికతో ఈనాడు ప్రచురించిన కథనం పూర్తి అసత్యాలతో కూడి ఉందన్నారు. శనివారం ఒక ప్రకటన చేస్తూ.. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాలు, జనరల్ ఫైనాన్షియల్ రూల్స్-2017కి అనుగుణంగానే టెండర్లు పిలిచి సాంకేతికంగా, ఆర్థికంగా అర్హత ఉన్న వారికే సీనరేజి వసూళ్ల కాంట్రాక్ట్ ఇచ్చినట్టు తెలిపారు. ఆయా జిల్లాల్లో అత్యధికంగా వసూలైన సీనరేజి మొత్తంపై 10 శాతాన్ని అదనంగా కలిపి రిజర్వు ధరను నిర్ణయించామన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి స్థిరమైన ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. మినరల్స్ ఉత్పత్తి తగ్గినా ఆ భారాన్ని కాంట్రాక్టర్ మాత్రమే భరించాల్సి ఉంటుందని, దీనివల్ల ప్రభుత్వానికి ఎటువంటి నష్టం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయకపోవడం వల్ల అక్రమాలు జరుగుతాయని, డూప్లికేట్ రవాణా ఫారాలను తయారు చేస్తారంటూ ఊహాజనితమైన ఆరోపణలు చేశారని తెలిపారు. హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్‌తో కూడిన రవాణా ఫారాలను అన్ని భద్రతా ప్రమాణాలతో ముద్రించి, ఆయా జిల్లాల కాంట్రాక్టర్లు సమర్పించిన ఇండెంట్‌కు అనుగుణంగా వారికి అందిస్తున్నట్లు తెలిపారు. వీటికి నకళ్లు తయారు చేయడం కుదరదని, క్యూఆర్ కోడ్‌తో నకిలీ రవాణా ఫారాలను సులభంగానే వెంటనే గుర్తించవచ్చని తెలిపారు.

**గనుల శాఖకు రవాణా ఫారాలిస్తారు**

లీజుదారుడు ఉత్పత్తి చేసిన ఖనిజాన్ని కొనుగోలుదారుకు రవాణా చేసే సందర్భంలో కాంట్రాక్టర్ జారీ చేసే రవాణా ఫారాల్లో ఒక కాపీని కచ్చితంగా గనులశాఖ అధికారులకు సమర్పిస్తారని గనుల శాఖ డైరెక్టర్ తెలిపారు. ప్రతి నెలా గనుల శాఖ సహాయ సంచాలకులు, ఉప సంచాలకుల పర్యవేక్షణలో రవాణా ఫారాలను పరిశీలించి వాటి ద్వారా ఎంత ఖనిజం విక్రయించారో నిర్ధారిస్తారన్నారు. ఆ వివరాలతో సంబంధిత క్వారీలకు వెళ్లి మైనింగ్ ప్లాన్‌ను బట్టి ఎంత మినరల్స్ ఉత్పత్తి చేశారో తనిఖీ చేస్తారని తెలిపారు. రవాణా ఫారం, క్వారీ రికార్డుల్లో ఉత్పత్తి వివరాలు సరిపోకపోతే వెంటనే ఆ విషయం బయటపడుతుందని తెలిపారు. ఎక్కడా మైనింగ్ లీకేజీకి ఆస్కారం ఉండదన్నారు. టెండర్లలో కోట్ చేసిన ధర కన్నా ఎక్కువ మొత్తాన్ని సీనరేజి రూపంలో వసూలు చేస్తే.. ఆ అదనపు మొత్తానికి డీఎంఎఫ్, మెరిట్, ఐటీ, జీఎస్టీ తదితరాలను కాంట్రాక్టర్ నుంచి కట్టించుకుంటామని తెలిపారు. కాంట్రాక్టర్ తప్పుడు లెక్కలు చూపుతారంటూ చేసిన ఆరోపణల్లో అర్థం లేదని తెలిపారు.

**అర్హతల మేరకే..!:** సీనరేజి కాంట్రాక్టర్ ఎంపికలోనూ అన్ని నిబంధనలను పాటిస్తూ సాంకేతిక, ఆర్థిక అర్హత సాధించిన వారినే పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకే అబద్ధాలు, అసత్యాలు, అభూత కల్పనలతో అవాస్తవాలను ప్రచురించడంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకలో 20 నెలలుగా దోపిడీ జరిగిందంటూ ఈనాడు పత్రిక మరో ఊహాజనిత కథనం ప్రచురించిందన్నారు. గతంలో ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వానికి పెద్దఎత్తున రావాల్సిన ఆదాయం ఇసుక మాఫియా జేబుల్లోకి వెళ్లిందని అన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22,Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.